నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com
సోమవారం | 28 జనవరి 2019 | హైదరాబాద్
సంపుటి 12 | సంచిక 89
| పేజీలు 12+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, బహుళ పక్ష తిథి : అష్టమి రా.8.02, నక్షత్రం. స్వాతి రా.7.55, వర్జ్యం రా.1.31 నుంచి 3.07 వరకు
రాహుకాలం: ఉ.7.30 నుంచి 9.00 వరకు, దుర్ముహూర్తం: మ.12.24 నుంచి 1.12 వరకు, తిరిగి మ. 2.46 నుంచి 3.34 వరకు సూర్యోదయం : ఉ.6.34 గం; సూర్యాస్తమయం: సా.5.54

ముహూర్తం దగ్గరున్నది!

- జ్యోతి శాస్త్ర ప్రకారంగా ఈ నెల 31 బాగుందా?
- ఆ రోజు లేదా ఫిబ్రవరి 10న విస్తరణకు ఛాన్స్
- తొలుత ఆరుగురు నుంచి 8 మందికి అవకాశం
- లోక్ సభ ఎన్నికల అనంతరం మరో విడత విస్తరణ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైందా..? త్వరలోనే విస్తరణ ఉంటుందా..? అంటే అవుననే ఊహగహానాలు వినిపిస్తున్నాయి. ఈ నెల 31వతేదీ కానీ వచ్చే నెల 10నతేదీన మంత్రివర్గ విస్తరణకు అవకాశాలున్నాయని అధికారపార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడి దాదాపు నెలన్నర రోజులు కావస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గ విస్తరణపై దృష్టిసారించారంటున్నారు. దీంతో మంత్రి పదవులు ఆశిస్తున్న ఎమ్మెల్యేలంతా విస్తరణ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు విస్తరణపై అనేక ముహూర్తాలు తెర మీదకు వచ్చినా, అందులో ఒక్కటీ కూడా నిజం కాలేదు. ఈ నెల 31న లేదా వచ్చే నెల 10న మంచి ముహూర్తాలు ఉండటంతో, మంత్రివర్గ విస్తరణ ఉంటే ఉండొచ్చుననే ఊహగహానాలు వినిపిస్తున్నాయి. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశాలున్నాయని అధికారపార్టీ ఎమ్మెల్యేలంటున్నారు. తొలుత 6 నుంచి 8 మందితో కేబినెట్ ఏర్పాటు చేసి, లోక్‌సభ ఎన్నికల అనంతరం మిగతా 6లో

ఎన్నికల జిమ్మిక్కేనా?

ఉద్యోగాల భర్తీ లేనప్పుడు ఈబీసీ రిజర్వేషన్లు ఎందుకు?

- కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో లక్షలాది ఉద్యోగాల ఖాళీలు
- పది శాతం కోటాతో అగ్రవర్ణాల ఓట్లు కొల్లగొట్టేలా స్కెచ్
- వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈబీసీ మంత్రం
- జనాభా దామాషా ప్రకారం బీసీలకు అన్ని రంగాలలో రిజర్వేషన్ పెంచాలి
- 56 శాతం ఉన్న బీసీలకు రాజకీయ రంగంలో 14శాతమే ప్రాతినిధ్యమా?
- విద్యా, ఉద్యోగ రంగాలలో నామమాత్రం, పారిశ్రామిక రంగంలో అట్టడుగున
- చట్ట సభలలో జనాభా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి
- వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్
- ప్రధాని నరేంద్ర మోడీకి బీసీ నేత ఆర్.కృష్ణయ్య బహిరంగ లేఖ



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ఎన్నికలు సమీపించే ప్రతీసారి..మొసలి కన్నీళ్లు కార్చడం రాజకీయ నాయకులకు అలవాటైపోయింది. దేశాన్ని మేమే ఉద్ధరి స్తున్నాం అన్ని వర్గాలను అభివృద్ధి చేసింది మేమే అని నిస్సిగ్గుగా ప్రకటించుకోవడం పాలకులకు పరిపాటిగా మారింది. దేశానికి స్వాతంత్రం వచ్చి 7 దశాబ్దాలు గడిచిపోయాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పూర్తిగా అమలు చేయలేక పోవడం పాలకుల వైఫల్యమే. పాలకుల నిర్లక్ష్యం కారణంగా దేశంలో నేటికినీ నిరక్షరాస్యతను నిర్మూలించలేక పోవడం పాలకుల చేతగాని తనమే. ప్రభుత్వంలోని పాలకులు ఆయా రాజకీయ పార్టీల అవసరాలకనుగుణంగా రాజ్యాంగాన్ని సవరిస్తున్నారే తప్ప..ప్రజా ప్రయోజనాలకోసం కాదనే విమర్శలు కోకొల్లలు. అలాగే వచ్చే సార్వత్రిక ఎన్నికలలో



లబ్ధిపొందేందుకే ప్రధాని నరేంద్రమోడీ అగ్రకుల పేదలకు పదిశాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని బడుగు నేతలు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖలల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా.. వాటిని భర్తీ చేయకుండా ఈబీసీ రిజర్వేషన్లు అమలు చేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ప్రధాని నరేంద్రమోడీకి బహిరంగ లేఖ రాశారు. దేశ జనాభాలో అత్యధిక శాతం గల బీసీల అభ్యున్నతిని విస్మరిస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికీ రాజకీయం రంగంలో 14శాతం ప్రాతినిథ్యం దక్కలేదంటే..ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ప్రశ్నిస్తున్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభలలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అగ్రకులాల్లోని మిగతా 6లో

ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత జకోవిచ్

- నాదల్‌పై మూడు వరుస సెట్లలో విజయం
- ఆస్ట్రేలియన్ టైటిల్ గెలవడం ఇది ఏడోసారి
- ఆయన ఖాతాలో 15వ గ్రాండ్‌స్లామ్ టైటిల్
- గ్రాండ్‌స్లామ్ టైటిల్లలో సంప్రాస్ రికార్డు బ్రేక్
- మూడో స్థానానికి చేరిన నొవాక్

12లో



ఇండోనేషియా మాస్టర్స్ సైనాదే

- టోర్నీ ప్రారంభం నుంచి అదరగొట్టిన క్రీడాకారిణి
- ఫైనల్స్‌లో కరోలినా మారిన్‌తో పోరు
- 10-4తో ముందంజలో ఉన్నప్పటికీ గాయంతో వైదొలిగిన మారిన్
- సైనా ఖాతాలో ఈ ఏడాది తొలి టైటిల్

12లో



వైఎస్ జగన్‌తో దగ్గుబాటి భేటీ

- త్వరలో వైసీపీ తీర్థం!
- పురందేశ్వరి మాత్రం బీజేపీలోనే!

వివరాలు 3లో



సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్



జగన్ 'మోడీ రెడ్డి'

వైఎస్ఆర్ కాంగ్రెస్ అధినేతపై లోకేష్ మండిపాటు

- మాకు 25 ఎంపీ సీట్లు ఇస్తే దేశ ప్రధానిని బాబు నిర్ణయిస్తారు
- బాబు జెండా సంక్షేమం, అజెండా అభివృద్ధి
- బీజేపీ నిలదీయాల్సింది మనల్ని కాదు మోడీని
- ఎన్నికల నేపథ్యంలో కుల, మత చిచ్చు రాజేసే యత్నాలు
- ఏపీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శ
- టీడీపీ బలహీన వర్గాలకు అండగా ఉంది

(రాజమహేంద్రవరం సూర్య ప్రత్యేక ప్రతినిధి) : వైసీపీ అధినేత వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి "మోడీ రెడ్డి"గా వ్యవహరిస్తున్నారని మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. "ప్రతిపక్ష నేత మోదీ గురించి మాట్లాడడం లేదు. ప్రతిపక్షం నాలుగు డ్రామాలు వేసింది. మొదటిది రాజీనామా డ్రామా, రెండోది కోడికత్తి డ్రామా. ఏపీ పోలీసుల రక్షణ కావాలి కానీ వారిపై నమ్మకం లేదంట. మూడోది ఆవు అంబులెన్స్ డ్రామా. నాలుగోది ఫెడరల్ ఫ్రంట్ డ్రామా. ప్రతిపక్షనేత జగన్మోహన్‌రెడ్డి కాదు. జగన్ మోదీ రెడ్డి. కర్ణాటక ఎన్నికల్లో మోదీకి చూపించింది ట్రైలర్ మాత్రమే. అసలైన సినిమా 2019లో తెలుగు ప్రజలు చూపిస్తారు. విభజన హామీలను నెరవేర్చినవారినే ప్రధాని చేస్తాం" అని మంత్రి లోకేష్ చెప్పుకొచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆర్ట్సుకళాశాల మైదానంలో జయహో బీసీ సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి టీడీపీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు స్పీడును ఎవరూ మిగతా 6లో

రాజకీయ వేదిక కాదు

మన్ కీ బాత్‌పై ప్రధాని వ్యాఖ్య



- దేశ ప్రజలతో కాసేపు ముచ్చటించాలన్నదే ఉద్దేశం
- దీనిని వినే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది
- సుభాష్ చంద్ర బోస్, శివకుమార స్వామి ఎనలేని సేవ చేశారు
- అంతరిక్షంలో పరిశోధనలు చేసే స్థాయికి భారత యువత
- విద్యార్థులను అందరూ ప్రోత్సహించాలి
- కలాం శాట్‌ను భారత విద్యార్థులే తయారు చేసి ప్రారంభించారు
- అన్ని మాధ్యమాల కంటే రేడియో మాధ్యమం ప్రభావవంతం
- అర్హతగల యువత ఓటర్లుగా నమోదు చేయించుకోవాలి
- ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈసీ కృషి

న్యూఢిల్లీ : మన్ కీ బాత్ కార్యక్రమం అనేది రాజకీయ ఉపన్యాసాలు ఇవ్వడానికి నిర్వహించడం లేదని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. రేడియో ద్వారా దేశ ప్రజలతో కాసేపు ముచ్చటించాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమని మిగతా 6లో

అంతే ఇంతే!




మీరేమైనా వరుణయాగం చేసారా అని అడుగుతున్నారు సార్

అమరావతి చరిత్రలో కీలకం

- ఫిబ్రవరి 3 చరిత్రాత్మక రోజు
- అమరావతి ఐదు కోట్ల ఆంధ్రుల సెంటిమెంట్
- తాత్కాలిక హైకోర్టు భవనాన్ని ప్రారంభించనున్న సీజేఐ
- రాష్ట్ర చరిత్రలో మరో మహత్తర ఘట్టం
- 42 ఎకరాల్లో రూ.1400 కోట్లతో హైకోర్టు భవన సముదాయ నిర్మాణం
- న్యాయ కార్యకలాపాలకు కేంద్రంగా అమరావతి
- 450 ఎకరాల్లో న్యాయ నగర నిర్మాణం
- తొలిదశ 2022 కల్లా పూర్తి రెండో దశ 2036కి
- రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి చోదక శక్తి : సిఎం చంద్రబాబు





విజయవాడ, సూర్య బ్యూరో : సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌లో మరో చరిత్రాత్మక రోజు ఆవిష్కృతమవనుంది. ఫిబ్రవరి 3న తాత్కాలిక హైకోర్టు భవనాన్ని ప్రారంభించనున్నారు. ఆ మహత్తర ఘట్టం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. న్యాయ వ్యవస్థ సమగ్ర కార్యకలాపాలకు అమరావతి విశిష్ట కేంద్రంగా మారనుందన్నారు. అందులో భాగంగానే ఐకానిక్ హైకోర్టు కాంప్లెక్సును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఐదు అత్యుత్తమ ప్రపంచ శ్రేణి రాజధానుల్లో ఒకటిగా అమరావతిని నిర్మిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు చర్త్రిను తిరగరాస్తున్నారని, అమరావతి తెలుగు ప్రజలకు గర్వకారణమని, అభివద్ధికి చిహ్నామని సీఎం స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మిగతా 6లో

పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను పెంచిన కేంద్రం

హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 24 లక్షల మంది విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన చార్జీలు త్వరలో పెరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థులకు వండి పెట్టే కూరగాయలు, నూనె, ఉప్పు, పప్పులకు ఒక్కో విద్యార్థి పై వంట ఏజెన్సీలకు చెల్లించే మధ్యాహ్న భోజనం ధరలను 2016లో పెంచిన కేంద్రం రెండేళ్ల తర్వాత మళ్లీ పెంచింది. 5.35 శాతం ధరలను పెంచి 2018 ఏప్రిల్ 1 నుంచి వాటిని వర్తింపజేయాలని అన్ని రాష్ట్రాలను ఇటీవల ఆదేశించింది. ఇందులో భాగంగా పాఠశాల విద్యాశాఖ కూడా ప్రభుత్వానికి ప్రతి పాదనలను పంపించింది. ఎన్నికల కోడ్ ముగిశాక వీటికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేయనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 28,621 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. దీనిలో భాగంగా కూరగాయలు, ఉప్పు, పప్పు, నూనె తదితర వంట సామగ్రి కోసమే రోజూ రూ. 1,23,05,648 వెచ్చిస్తోంది. నిత్యం రూ. 1,29,67,108 వెచ్చిం చాల్సి ఉంది. అంటే దాదాపు రూ.7 లక్షలు అదనంగా వెచ్చించాలి. ఇందులో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని దాదాపు 19 లక్షల మందికి పైగా విద్యార్థులకు అయ్యే ఖర్చులో కేంద్రం 60 శాతం భరిస్తుండగా, రాష్ట్రం 40 శాతం భరిస్తోంది. 9, 10 తరగతుల్లోని 4,73,883 మంది విద్యార్థు లకు అయ్యే మొత్తంలో కేంద్రం వాటా లేనందున రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం వెచ్చిస్తోంది.



75 లక్షల పార్టీ సభ్యత్వ నమోదే లక్ష్యం

- 2017లో 70 లక్షల మంది పార్టీ సభ్యులు
- ఫిబ్రవరి నుంచి సభ్యత్వ నమోదుకు శ్రీకారం
- ఏప్రిల్‌లో సంస్థాగత ఎన్నికల నిర్వహణ
- క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతంపై కేటీఆర్ నజర్

హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)ని క్షేత్రస్థాయిలో బలోపేతశక్తిగా మార్చేందుకు పార్టీ నాయకత్వం కసరత్తు ప్రారంభించింది. ఈమేరకు అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే సిరిసిల్ల శాసనసభ్యుడు, మాజీ మంత్రి కేటీరామారావుకు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలను టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పగించిన వివిషయం తెలిసిందే. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన కేటీఆర్, ఫిబ్రవరి నుంచి ఆపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా రికార్డుస్థాయిలో 75 లక్షల మంది సభ్యుల చేత సభ్యత్వ నమోదు చేయించాలని ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు ఆయన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఈసారి రికార్డుస్థాయిలో సభ్యత్వ నమోదు ఉండేవిధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కేటీరామారావు పార్టీ నేతలకు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. దీంట్లో భాగంగా సభ్యత్వ నమోదుతోపాటు గ్రామస్థాయి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్ని కలు జరుగుతాయి. రికార్డుస్థాయిలో సభ్యత్వ నమో దు చేసి టీఆర్ఎస్‌ను రాష్ట్రంలో తిరుగులేని రాజకీయశక్తిగా మార్చాలని కేటీఆర్ భావిస్తున్నారు. ఇన్నాళ్లు కొంత నిర్లక్ష్యానికి గురైన పార్టీ శ్రేణులు క్రియాశీలమయ్యేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి కాగానే టీఆర్ఎస్ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ మొదలుకానుంది. సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అనంతరం దశలవారీగా గ్రామ, మండల కమిటీల ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే గతంలో సాంప్రదాయంగా జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తూ వచ్చారు. అయితే గులాబీ దళపతి మాత్రం నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా కమిటీల, నియోజకవర్గస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలా? అన్నదానిపై టీఆర్ఎస్ నాయకత్వం త్వరలోనే ఒక ప్రకటన చేసే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఏప్రిల్ 27న టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికతో ముగియనుంది. 2017 సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా 70 లక్షలసభ్యుల పేర్లను నమోదు చేసినట్లు ఎమ్మెల్యేలు, నియోజకవర్గస్థాయి నేతలు పార్టీ కార్యాలయానికి నివేదించారు. అయితే ఈసారి 75 లక్షల సభ్యత్వ నమోదు చేపట్టాలని టీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రాకముందే వీటిని పూర్తి చేసే యోచనలో టీఆర్ఎస్ అధిష్టానం ఉంది.

అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు : వరంగల్, జనగామ జిల్లా కార్యాలయాల నిర్మాణానికి ఇప్పటికే టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. త్వరలోనే మిగతా జిల్లాల్లోనూ, పార్టీ కార్యాలయాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపనలు పూర్తి చేసి, నిర్మాణ పనులను ప్రారంభించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. చేయనున్నారు. కేటీఆర్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత, టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో సమాచార వ్యవస్థ కోసం ప్రత్యేకంగా




ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం కోసం టీఆర్ఎస్‌లో మొదటిసారి కొత్త రకమైన వ్యవస్థను ఏర్పాటు చేయబోతోంది. తెలంగాణభవన్‌లో ప్రత్యేంగా ప్రజాఫిర్యాదుల విభాగం(పబ్లిక్ గ్రీవెన్స్‌సెల్)ను ఏర్పాటు చేయాలని కేటీఆర్ నిర్ణయించారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సలహా లు, సూచనలు ఇచ్చేలా పార్టీ వ్యవస్థను రూపొం దిస్తున్నారు. ప్రజలు ఎవరైనా సమస్యలపై పార్టీ వారి ని ఆశ్రయిస్తే వాటిని పరిష్కరించేలా అధికారిక వ్య వస్థకు, ఎమ్మెల్యేలకు నివేదించేలా ఈ వ్యవస్థ ఉండనుందని పార్టీ నేతలు చెబుతున్నారు.

వెలుగొండ ప్రాజెక్టు కోసం 30న దీక్ష



విజయవాడ, మేజర్‌న్యూస్: వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రకాశం జిల్లా కరువును పారదోలాలని కోరుతూ ఈ నెల 30న దీక్ష చేపట్టనున్నట్లు ఏపీ పీసీసీ అధికార ప్రతినిధి ఏలూరి రామచంద్రారెడ్డి వెల్లడించారు. జిల్లా అభివృద్ధి కోసం చేపట్టే ఈ దీక్షలో పార్టీలకతీతంగా అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆదివారం నాడు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశం పశ్చిమ ప్రాంతం నిరంతర కరువుకాటకాలతో సతమతమవుతోందన్నారు. ఈ కరువును ఎదుర్కొనేందుకు ఉన్న ఏకైక మార్గం వెలుగొండ ప్రాజెక్టు అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిచేసేందుకు వచ్చే బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు కేటాయించాలని కోరారు. ఇందుకోసం ఈ నెల 30న మార్కాపురంలో తాను ఒక రోజు దీక్ష చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. 22 సంవత్సరాలు దాటుతున్నా ఈ ప్రాజెక్టు పూర్తికాకపోవడం విచారకర మన్నారు. ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన నాడు సీఎంగా నేడు సీఎంగా ఉన్నది చంద్రబాబుయే కాబట్టి ఈ వెలుగొండ ప్రాజెక్టుపై ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. లేనిపక్షంలో ఆయన ప్రకాశంజిల్లాపై శీతకన్ను ప్రదర్శించి నట్లేనని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలోని 32 మండలాలకు సాగునీరు, 16 లక్షల 50వేల మందికి తాగునీరు అందుతుందన్నారు.

సమాజంలో మీడియా పాత్ర అత్యంత కీలకం : దత్తన్న



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. స్వేచ్ఛగా స్వతంత్రంగా వుండాలని, ప్రభుత్వాలయొక్క లోపాలను, అవినీతిని బయటపెడుతూ, ప్రభుత్వ పథకాలలో, పాలసీలలో ఏవైనా లోపాలుంటే నిర్మా ణాత్మక సలహాలు ఇవ్వాలని సూచించారు. జర్నలిస్టు లమీద జరిగే దాడులపట్ల వెంటనే స్పందించి దాడిచేసినవారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మీడియా రంగం సమా జంలో అత్యంత ప్రాముఖ్యత కలిగి వున్నా రంగమని, ఇది ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం లాంటిదని పేర్కొన్నారు. మీడియా ఏ ఒక్కరి చేతిలోనూ బందీ కాకూడదని, మీడియా కొందరి గుత్తాధిపత్యం క్రింద ఉండరాదని వారు అభిలషించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తానూ కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా వున్నప్పుడు అత్యంత ప్రాధాన్యత ఇచ్చానని తెలిపారు. జర్నలిస్టులకు సకాలంలో వేతనాలు అందేలా మజీతియా వేజ్ బోర్డు కమిటీ రిపోర్ట్ ను వెంటనే అమలు పర్చాలని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు తాను లేఖలు వ్రాసానని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సీనియర్ జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ వెంటనే వంద కోట్ల రూపాయల తో జర్నలిస్టుల సంక్షేమ నిధి ని ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతీ జర్నలిస్టుకూ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఈ సందర్భంగా దత్తన్న కోరారు.

లక్షల కోట్ల నిధులతో రాజకీయ పార్టీలు నడపడం అవసరమా?



- అన్నీ తెలుసని చంద్రబాబు అనుకుంటారు
- కానీ, క్షేత్ర స్థాయిలో జరిగేది ఆయనకు తెలియదు
- అవినీతి వారసత్వ రాజకీయాలతో విసిగిపోయాం
- అణగారిన వర్గాల కోసం తెగించి పోరాడతా
- తెనాలిలో నాదెండ్ల, గుంటూరులో తోట పోటీ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్

గుంటూరు,సూర్యబ్యూరో: అవినీతి వారసత్వ రాజకీయాలతో విసిగిపోయామని ఇకనైనా వాటికి స్వస్తి పలుకుదామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఆదివారం గుంటూరులో జనసేనా కార్యాలయంప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సినిమాల్లో హీరోగా ఎన్నో పాత్రలను పోషించానని నిజజీవితంలో కూడా హీరోగా నిజాయతీతో ఉండటానికే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. అణగారిన వర్గాలకు న్యాయం చేస్తానని... తెగించి పోరాడుతానని తెలిపారు. రాజధానికి దగ్గర్లో ఉండే గుంటూరులో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం దారుణమని అన్నారు. డ్రైనేజీలో ఉన్న లోపం కారణంగా... కలుషిత నీటిని తాగి పలువురు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు అన్నీ తెలుసని అనుకుంటారని... కానీ, క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతోందో ఆయనకు తెలియదని చెప్పారు. లక్షల కోట్ల నిధులతో రాజకీయ పార్టీలు నడవడం అవసరమా? అని ప్రశ్నించారు. జిల్లాలో జనసేన బలమేంటో చూపిస్తామనిపవన్ కల్యాన్ తెలిపారు. మరో ఇద్దరు అభ్యర్థులను పవన్ ప్రకటించారు. గుంటూరునుంచి తోట చంద్రశేఖర్,తెనాలి నుంచి నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తారని శంఖారావా సభావేదికగా పవన్ స్పష్టం చేశారు. తోట చంద్రశేఖర్ ఓడిపోయిన గుంటూరు నుంచే 2019లో గెలిపిస్తానని మాట ఇచ్చానని తెలిపారు. నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచి పోటీ చేయబోతున్నారని,మనోహర్ నాకు కొండంత అండ,గుంటూరు జిల్లాలో జనసేన బలం చూపిస్తాం అన్నారు. బడుగు,బలహీనవర్గాలను అక్కున చేర్చేకోని అమరావతిని స్వాదీనం చేసుకుంటాం అన్నారు. అమరావతి గడ్డపై జనసేన జెండా ఎగురవేస్తాం, మీరు నాకు అండగా ఉన్న లేకున్నా,నేను మీకు జీవితాంతం అండగా ఉంటానని తెలిపారు. నాది కులం రెల్లి కులం,అన్ని కులాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తానని ఈసందర్భంగా తెలిపారు.

బీసీల ఓట్లు కావాలి, కానీ సీట్లు ఇవ్వరా?



హైదరాబాద్, మేజర్‌న్యూస్: సీఎం చంద్రబాబు నాయుడు బీసీలకు చేసిందేమి లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ సమన్వ యకర్త మార్గాని భరత్ రామ్ విమర్శించారు. నాలుగున్నరేళ్లలో బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా నెరవేర్చరా అని ప్రశ్నించారు. ఆదివారం ఆయన పార్టీ కేంద్రకార్యాలయంలో మీడియాతో మాట్లా డుతూ చంద్రబాబు బీసీలకు తీరని అన్యాయం చేశారని, రాజమండ్రిలో జయహో బీసీ సభ నిర్వహించే అర్హత టీడీపీకి లేదన్నారు. బీసీల ఓట్లు కావాలి కానీ సీట్లు మాత్రం ఇవ్వరా అని నిలదీశారు. జన్మభూమి కమిటీలతో అట్టడుగు వర్గాలు నలిగిపోతున్నాయని, టీడీపీ ప్రభుత్వ వైఫల్యంతో ప్రతి పేదవాడు ఆకలితో అలమటిస్తున్నాడని మండిపడ్డారు. నవరత్నాలను కాపీ కొడుతు చంద్రబాబు గొప్పలు చెప్తున్నారని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు బీసీలంతా ఓటుతో బుద్ధి చెప్తారని మార్గాని భరత్ జోస్యం చెప్పారు.

సహాయ మంత్రి హోదా లేకుండా పార్లమెంట్ కార్యదర్శుల నియామకం?

- ఛత్తీస్‌గఢ్‌లోను ఇదే విధానం అమలు
- తెలంగాణలో అమలు చేసే అవకాశం
- న్యాయపరమైన చిక్కులు అధిగమించేందుకే..

హైదరాబాద్, మేజర్‌న్యూస్: టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మరోసారి పార్లమెంట్ కార్యదర్శులను నియమిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల విస్పష్టం చేశారు. ప్రస్తుతం 31 జిల్లాలున్న తెలంగాణలో జిల్లాకు ఒక మంత్రిని నియమించుకోవాలన్న 15 శాతం నిబంధన అడ్డు వచ్చే అవకాశాలుండడంతో, పార్లమెంట్ కార్యదర్శుల నియామకం ద్వారా ఈ ఇబ్బందిని అధిగమించవచ్చునని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ కార్యదర్శుల నియామకానికి ఉన్న న్యాయపరమైన అడ్డంకులను అధిగమించడం ద్వారా, పార్లమెంట్ కార్యదర్శులను నియమించాలని యోచిస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలోను ఆరుమంది ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి కేసీఆర్ పార్లమెంట్ కార్యదర్శులుగా నియమించిన విషయం తెలిసిందే. అయితే పార్లమెంట్ కార్యదర్శుల నియామకాన్ని సవాల్ చేస్తూ విపక్షాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, పార్లమెంట్ కార్యదర్శుల నియామకం చెల్లదంటూ కోర్టు తీర్పునిచ్చింది. అయితే ఈసారి ఎటువంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా, ఉండేందుకు వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాన్ని అధ్యయనం చేసే బాధ్యతలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషీ, కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్‌లకు అప్పగించారు. పార్లమెంట్ కార్యదర్శులకు కేబినెట్ హోదా ఇవ్వడం వల్లే, న్యాయపరమైన ఇబ్బందులొచ్చే అవకాశాలున్నాయని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం , సహాయ మంత్రి హోదా లేకుండానే పార్లమెంటరీ కార్యదర్శులను నియమించాలని యోచిస్తోంది. శాసనసభ్యుల సంఖ్యలో మంత్రుల సంఖ్య 15 శాతం దాటకూడదని 2003 నాటి కేంద్ర ప్రభుత్వ చట్టం



నిర్దేశిస్తున్న నేపథ్యంలో రాజ్యాంగ పరమైన ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకే సహాయ మంత్రి హోదా ఇవ్వవద్దని భావిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోనూ సహాయ మంత్రి హోదా ఇవ్వకుండానే పార్లమెంటరీ కార్యదర్శుల నియమించడంతో, రాష్ట్ర ప్రభుత్వం, ఛత్తీస్‌ఘడ్ అవలంభించిన విధానాన్నే, అవలంభించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్‌లలో పార్లమెంట్ కార్యదర్శులను గతంలో నియమించారు. ఢిల్లీ, మధ్యప్రదేశ్ నియామకాలను న్యాయస్థానం కొట్టేయగా, ఛత్తీస్‌గఢ్ నియామకాలను మాత్రం కోర్టు కొట్టేయలేదు. అందుకే, అక్కడి పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలిస్తోంది. పార్లమెంటరీ కార్యదర్శులకు కూడా సహాయ మంత్రి హోదా ఇవ్వడం వల్ల చట్టం విధించిన 15 శాతం పరిమితి దాటినట్లు అవుతుందనే రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సహాయ మంత్రి హోదా అనే పదం ఉండడంతో వారు మంత్రులు అనే భావన వస్తోందంటున్నారు. అందుకే, సహాయమంత్రి హోదా లేకుండానే పార్లమెంటరీ కార్యదర్శి పదవులు కట్టబెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. అసెంబ్లీలో ఛీఫ్ విప్, విప్‌లు ఎమ్మెల్యేల సమన్వయానికి పార్లమెంటరీ కార్యదర్శులు దోహదపడుతున్నారు. పార్లమెంటరీ కార్యదర్శుల నియామకం వల్ల వచ్చే నష్టమేమీ లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొత్తతరం మంత్రులను తయారు చేసుకోవడానికి ఇదో మార్గమని చెబుతున్నారు. చట్టసభలో యువ సభ్యులను సీనియర్ మంత్రులకు సహాయకులుగా నియమించడం ద్వారా, వారు ఆయా శాఖల దైనందిన వ్యవహారాలను తెలుసుకుని అనుభవం గడించే అవకాశ ఉందంటున్నారు. ఆ శాఖ వ్యవహారాల్లో కేబినెట్ మంత్రి నిర్ణయం, అంతిమం కావడంతో, పార్లమెంట్ కార్యదర్శుల వ్యవస్థ కొత్తవార్ని మంత్రులుగా సిద్ధం చేసుకోవడానికి దోహదపడుతుందంటున్నారు .

స్పీకర్ పదవిని భ్రష్టు పట్టించారు



గుంటూరు, మేజర్‌న్యూస్: కోడెల స్పీకర్ పదవిని భ్రష్టు పట్టిస్తున్నారని వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. తన 'డీమార్ట్' నిర్మాణం కోసం అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. డబ్బులు అడిగిన లారీ ఓనర్లను బెదిరిస్తున్నారని చెప్పారు. రాజ్యాంగ పదవిలో ఉండి రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. అపార్ట్‌మెంట్ కట్టుకోవాలంటే ఒక్కో ప్లాట్‌కు 50వేలు లంచం అడుగుతున్నారని తెలిపారు. సొంత పార్టీలో ఉండేవారిని సైతం కోడెల కుమారుడు వదలటం లేదన్నారు. వీరి అక్రమాలకు జనం ఓట్ల రూపంలోనే సమధానం చెప్తారని అన్నారు.





హైదరాబాద్‌లో ఆదివారం ఏర్పాటైన ఓ కార్యక్రమంలో 'ఎన్.టి.ఆర్ - ఏ బయోగ్రఫీ' పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి కాపీని నందమూరి రామకృష్ణకు అందజేస్తున్న కేంద్ర మాజీ మంత్రి ఆశోక్ గజపతి రాజు, రిటైర్డ్ ఐఆర్ఎస్ చంద్రహాస్, రిటైర్డ్ ఐఏఎస్ లక్షీనారాయణ ఈ గ్రంథాన్ని రచించారు.

గాంధీభవన్‌లో కిసాన్ కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాల సదస్సు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: దేశంలో వ్యవసాయ సంక్షోభం, రైతు ఆత్మహత్యల నేపథ్యంలో వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమం విషయంలో అనుసరించాల్సిన అంశాల పైన కాంగ్రెస్ పార్టీ భిన్నమైన వ్యవసాయ విధానాలపైన చర్చించేందుకు ఈ నెల 29న ది ణాది రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ సదస్సును గాంధీభవన్‌లో జరుగనుందని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేశ్ రెడ్డిలు తెలిపారు. ఆదివారం నాడు వారు గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈ సమావేశంలో దేశంలోని వ్యవసాయ సంక్షోభం, రైతు ఆత్మహత్యలపై సుధీర్ఘంగా చర్చించడం జరుగుతుందని రోజు మొత్తం జరిగే ఈసదస్సులో వ్యవసాయ అభివృద్ధి రైతు సంక్షేమానికి తీసుకోవాల్సిన అంశాలపై ప్రతిపాదన, నిపుణలతో చర్చలు ఉంటాయని వారు వివరించారు. ఈ సదస్సుకు పార్టీ ముఖ్య నేతలతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారని వారు తెలిపారు.



- బీసీని చంద్రబాబు సీఎం చేయగలరా?
- బీసీలపై చంద్రబాబుది కపట ప్రేమ
- బీసీ ప్రధానిని ఆయన తిడుతున్నారు
- చంద్రబాబు వ్యక్తిత్వాన్ని బీసీలు అర్థం చేసుకుంటున్నారు
- బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు

బీసీని మేము ప్రధాని చేశాం

అమరావతి,సూర్యబ్యూరో: తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న బీసీ గర్జనపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మండిపడ్డారు. బీసీలపై ముఖ్యమంత్రి చంద్రబాబుది కపట ప్రేమ అని విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని ప్రధానమంత్రిని చేసిన ఘనత బీజేపీదని బీసీని చంద్రబాబు సీఎం చేయగలరా? అని సవాల్ విసిరారు. బీసీ అయిన ప్రధాని మోదీపై చంద్రబాబు అవాకులు చవాకులు పేలుతున్నారని బీసీలపై ఆయనకు ఎంత ప్రేమ ఉందో వెనుకబడిన కులాల వారు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. స్కూల్ యూనిఫాంలు కుట్టినవారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. పార్లమెంటులో పోలవరం ప్రాజెక్టు గురించి బీజేపీ మాత్రమే ప్రస్తావించిందని పోలవరంపై మాట్లాడే హక్కు బీజేపీకి మాత్రమే ఉందని చెప్పారు. నదుల అనుసంధానానికి వాజ్ పేయి మాత్రమే కృషి చేశారని అన్నారు.

ఏపీలో పొత్తులు తేలిపోయాయి

- బహుముఖ పోటీ తప్పదా? • ఓట్లు చీలితే, ఎవరికి కలిసి వచ్చేను • అధికారంలో ఉన్న టీడీపీకి కలసివస్తుందా? • ప్రతిపక్ష వైసీపికి కలసివస్తుందా? • జనసేన పట్టు సాధిస్తుందా? • కింగ్ ఎవరు, కింగ్ మేకర్ ఎవరు? • కీలకంగా మారుతామన్న జనసేనాని?

హైదరాబాద్,అమరావతి,సూర్యబ్యూరో: ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే 2019 సార్వత్రిక ఎన్నికల్లో పొత్తులపై దాదాపు క్లారిటీ వచ్చేంది. పొత్తులు లేకుండానే పార్టీలు బరిలోకి దిగాలని నిర్ణయించాలని ఆయా ప్రధాన పార్టీలు ఓనిర్ణయానికి వచ్చేన్నట్లు తెలుస్తుంది. ఈసారి ఎన్నికల్లో బహుముఖ పోటీ తప్పేదా లేదు,మరి ఈపోరు ఏపార్టీకి కలిసి వచ్చేనని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతుంది. ఈఎన్నికల్లో కింగ్ ఎవరు, కింగ్ మేకర్ ఎవరు, ఏపార్టీఎవరికి కలిసి వచ్చేనని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఏపీలో ఎన్నడూ లేని విధంగా ప్రధాన పార్టీలు పొత్తు లేకుండానే పోటీకి దిగుతున్నాయి. ఇది అధికార టీడీపీ కి కలిసి వస్తుందా? లేక ప్రతిపక్షంలో ఉన్న వైసీపీకి కలుసుస్తుందా? జనసేన పట్టు సాధిస్తుందా ? ఏపీలో రాజకీయ పార్టీల్లో ఏం జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలలో జోరుగా చర్చ జరుగుతుంది. బహుముఖ పోటీ తప్పదని తేలిపోయింది. ఇప్పటికే బీజేపీతో ఏపార్టీ జత కట్టే పరిస్థితి కనపడడంలేదని తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ సైతం ఒంటరిగానే 175 స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించింది. ఇక టీడీపీ చరిత్రలో తొలి సారిగా ఒంటరి పోరుకు సిద్ధమౌతుంది. ప్రతిపక్ష వైసీపీ తొలినుండి ఒంటరి పోరు వైపే మొగ్గుచూపుతుంది ఆపార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంకా జనసేన పార్టీ తాము వామపక్షాలతో పొత్తు పెట్టుకుని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని గతంలో ప్రకటించింది. ఈమధ్య కాలంలో ఎవరితోను పొత్తు పెట్టుకునేది లేదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. దీంతో ఏపీలో అయిదు ప్రధాన పార్టీల అభ్యర్థులు రంగలోని దిగుతున్నట్లు తెలస్తుంది. 2014 ఎన్నికల్లో టీడీపీ,బీజేపీ,జనసేనాని పవన్ ఒక వైపు, వైసీపీ ఒంటరిగా,కాంగ్రెస్ మరో వైపు పోటీ చేసాయి. ఎన్నికల ఫలితాల్లో కేవలం 1.95 శాతం ఓట్ల తేడా మాత్రమే అధికార టీడీపీ,వైసీపీ మధ్య కనిపించింది. అయితే ఇప్పుడు 175 స్థానాల్లో టీడీపీ,వైసీపీ,జనసేనా, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బరిలో ఉండనున్నాయి. ఇదే సమయంలో అధికారం కోసం మూడు ప్రధానపార్టీలు పోటీ పడనున్నాయి. దీంతో ఇప్పుడు ప్రధానంగా ఓట్ల శాతం మీదనే ఫలితాలు ఆధారపడి ఉంటాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇపుడున్న పరిస్థితుల్లో టీడీపీ, కాంగ్రెస్ మధ్య పొత్తు ఉంటుందని అందరు భావించారు. అయితే టీడీపీతో కాంగ్రెస్ పొత్తు ఉండదని, ఏపీ కాంగ్రెస్ ఇన్ చార్జ్ ఉమెన్ చాంది ప్రకటన చేయడంతో పొత్తులు ఉండవని స్పష్టమైంది. దీంతో ఏపీలో విడివిడిగా పోటీ చేసి,కేంద్రంలో కలిసి ఉందమని టీడీపీ చెప్పడంతో కాంగ్రెస్ ఏపీలో పొత్తు ఉండవని ప్రకటన చేసింది. ఇక జనసేన- బీజేపీ గత ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలిచాయి,కాని ప్రస్తుతం ఆరెండు పార్టీలు విడిపోవడంతో పవన్ మద్దతు దారుల ఓట్లు జనసేనాకు పడతాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నాయి. బీజేపీకి ఓటింగ్ శాతం ఈసారిఏపీలో చాలా తక్కువగా ఉంటుందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే కాంగ్రెస్ గతంలో కంటే పుంజుకున్న ఏస్థాయిలో ఓట్లను చీల్చుతుందని ఎవరికి నష్టం కలుగుతుందని రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది. ఈనేపథంలో సాధారంగా బహుముఖ పోరు పోటీ సమయంలో అధికార పార్టీపై ఉన్న వ్యతిరేఖత కారణంగా ,వ్యతిరేఖ ఓట్లు చీలితే,అధికార పార్టీకి లాభంచేకూరుతుందని చర్చ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అయితే ఈవ్యతిరేఖ ఓట్లు జగన్‌కా,పవన్‌కా అదేవిధంగా వారికి వారికి వచ్చే ఓట్లతో పాటుగా టీడీపీ వ్యతిరేఖ ఓట్లను ఎంతవరకు ఉపయోగించుకుంటాయని కీలకంగా మారనుంది. ఈచీలిక టీడీపికి కలిసి వస్తుందా అనేది మరో చర్చ జరుగుతుంది.ఈనేపథ్యంలో కంగ్ ఎవరు,కింగ్ మేకర్ ఎవరు చర్చ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తుంది.ఇక పోటీ సంగతి తెలిపోవడంతో ఇపుడు ఎవరి సత్తా ఏంటని చర్చ మొదలైంది. బహుముఖ పోటీ ఖచ్చితంగా తమకే కలిసి వస్తుందని,తమకు ఉన్న పాజిటివ్ ఓటు ఎలాగో తమకే దక్కుతుందని,అదే సమయంలో ప్రభుత్వ వ్యతిరేఖ ఓటు చీలిపోవడం ద్వారా తాము తిరిగి అధికారంలోకి వస్తామని టీడీపీ అంచనా వేస్తున్నట్లు తెలుస్తుంది.



అయితే గత ఎన్నికల్లో టీడీపీకి వేసిన ఓటర్లు తిరిగి అదే పార్టీకి ఓటు వేసిన గతంలో వేసిన పవన్ ,బీజేపీ మద్దతు దారులు తిరిగి ఇపుడు బీజేపీకి వేసే పరిస్థితి లేదని,పవన్ అభిమానులు తిరిగి పవన్‌కే ఓటు వేస్తారని తమ ఓటు బ్యాంకు తమకే ఉంటుందని వైసీపీ అభిప్రాయం. ఇదే సమయంలో ప్రభుత్వ వ్యతిరేఖ ఓటు ఖచ్చితంగా తమకు అదనపు ఓటుగా వస్తుందని అంచన వేస్తున్నారు. ఇక జనసేనా సైతం తాము కీలకంగా మారుతామని అంచనా వచ్చినట్లు తెలుస్తుంది. ఎవరు అధికారం లోకి రావాలన్న తామే కీలకంగా మారుతామని ఎవరికి మెజార్టీ రాకపోవడంతో,తమకే అవకాశం వచ్చిన ఆశ్చర్యపోవాల్చిన అవసరం లేదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. దీంతో ఏపీలో వచ్చే ఎన్నికల్లో పార్టీలు అనుసరిస్తున్న వ్యూహాలు ఎవరికి చేస్తాయో...ఎవరికి అధికారాన్ని దగ్గర చేస్తాయో అనేది రాజకీయ వర్గాల్లో చర్చజరుగుతుంది.ఎన్నడూ లేని విధంగా ఈఎన్నికల తీర్పు జరుగుతుందని అంచన వేస్తున్నారు విశ్లేషకులు.

టీడీపీ జయహో బీసీ అంటే నమ్మేవాళ్లు ఎవ్వరూ లేరు



అమరావతి,సూర్యబ్యూరో: నాలుగున్నరేళ్ల పాటు మోసం చేసిన టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు జయహో బీసీ అంటే నమ్మేవారు ఎవ్వరూ లేరని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు తెలిపారు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ ప్రభుత్వంపై బీజేపీ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు విమర్శలు గుప్పించారు ఆదరణ పథకంలో అవినీతి చేశారని దుయ్యబట్టారు. బీసీలకు కేంద్రం కేటాయించిన, ఏపీ బడ్జెట్ లో ఇచ్చిన నిధులను కూడా ప్రభుత్వం ఖర్చు పెట్టలేదని ఆరోపించారు.

డ్వాక్రా మహిళలకు చెల్లని చెక్కులు ఇస్తున్నారు



విజయవాడ,సూర్యబ్యూరో: గత ఎన్నికల్లో 94 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని మోసం చేసిన చంద్రబాబు మరోసారి పసుపు-కుంకుమతో భారీ మోసం చేయడానికి సిద్ధమవుతున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాయత్రి విమర్శించారు. ఆదివారం ఆమె మీడియా మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు చంద్రబాబు చెల్లని చెక్కులు ఇస్తున్నారని ఆరోపించారు. మరోసారి మహిళలను మోసం చేయడానికే పసుపు-కుంకుమ పథకాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. డ్వాక్రా మహిళలకు పదివేల రూపాయలు, స్మార్ట్ ఫోన్లు ఇస్తామని చెప్పడం పచ్చి మోసం అన్నారు.ఈ ఐదేళ్లలో రాజధాని నిర్మాణం పేపర్ల మీదే ఎలా జరిగిందో.. అలాగే పది రూపాయలు చెక్కు మీదే ఉంటాయి కానీ ఒక్క రూపాయి చేతికి రావని చెప్పారు. గత ఎన్నికల్లో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు రుణమాఫీ వాగ్దానాన్నే మాఫీ చేశారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు మహిళలు గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు.

వైఎస్ జగన్‌తో దగ్గుబాటి భేటీ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఏపీ ప్రతిపక్ష నేత, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో సీనియర్ నాయకుడు, ఎన్టీఆర్ పెద్ద అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు సమావేశమయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో లోటస్‌పాండ్‌లో జగన్‌తో దగ్గుబాటి భేటీ అయ్యారు. తన కుమారుడు హితేష్‌తో కలిసి జగన్ నివాసానికి చేరుకున్న దగ్గుబాటికి వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి సాదర స్వాగతం పలికారు. గత కొంతకాలంగా దగ్గుబాటి కుటుంబం వైసీపీలో చేరే అవకాశం ఉందని మీడియాలో ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జగన్‌తో దగ్గుబాటి సమావేశం

- త్వరలో వైసీపీలోకి-దగ్గుబాటి
- పురంధేశ్వరి మాత్రం బీజేపీలోనే ఉంటారు

కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం దగ్గుబాటి వెంకటేశ్వరావు భార్య పురందేశ్వరి బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

వైసీపీలోకి వెళ్లడానికి నిర్ణయించుకున్నాం

తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు నిర్ణయించుకున్నట్టు సీనియర్ నాయకులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఆదివారం ఆయన తన కుమారుడు హితేశ్‌తో కలిసి ఏపీ ప్రతిపక్ష నేత, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ భేటీలో వైసీపీ సీనియర్ నాయకులు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలు, నరసరావుపేట నియోజకవర్గ లోక్‌సభ కో ఆర్డినేటర్ కృష్ణదేవరాయులు కూడా పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ హితేశ్ వైఎస్ జగన్‌తో కలిసి పనిచేస్తారు. మా నిర్ణయాన్ని వైఎస్ జగన్ స్వాగతించారు. గత రెండు ఏళ్లుగా వైఎస్ జగన్ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని పార్టీని నడుపుతున్నారు. ఆయన పడుతున్న కష్టానికి దేవుడు తగిన ప్రతిఫలం చూపెడతాడు. ప్రజలు కూడా ఆయన కష్టాన్ని గుర్తిస్తున్నారని తెలిపారు. ఏపీలో పనితీరు గాడి తప్పిందని విమర్శించారు. డబ్బులు లేవని చెబుతూ ప్రభుత్వ డబ్బులు ఖర్చు పెట్టి చంద్రబాబు దీక్షలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగో, ఐదో విడుత రైతుల రుణమాఫీకి ఇంకా డబ్బులు విడుదల చేయలేదని అన్నారు. పోస్ట్ డేటెడ్ చెక్కులతో డ్వాక్రా మహిళలకు డబ్బులు ఇస్తామని చెబుతున్నారని, ఇంత విచిత్రమైన పాలనను ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికలకు రెండు నెలల ముందు పోస్ట్‌డెటెడ్ చెక్కుల పేరిట రాజకీయాలు చేయడాన్ని తప్పుపట్టారు. విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా తన భార్య పురంధేశ్వరి బీజేపీలోనే కొనసాగుతారని స్పష్టం చేశారు. జగన్ ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి వైసీపీని నడుపుతున్నారని దగ్గుబాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఏపీలో పేదల బాగు కోసం, అభివృద్ధి కోసం పాటుపడిన వ్యక్తులు ఎన్టీఆర్, వైఎస్సార్ మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ కుటుంబాన్ని అభిమానించేవాళ్లు ఈ పరిణామాన్ని హర్షిస్తారన్నారు. ఓవైపు నిధులు లేవంటూనే, మరోవైపు ధర్మపోరాట దీక్షలకు కోట్లు ఖర్చుపెడుతున్నారని ఆరోపించారు. దీనివల్ల జిల్లాల్లో అధికారులు, పోలీసులు పనులు మానేసి ఈ దీక్షల ఏర్పాట్లు చేయాల్సి వస్తోందన్నారు. డ్వాక్రా మహిళలకు పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇవ్వడం వంటి విచిత్ర పరిస్థితి ఇప్పటివరకూ ఎన్నడూ తలెత్తలేదని విమర్శించారు. ప్రకాశం జిల్లాలోని పర్చూరు అసెంబ్లీ స్థానాన్ని దగ్గుబాటి కుటుంబం కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంలో జగన్ దగ్గుబాటి ఫ్యామిలీకి ఎలాంటి హామీ ఇచ్చారన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

ఇదిలావుంటే దగ్గుబాటి వెంకటేశ్వరావు భార్య పురందేశ్వరి ప్రస్తుతం బీజేపీ నేతగా, ఎయిరిండియా బోర్డులో స్వతంత్ర డైరెక్టర్ గా కొనసాగుతున్నారు. ప్రకాశం జిల్లాలో పర్చూరు స్థానంపై దృష్టిసారించిన దగ్గుబాటి ఫ్యామిలీ తమ కుమారుడు హితేశ్ చెంచురాంను ఇక్కడి నుంచి పోటీ చేయించాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో దగ్గుబాటి ఫ్యామిలీ మొత్తం త్వరలోనే వైసీపీలో చేరే అవకాశముందని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. పర్చూరు స్థానంపై జగన్ నుంచి హామీ లభిస్తే భార్య పురందేశ్వరి, కుమారుడు హితేశ్ తో కలిసి దగ్గుబాటి వైసీపీ తీర్థం పుచ్చుకుంటారని సమాచారం. ఇందుకు సంబంధించి వైసీపీ అధినేత జగన్ అభిప్రాయం ఏంటో ఇంకా వెల్లడి కాలేదు.

డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేశాడు



విజయవాడ. మేజర్‌న్యూస్:డ్వాక్రా సంఘాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వీర్యం చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు ఆరోపించారు. ఆదివారం ఆయన వైసీపీ మైలవరం సమన్వయ కర్త వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వంలో డ్వాక్రా మహిళలు పూర్తిగా కుదేలైపోయారని ధర్మాన ఆరోపించారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన ఏ హామీని చంద్రబాబు నెరవేర్చలేదని విమర్శించారు. ఎన్నికల దగ్గర పడుతుండటంతో టీడీపీ బ్రోకర్లు మరోసారి ప్రజలకు మోసగించడానికి యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో బూత్ కమిటీల అవసరం కీలకమని, విధిగా తమ బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.

మంత్రి ఉమా కుట్రలు ఇక చెల్లవ్ : వసంత కృష్ణ

రాష్ట్రంలో వైసీపీ ప్రభంజనం చూసి మంత్రి ఉమా మహేశ్వరరావు వణికి పోతున్నారని ఆ పార్టీ మైలవరం సమన్వయకర్త వసంత కృష్ణ ప్రసాద్ ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ప్రజలంతా వైఎస్ జగన్ సీఎం కావాలని ఎదురుచూస్తున్నారని చెప్పారు. మైలవరం నియోజకవర్గంలో మంత్రి ఉమా కుట్రలు ఇక చెల్లవన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఆదరణ పేరుతో కొత్త నాటకం



విజయవాడ, మేజర్‌న్యూస్: బీసీలను మరోసారి మోసం చేయడానికి ఆదరణ పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు కొత్త నాటకానికి తెరలేపారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పార్థసారథి మండిపడ్డారు. చంద్రబాబుకు సరిగ్గా ఎన్నికల ముందే బీసీలు గుర్తుకు వస్తారన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కోసమే టీడీపీ రాజమండ్రిలో జయహో బీసీ సభ నిర్వహిస్తుందని, ఈ సభకు రాకుంటే నగదు ఇవ్వమని డ్వాక్రా మహిళలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు నాలుగున్నరేళ్ల పాలన పుణ్యమా బీసీలు తమ కులవృత్తులు చేసుకోలేక దుర్భర జీవితాన్ని సాగిస్తున్నారని, జన్మభూమి కమిటీల వద్ద బీసీలను బానిసలుగా మార్చింది టీడీపీ ప్రభుత్వమేనని మండిపడ్డారు. బీసీ వర్గానికి ఇచ్చిన హామీలను నెరవేర్చమని సీఎం చంద్రబాబు చెప్పగలరా అని ప్రశ్నించారు. బీసీలు టీడీపీకీ కేవలం ఓటు బ్యాంకుగానే కనిపిస్తున్నారని, చంద్రబాబు మాయలో బీసీ సోదరులు పడవద్దని పార్థసారథి ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. వైఎస్ జగన్ సీఎం అయితేనే బీసీ సంక్షేమం సాధ్యమని స్పష్టం చేశారు.

క్రైస్తవుల పరువు తీయొద్దు

- మతబోధకుడిగా, లేదంటే రాజకీయ నేతగా ఉండండి
- క్రైస్తవ ప్రతినిధిగా ఎక్కడా పాల్గొనవద్దు • ఎక్కువ చేస్తే క్రైస్తవ సమాజం నుంచి బహిష్కరణ తప్పదు • క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్



హైదరాబాద్,సూర్యబ్యూరో: ప్రముఖ క్రైస్తవ మతబోధకుడు, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌పై క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా మండిపడింది. తాను గొప్ప వాడినంటూ ప్రచారం చేసుకోవడం మానాలని హితవు పలికింది. ఉన్నదీ, లేనిదీ మాట్లాడి క్రైస్తవుల పరువు తీయొద్దని సూచించింది. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్ జెరూసలెం మత్తయ్య మాట్లాడుతూ కేఏ పాల్ వుంటే రాజకీయాల్లోను, లేదంటే మతబోధకుడిగాను ఉండాలని, రెండింటిలోనూ ఉండొద్దని సూచించారు. రాజకీయాలకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో క్రైస్తవ ప్రతినిధిగా పాల్గొనవద్దని కోరారు.క్రైస్తవ మతబోధకుడిగా ఉన్నప్పుడు ప్రధానులు, సీఎంలు, సినీ, వ్యాపార రంగాలకు చెందిన వారు వచ్చి నమస్కరించడానికి కారణం దైవ శక్తేనని, దానిని చులకన చేయవద్దని పాల్‌కు సూచించారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా గురించి కానీ, రాజకీయ పార్టీలలో సీట్ల కోసం కానీ తాము ఏనాడూ అడగలేదన్నారు. వార్తల్లో ఉండేందుకు రాజకీయ విమర్శలు చేస్తూ క్రైస్తవుల పరువు తీయవద్దని మత్తయ్య కోరారు. రాజకీయ పార్టీలకు క్రైస్తవులను తాకట్టుపెట్టాలనే ఆలోచన మానుకోవాలని హితవు పలికారు. మరోసారి ఇటువంటి ప్రయత్నాలు చేస్తే అడ్డుకుంటామని, క్రైస్తవ సమాజం నుంచి బహిష్కరిస్తామని మత్తయ్య హెచ్చరించారు.

ఏపీ హైకోర్టు ఏర్పాటు విధానం రాజ్యాంగ విరుద్ధం

- దేశాన్ని ఆ దేవుడే కాపాడాలి • హైకోర్టు ఏర్పాటులో నిబంధనలు ఉల్లంఘించారు
- ప్రారంభోత్సవానికి వెళ్లడం, వెళ్లకపోవడం సీజేఐ ఇష్టం
- సుప్రీం కోర్టు మాజీ జడ్జి జాస్తి చలమేశ్వర్



అమరావతి,సూర్యబ్యూరో: ఏపీ హైకోర్టు ఏర్పాటుపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఏర్పాటు చేస్తున్న విధానం రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 3న ఏపీ తాత్కాలిక హైకోర్టు భవనం ప్రారంభోత్సవానికి వెళ్లాలా? వద్దా? అన్నది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ తేల్చుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయమై ఓ జాతీయ మీడియా సంస్థతో జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం హైకోర్టు ఏర్పాటుపై పార్లమెంటు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆయన అన్నారు. పార్లమెంటు సిఫార్సుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయాల్సి ఉంటుందన్నారు. కానీ ఇక్కడ పార్లమెంటును పక్కనపెట్టి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నిర్ణయం తీసుకున్నారనీ, ఇది రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని విమర్శించారు. గతేడాది డిసెంబర్ 26న ఏపీ హైకోర్టు ఏర్పాటుపై కోవింద్ గెజిట్ ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే.ఏపీ హైకోర్టు 2019, జనవరి 1 నుంచి ఉనికిలోకి వస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జస్టిస్ చలమేశ్వర్ స్పందిస్తూ.. దేశంలోని ప్రతీ రాజ్యాంగ వ్యవస్థ ఇలా తయారయితే .. ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందన్న నమ్మకం తనకు లేదని కుండబద్దలు కొట్టారు. ఆ దేవుడే మన దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అన్నారు.

ఫిబ్రవరి 1న ఏపీ బంద్

- సినీ ప్రముఖులు కలసిరావాలన్న చలసాని
- ప్రత్యేక హెూదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్

అమరావతి,సూర్యబ్యూరో: ఫిబ్రవర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బంద్ కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి పిలుపునిచ్చింది.ఆదివారం ఈ సందర్భంగా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూరాజకీయ పార్టీలకు అతీతంగా బంద్ లో అన్ని వర్గాలు పాల్గొనాలని విన్నవించారు. తమిళనాడులో జల్లికట్టు క్రీడ కోసం అన్ని రాజకీయ పార్టీలు, సినీ ప్రముఖులు అందరూ కలసి పోరాడారని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో కూడా పెద్ద నటులు, నిర్మాతలు ఉన్నారని వారంతా ప్రత్యేక హోదా కోసం కలసి రావాలని విన్నవించారు. కేంద్ర ప్రభుత్వ దుశ్చర్యలను అంతమొందించేందుకే బంద్ కు పిలుపునిచ్చామని చెప్పారు.

పేదలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత



హైదరాబాద్, మేజర్‌న్యూస్: పేద విద్యార్థులకు సాయం అందించడం అభినందనీయమని శాసనసభా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎంతో మంది విద్యార్థులకు రెడ్డి జనసంఘం సహకారం అందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. పేదవారికి సాయం చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందు వరుసలో ఉండాల న్నారు. అబిడ్స్‌లోని రాజా బహదూర్ వెంకటరామరెడ్డి హాస్టల్‌లో రెడ్డి జనసంఘం పేద విద్యార్థులకు పంపిణీ చేసిన ఉపకార వేతనాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో సమాజసేవ చేసి నల్గురికి ఆదర్శంగా నిలవాలన్నారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం పెరుగుతుందని పోచారం పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

అక్షరం

సోమవారం 28, జనవరి 2019
editpage@suryaa.com

మొక్కలు



తరువులు పచ్చదనంతో
పరచుకుంటేనే
ధరణి దేహం సౌభాగ్యంతో విరసిల్లేది
తరువులు శుభానికి సూచిక
మొక్కవోని ధైర్యంతో మొక్కలు
నిలబడితేనే
జీవకోటికి ప్రాణవాయువు దొరికేది
మొక్కలు జీవులకి సంజీవని
చెట్లు ప్రగతికి నిచ్చెన మెట్లు కడితేనే
పర్యావరణానికి అగచాట్లు తీరేది
చెట్లు ఆరోగ్యానికి సోపానాలు
వృక్షాలు ఆకలి లక్ష్యాలను
నెరవేరిస్తేనే
జీవిమనుగడ మున్ముందుకు సాగేది
వృక్షాలు అన్నం పెట్టే అన్నపూర్ణ

–కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

మనమంతే



మనమంతే
నవ్వుల లేపనాలు పులుముకుని
రోజంతా నేనే రాజు నేనే మంత్రి
అని కాలరేగరేస్తూ నటిస్తుంటాం

మనమంతే
సంధ్యా సమయానికి
అసలు రూపంలోకి వచ్చి
రేపెలా అని గుటకలు మింగుతూ
గూటికి చేరుకుంటాం

మనమంతే
పడుకుని ఆకాశం లో చుక్కలు
చూస్తూ
వాటి మధ్య లో పడుకున్నామని
ఆనందపడిపోతు దుప్పటి
కప్పేసుకుంటాం

మనమంతే
లేవగానే భయపెట్టే దినచర్యని
కాసేపు పక్కన పెట్టి
కలల్లో తేలుతూ లేస్తుంటాం

– పద్మజ నాగభైరవ


నా కవితకు ప్రాణం నీవే...



నీ మీదున్న ప్రేమే కదా నాలోని
కవిత కు ప్రాణం పోసింది..
గుండెలోని ప్రేమను గొంతు విప్పి
చెప్పలేక భావాలన్నీ
అక్షరామాలికలుగా కూర్చి
నీ ముందు పరచినవుడు నువ్వుతూ..
నువ్వు చెప్తేగాని తెలియదు సుమా!
దాన్ని కవిత్వం అంటారనిఅలా కదా!
నా చిన్ని కవిత అంకురించింది..
ఇప్పుడు నా చిన్నారి కవిత్వం
బుడి బుడి అడుగులతో
వచ్చి రాని మాటలతో..
చిన్న చిన్న వేదికలు ఎక్కుతూ
చిట్టి చిట్టి సత్కారాలు పొందుతున్నా
ఎక్కడెక్కడో తిరిగినా..
ఎన్ని అభినందనలు పొందినా ..
ఏదో చెప్పలేని బాధ ..స్తబ్ధత..
నీతో పంచుకునే అనుభూతిలోని
ఆనందం వేరే .
ఆ అనుబంధంలోని అనురాగం వేరే..
ఎంత మంది మధ్యలో ఉన్నా
ఒంటరితనమే..
అందుకే నేమో...
తిరిగి తిరిగి చివరికి
నీ చెంతకే చేరుకుంటుంది
నీ హృదయంలో ఒదగాలని..
నీ ప్రేమలో ఎదగాలని ...
ఎందుకో తెలుసా..
నా కవితకు ఊపిరి నీ ప్రేమే
దాని ఆయుష్షు నీ ఆప్యాయతే
మరి దాని మనసుకు పంచగలవా
గుప్పెడు ప్రేమను
దోసిటి ఆప్యాయతను
నేనున్నా నీకు తోడుగా .. నీడగా
అంటూ ..ఆసరా ఇవ్వగలవా ?
జీవం పోసిన నీవు ఇవ్వలేవా ..
నా చిన్నారి కవిత కు జీవితాన్ని !!!

– గుడిపల్లి విద్యావతి
8886614346

ఫౌజీ




వెళ్లొస్తా !అని చెప్పి వెళ్లిన నువ్వు అసలేమైపోయావూ !
నీ చుక్కమ్మ కళ్లలో చుక్కలెట్టుకుని వెదుకుతూనే ఉంది
ఎండిన పత్తికాయల్లాంటి ఆమె కళ్లలోవర్షం కురియటం లేదు
నిశీథిలోనూ భైరువడి "భౌ భౌ"లు
ఆమె నిశ్శబ్దాన్ని భగ్నం చెయ్యలేకపోతున్నాయి

సరిహద్దు రేఖల్లో సమాధైపోయావా ?
ముష్కరుల క్రౌర్యానికి బలైపోయావా ?
బుల్లెట్ల మారణహోమానికి ఆహుతైపోయావా ?
అయినా...నీ చుక్కమ్మకళ్లలో చుక్కలెట్టుకుని వెదుకుతూనే ఉంది.
వాఘా సరిహద్దుల్లో...నువ్వు నిత్యం చేసే కవాతులు,
ఇనుప బూట్ల టకటకలూ ఏవి ?
భరతమాత పైట కొంగులా నిత్యం ఎగిరే
జాతీయ జెండా అవనతమయ్యిందెందుకూ ?

ఎక్కడో...లతా మంగేష్కర్ గొంతు ఆర్ద్రంగా"జరా ఆంఖ్ మే భర్ లో పానీ"
ఇంకా నీ చుక్కమ్మ కళ్లలో చుక్కలెట్టుకుని వెదుకుతూనే ఉంది
అమెకేం తెలుసు ???
ఉత్తర దిక్కున చుక్కలానువ్వు వెలుగుతున్నావనీ !!

–లీలా చేమంతి, 98480 76205

విశ్వంభర రహస్యం





మనిషి చుట్టూ సమస్తం తిరుగుతోందా! మనిషే విశ్వం చుట్టూ తిర్తుగుతున్నడా! విశ్వాన్ని ఛేధించాలని మనిషి ఎన్నో పరిశోధనలు చేస్తూనే ఉన్నాడు. ఎన్నో కనుగొన్నాడు మరెన్నో సవాళ్లు తన ముంగిట నిలిచి ప్రశ్నించడం మొదలెట్టాయి. వాటికి సమాధానం చెప్పాలనే మనిషి పట్టుదల. ఎక్కడో ఏదో ఉంది అది అక్షరమా లేక భావమా అక్షరమైతే వెలిగించాలి, భావమైతే మనసుతో సంగమించాలి. మనిషి తోబుట్టువు ప్రకృఎతి. ఎవరు వదిలేసిన, నిందించిన, వెలివేసిన, ఉమ్మేసిన నిన్ను ఏదో ఒకరూపంలో అంటిపెట్టుకొని ఉండేది ప్రకృఎతే. నీవు నీచస్థితిలో ఉన్నావా దుమ్ము నీలో రంగులేస్తుంది. పర్వతంపై నాట్యం చేస్తున్నావా? రాళ్ళు నీ పాదాలను ముద్దాడుతాయి. సముద్రవు లోతుల్లో దాగిన సంగీతాన్ని కవితలో ఇమడింప చేస్తున్నావా? అలలు అలలుగా లేదా అక్షరాలు అక్షరాలుగా కావ్యం పరిమళిస్తుంది. ఎందుకలా చూపుల మునివేళ్ళతో శూన్యాన్ని గుచ్చుతున్నావు. పాపం పాపాయిలా ఎలా ముడుచుకుంటుందో చూశావా! మీరంత శూన్యాన్ని వేధిస్తున్నారు! ఆపండి నేను విశ్వాన్ని లాలిస్తాను, పాలిస్తాను, కనుగుడ్డుపై శయనింప చేస్తాను. శూన్యమంటే ఏంటి మళ్ళీ చెప్పాల్సిందేనా ఆ మాత్రం కనుక్కోకపోతే ఎలా మనసుకు పర్యాయపదమే.

కళ సౌందర్యానిస్తుంది, విజ్ఞానం ఉత్తేజాన్ని లేదా అగ్గిని మన దేహంపై పోసి విరోతమున్ని చేస్తుంది. ఆధ్యాత్మికం కాలవు పొరల్లో జోకొడుతుంది. వీటికి మూలమైంది అక్షరం. అవును అక్షరమే నీ పెదలాపై తులసి మొక్కగా మెరుస్తుంది. నీ నుదుటిపై కోటానుకోట్ల సూర్యులను కదిలిస్తుంది. నిజానికి నీ ముఖంలో పలికే భావాలతో పోల్చడానికి ఎన్ని కోట్ల పాలవుంతలు కావాలో! అవును రకరకాల సందర్భాలలో శరీరంలోని ప్రతిభాగం మాట్లాడుతుంది. శరీరమే మాట్లాడకపోతే నాలుకపై సమాధి నిర్మాణం అయినట్టే. మనసు స్పందిస్తుందని చెప్పడం సాధారణమే ఇక్కడ మనసు విచ్చుకుంటోంది. ఎవరైనా కాస్త ఉదయాన్ని రెక్కలపై పోయండి. తీగలు తీగలుగా అల్లుకున్న విశ్వంభర కావ్యం మెదడు, మనసుతో కాదు మీ శరీరంలోని ప్రతి భాగంతో మాట్లాడుతుంది. మర్రిఊడల్లా వేలాడుతున్న అనుమానాలు, మట్టిపెల్లల్లా పగులుతున్న బంధాలు, ఆకాశవు తెరపై మేఘాల పరదాలు కదిలినంత లయాత్మకంగానో, వివక్షపూరితంగానో అక్కడక్కడ దూకుతావెందుకు? వీలైతే మట్టిలో పొర్లు పైపై దేహం మాట కాదు నేనంటున్నది. పొర్లడమంటే నీ గుండెను బురదలో ముంచడం. అక్కడ చూశారా అది బురదో అక్షరమో తెలియడం లేదు నేనైతే అందులో మునిగిపోయాను. ఎంతెత్తులో మునిగిపోయానట్టే ఆ లోయల ఎత్తులకు కొలమానం లేనంత లోతుల ఎత్తుల్లో.

నేను ఎవరిని, నా నవ్వులో దీపాన్ని వెలిగిస్తున్నది ఎవరు? ఎందుకీ ఋతువుల దుప్పట్లలో పొర్లుతున్నాను, ఎవరిదా స్పర్శ? నన్ను అమాంతం నీడలా చుట్టుకొని ఆకాశవు నడుము మడతల్లో కూర్చోపెడుతున్నది. ఎందుకీ భూమి నన్ను అగాధ సరాగాల్లోకి మోసుకుపోతోంది. బహుశ నేను ప్రక్రుతి రెక్కల కిందో, పైనో నడుస్తున్నాను. అదిగో చరిత్ర దృశ్యాలు దృశ్యాలుగా కనపడుతోంది అందులో నా పాదముద్రల పచ్చివాసన, వృక్షం కురిపించిన గతంలా...! అది చరిత్ర? మరి గొంతులో సున్నితత్వం ఏది అయినా సున్నితత్వంతో పోల్చడం ఏమిటి? ఎక్కడుంది? ఎవరైనా చూశారా? పొదల్లో రాలిన క్షణాలను కప్పుకొని గాయాలకు గేయాలు అల్లుతున్నది తనేనేమో! వెలుతురు కన్ను తెరవడానికి ఎందుకింత కాలమైయ్యింది. ఎవారన్నారు కన్ను తెరుచుకోలేదని? ఎప్పుడో తెరుచుకుంది కాకపోతే ఆమె కన్నుపై వీర్యం కప్పబడింది. ఏమి తప్పేమైనా అన్నానా! ఏమో ఆమె మర్మాంగం మాత్రమే కాదు ఆణువణువు తెల్లటి చిత్తడిలో మూలుగుతోంది. గతంల సహనం, నేడు ఖండనం. అక్కడ ప్రకృఎతి మరో రూపమెత్తింది.

సినారె గారు నదీ గర్భంలో ఎడారి ఎందుకు పడుకున్నదని ఆనాడు అడిగారు. మరి నేడు నదిలో నీరు లేదని తెలుసు కాని ఎడారి ఇసుక చేస్తున్న శబ్దం మొన్నటి దాక విన్నాను కదా మరి ఇసుక మూగపొయిందేమిటి? నది కింద పొంగే ఇసుకను దొంగలించిందెవరు నదికి ఇరువైపులా నిటారుగా నిల్చున్న కాలాన్ని అడగండి నది భ్రమణంలో కలిసిపోయిదని చెప్తుంది. అందులోని ఇసుక ఆకాశాన్ని పొడిచే బిల్డింగ్స్ ముక్కులకు వేలాడుతోందని గట్టిగా రోదిస్తూ చెప్తుంది. మరికాసేపు అక్కడే ఉంటే నది కనిపించదు నదిలో సమాధులు కనపడుతాయి. సమాధుల్లో నివసించే వికృఎత రూపలేవో నవ్వినట్లు శబ్దిస్తాయి. మరో చోట చెట్ల శ్వాస నిలిచిపోయిందా ఎందుకలా చెట్లు శావాల్లాగా నిలబడ్డాయి అన్నారు. ఇక్కడ చెట్టు ప్రతీక మాత్రమే వస్తువు మనిషి. అవును మనిషి నడుస్తున్నా శవం ముఖంలో బాగా గమనిచండి ఎవరో గోతి తీస్తున్నట్లు కనపడుతుంది. సహజత్వం మరణించి కృఎత్రిమ వేషాన్ని తగలించుకున్నాక శవాలు కాక ఇంకేముంటుంది.

చీకటి ఎందుకా? ఆకాశంలో వలలు వలలుగా పరుచుకున్న చీకటిని మీరు చూశారేమో! నేను చీకటిని వేలాడుతున్న చీకటి కన్నులను చూశాను. ఎంత ప్రకాశిస్తున్నాయి ఆ కన్నులు! పొడి పొడిగా రాలే చీకటిలో వెలుగును చూడండి. వెలుగులో దాగిన జీవితాన్ని చూడండి. చీకటి పులుముకున్న వెలుగును ఆస్వాదించండి. చీకటిని నెత్తిన పెట్టుకొనో, భుజాలపై మోస్తునో తిరిగేవాడే నిజమైన చీకటి మనిషి.

అసలు మనిషికి ఎందుకిన్ని అవతారాలు, ఒక్క క్షణంలో కదులుతాడు మరో క్షణంలో ఎవరో వేసిన అడుగులపై నీళ్ళు చల్లుతాడు. మాను శాఖలు శాఖలుగా విస్తరిస్తుంది. ఏ శాఖలోనైనా నీడలే దూకుతూ కనపడుతాయి. లేదా పచ్చ పచ్చని నవ్వులు రాలుతూ కనిపిస్తాయి. మరి గుప్పెడు మనిషికి ఇన్ని జీవరేఖలు ఎందుకు? ప్రతిరేఖలో దుర్మార్గం, స్వార్థం ఎందుకు పోషిస్తున్నాడు. ఎక్కడి వరకు నడవాలనుకుంటున్నాడు? నడక ఒక ప్రశ్న? ఎందుకు నడుస్తున్నాడో అది మరో ప్రశ్న, ఎక్కడికి పోతాడో అంతుపట్టని ప్రశ్న. చివరికి ప్రశ్నలుగా మిగిలే ప్రశ్నలే? ఆ పంజరం చూశారా! పంజరాన్ని మాత్రమే కాదు అందులో బంధించిన నీటిని, నీటిలో మరణిస్తున్నా చేపలను, చేపల కంట్లో కదులుతున్న కాలాన్ని చూశారా! గతం చరిత్రలో మరణిస్తే ప్రస్తుతం పంజరంలో మరణశయ్యపై తుది శ్వాస తీసుకుంటోంది.

సినారె గారి విశ్వంభరలో ఎన్నో విషయాలు అల్లుకుపోయాయి. దేహం గురించి చెప్తూ దేహం బొగ్గరం దాన్ని తిప్పేది ఊపిరి ఈ ఊపిరి ఎప్పుడు ఆగిపోతుందో కాని ఇష్టంవచ్చినట్లు దేహాన్ని తిప్పిపడేస్తోంది. దేహం అంటే శారీరకమైనది కాదు మీలో రగిలే, పొగిలే భావాల పరంపర. చుట్టూ అల్లుకున్న సాలె ఊరిపిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ ఊపిరికి మనమంటే ఎందుకంత పగో లోలోపలికి ప్రవేశించి పురుగులో రక్తాన్ని, మాంసాన్ని మాత్రమే కాదు భావాన్ని, ఆలోచనను, ఆలోచనల సారాన్ని కలుషితం చేసేస్తోంది. అయినా ఈ దేహంపై ఎందుకంత ప్రీతో బహుశ అరనిమిషం పాటు సుఖాన్ని పోగు చేస్తోంది కదా అందుకేనేమో!

అదిగో నైరాశ్యం కమ్ముకొస్తోంది. చివరికి నగ్నత్వమే అనుసరించింది. నా ఎదుట శవం అది నాదే అవును అది నా శవమే. అదేంటి నన్ను వదిలేసింది. ఇక నేను కట్టుకున్న కోటలో ఒంటరిగానే ఉండాలా. అయ్యో నాకు నా శవం కావాలి అందులో నేను సేద తీరాలి ఏమి ఎం చేసుకోను ఈ పట్టుపరువు ఇందులో పాములు బుసలు కొడుతున్నాయి. అదేంటి వెండి పళ్ళెంలో జర్రులు కదులుతున్నాయి. నా శవం నాకు కావాలి ఈ భూమి మీద నాకు చోటు లేదా ఇంకా కనీసం నా శవంలో నేను మరణించాలి. ఎవరైనా నా శవాన్ని ఇప్పించగలరా! నిద్రపోవాలి కనురెప్పల కింద గోతులు తెరుచుకున్నాయి. గోతిలో శవంతో పాటు నేను పడుకుంటాను దయచేసి నా శవం నాకు ఇప్పించండి. దేహాన్ని కూడా దొరకని విధంగా మరణిస్తున్నా నీకు ఎందుకింత కోరిక.

ఏదీ నీది కాదు మరేది నాది కాదు జీవన సమాగమంలో అన్ని నడుస్తున్నాయి వాటితో పాటు మనము నడవాలి తప్ప నడిచిన దారి నా సొత్తు అనుకుంటే ఎలా? మనం వేసిన దారిలో ఎవరో నడవాలని అనుకోవడం మూర్ఖత్వమే. ఎవరిదారి వారిది. ఎవరి దృఎశ్యం వారిది, ఎవరి శబ్దం వారిది, దారులన్నీ కలిసే చోట ఒక చెట్టు నిర్మించాలి. చెట్టు పైన ఆకాశం చెట్టు కింద భూమి అటువైపు నీరు ఇటువైపు నిప్పు. అందరూ కలిసి విశ్వంభర చెట్టులో ఆకులమై, పిట్టలమై, కొమ్మలమై, వీలైతే మహా అక్షరమై వెలగాలి. అప్పుడు చెట్టు అక్షరం అవుతుంది. అక్షరం పోతిల్లల్లో జీవి విస్తరిస్తుంది.

సినారె గారు రాసిన విశ్వంభర కావ్యాన్ని చదివినప్పుడు నాకు అనిపించిన సారాన్ని, నా భావాన్ని అక్షర రూపం ఇచ్చుకున్నాను. విశ్వంభర అక్షరచెట్టులో కనీసం ఒక ఆకుకి సంబంధించిన సారాన్ని మీకు అందించడానికి ప్రయత్నం చేశాను. ఆ అక్షర మూర్తి పాదాలకు ఈ విశ్లేషణ సమర్పిస్తున్నాను.

–అఖిలాశ, 7259511956

వర్ణమయ భవిష్యత్ లేఖ



పుస్తక సమీక్ష

ఇంతకీ ఇప్పుడీ గుండె గొంతుక కొట్లాట దేనికంటే మీకు ప్రేమ లేఖ రాద్దామని.. ముందుగా నేనెవరికి లేఖ రాస్తున్నానో తెలియ జేస్తూ మీ పేరు పేర్కొనటం లేఖ నియమం కదూ.. అయినా ఏదీ నేనింక లేఖ మొదలెట్టందే... నా దేవులాటంతా సముద్రమంత భాషలో కొన్ని అందమైన పదాలను పట్టి మిమ్మల్ని ఎరుక చేసే సంబోదన వాటితో మొదలు పెట్టేందుకు..

శిలా లోలిత గారూ..ఎందుకో ఇవ్వాళ భావాలు తూనిగల్లా ఝుమ్మంటున్నా..ఏదీ ఒక చోట కుదురుగా వాలటం లేదు...నేనే తోటను కదా..పువ్వులకూ కొదువలేదు అయినా రొదల తుమ్మెదల సయ్యాటే...

ఇప్పుడు మిమ్మల్ని ఎలా పిలువను..మేడం అని, అమ్మా అని..ఉహూ..అవేవీ ఇప్పటి నా భావోద్వేగానికి సరిపోవు.. ఎలా పిలిచినా పలుకుతారు మీరు ఆ తత్వం కలవారిని మహనీయులంటారు...మహనీయులు మనుషులకు అతీతులు..ఈ పిచ్చి జనం తెలుసుకోటంలేదు కానీ దేవుడు కూడా వేల ఏళ్ళుగా ఏ పేరుతో పిలిచినా పలుకుతున్నాడని నా పసి కలానికి ఎంతకూ అర్థం కాదు మీపేరులోని ఆ విరోధాబాస.. వెన్న పూసలా కరిగిపోయే కలిసిపోయే లాలిత్యమే కదా మీది మరి మొదటనే శిళ ఎలా చేరిందో... మిమ్మల్ని చూసిన మొదటి సారే ,మీపై గౌరవం పుట్టింది.. ఈరెండేళ్ళలో అది పెరిగి పెదదయ్యింది..పుట్టటం అంటూ జరిగాక పెరగటమే సహజం కదా...

మా ఖమ్మంలో నిర్గున్ భయ్యా పుస్తక పరిచయ సభలో మొదటి సారి కలిశాను మిమ్మల్ని ఎంత ప్రేమగా దగ్గరకు తీసుకున్నారు..ఎంత గొప్పగా ఆదరించారు.. ఆతరువాత ఎప్పుడు కలిసినా **నన్ను చూడగానే ఒక చిరునవ్వు మీ పెదవి కొమ్మల్లో విరబూసేది..ఆ మొక్కను ఎలా నాటుకోవాలో నాకు నేర్పరూ..లేదంటే ఒక కొమ్మను నా పెదవికీ అంటు కట్టరూ ప్లీజ్..**

చుక్క తెగిపడ్డట్టు హఠాత్తుగా ఈ భావావేశం ఏమిటని అనుకుంటున్నారా..ప్రేమ ఏదేశంలోనైనా ఏ భాషలోనైనా అసంకల్పితమే కదా..అందానికి అలంకారం అవసరం లేదు మీరూ అంతే ఎంత సహజంగా ఉంటారు..ఎవరో ఆకాశమ్నుండి దిగివచ్చినట్లు ఎంత నిర్మలంగా ఉంటారు...

వర్తమాన లేఖ పేరుతో మీరు ఇటీవల విడుదల చేసిన పుస్తకం నాలాంటి కొత్త తరానికి ఎంత మార్గదర్శకంగా ఉందని..అది చదువుతూ చదువుతూనే ఇదిగో ఇలా మీ అక్షరాల వ్యామోహానికి గురయ్యా..

చైనా మాంజా లాంటి ఆధునిక వర్తమానాల ధాటికి ఎన్నో ఏళ్ల క్రితమే గాయపడిన తోకలేని పిట్టకు కొత్త రెక్కలతికించారు..ఎంత విషయ పరిజ్ఞానం అందించారు..ఒకో లేఖను చదువుతూ నేను బాల్య కాలానికి ఎన్నిసార్లు వెళ్ళొచ్చానో నా చెవుల్లో ఇప్పటికీ పోస్ట్ మ్యాన్ కేక అతని సైకిల్ బెల్లు మార్మోగుతోంది..

ప్రేమ ఒక నది ఆ నదీ ప్రవాహంలో నీరై మీ జ్ఞాపకాలు ఉన్నాయి వాటిని జ్ఞాపకాలను లేము ఆరాధన కుసుమాలనాలి, ఎదురు కిటికీలో ఏవేవో కదలాడుతుంటాయి, అలాంటివి కొన్ని అవురుపాలను మీ డైరీలో ఎన్ని పేజీలుగా రాసుకున్నారు మీదైనా ప్రపంచంలోకి కొన్ని నక్షత్రాలను ఆహ్వానించారు అవి మెరిసే తారలను తెలిసిన మీ ఆస్వాదనలో వెన్నెల పూలను కురిపించాయి, ఒకరా ఇద్దరా 52 మంది కవయిత్రుల పరిచయాల నుండి నీతో కలిసి ప్రయాణించిన తీరును వారి వృత్తి, ప్రవృత్తులతో సహ క్షేమ సమాచారాలను తెలుసుకుంటూ లేక సాగిన తీరు నభూతో భవిష్యత్ అనే చెప్పాలి.

(మిగతా వచ్చేవారం)

అజ్ఞానులు... అర్ధజ్ఞానులు....

అపశబ్దశాసనుడైన సోమావధాని పాత్ర ద్వారా రచయిత చెప్పిస్తాడు. నాటికీ ..నేటికీ..ఏనాటికీ .గొప్పనాటకంగా ప్రసిద్ధి గాంచిన కంట్టాభరణం నాటకం లోనిది పై వాక్యం . అజ్ఞానులు...అర్ధజ్ఞానులునుద్దేసించి...రచయిత పాను గంటి లక్ష్మీనరసింహరావు వేసిన అనేక చెణుకుల్లో ఇదికటి. అలాంటి మహా జ్ఞానులు అప్పుడు ..ఇప్పుడు ..ఎప్పుడూ.. ఉంటారనడానికి అనేక ఉదాహరణలున్నాయి .

నేను కర్నూలు జిల్లాలో పనిచేస్తున్నప్పుడు,రూలింగు పార్టికిచెందిన ఎమ్మిగనూరు శాసనసభ్యులు (ఆయన కీర్తి శేషలయ్యారు) నాదగ్గరకు వచ్చి బ్రెదరూ..మా CONSTITUTION" లోపాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు గురించి మీరు రాయాలి కదా ...నా CONSTITUTION" కి వచ్చి, మీరు స్వయంగా చూసి, జరిగిన అభివృద్ధి గురించి రాయాలి.. అని విన్నవించుకున్నారు. అలాఅని ఊరుకోక తన అంతాతిప్పి, సదరు CONSTITUTION"లో జరిగిన అభివృద్ధి నంతా స్వయంగా చూపించారు. ఇటీవలే రూలిం గు పార్టీకే చెందిన మరో గౌరవ శాసనసభ్యులు తాను బి.కా ం చదువుతున్నప్పుడు నేర్చుకున్న ఫిజిక్సు గురించి ఓ టి.వి. ఇంటర్వ్యూలో మాట్లాడారు. సదరు సబ్జెక్టులో తనకున్న నైపుణ్యాన్ని కుడా వివరించారు.ఇలాంటి జ్ఞానం శాసనసభ్యులకే పరిమితం కాలేదు..

ఓ ముఖ్య మంత్రి, 1982లో ప్రారంభించిన తమ రాజకీయ పార్టీ స్వాతంత్ర్య కోసం బ్రిటిష్ వారితో సయితం ఎలా పోరాటం సలిపిందో గుర్తుచేశారు. అంతటితో ఊరుకోకుండా నాలు గే ళ్లయినా ఫౌండేషన్ స్టేజి లోనే ఉన్న నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో త్వరలోనే ఒలింపిక్ క్రీడలు నిర్వహించొ చ్చు అని ప్రకటించేశారు. (నాలుగేళ్ళకొకసారి నిర్వహించే ఒలింపిక్ క్రీడలు 2028 వరకు ఏయే దేశాల్లో నిర్వహిస్తారో యెప్పుడో నిర్ణయం జరిగిపోయింది.వీటిని నిర్వహించే బాధ్యతా దేశాలది) .పైప్రటనలకి కారణం అవగాహనా లోపం కంటే అత్యుత్సాహం ముఖ్య కారణం అనుకోవచ్చు.

లేటెస్ట్ ఏమిటంటే, ఇటీవలే రాజస్తాన్ ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన పెద్దాయన ఇరిగేషన్ కి సరఫరా చేసిన నీరు వల్ల ప్రయోజనం లేకుండా పోతుంది..కారణం ఏమిటంటే నీటి లోని కరెంటును ముందే తీసేస్తున్నారు గదా అని తన మనసులోని మాట చెప్పారు .(దీనికి సంబందిచిన వీడియో పెట్టారు).ఇలాంటి తెలివైన మహానుభావులు జర్నలిస్టులలోకూడాఉన్నారండోయ్...ఇందుకు ఒక ఉదాహరణ చెవుతాను ...ఓ జర్నలిస్ట్ ఫ్రెండు నాకూ,మరో జర్నలిస్టుకు పార్టీకి ఆహ్వానించి, ఈ రోజు పార్టి నేను 'HOST' చేస్తానన్నాడు. అంతకంటేనా అనుకొని ఇద్దరం వెళ్లి ఫుల్లు గా ఎంజాయి చేసి తిరిగి వస్తు డగా, నాతోటి జర్నలిస్ట్, పార్టి ఇచ్చిన జర్నలిస్ట్ తో "Thank You For Your HOSTAGE" అంటూ కృతజ్ఞత తెలిపాడు.షాకవ్వడం నావంతయింది.

మరో ఉదాహరణ ...గతశతాబ్దం ఆఖరి దశకంలో నీటిపారుదల శాఖలోని ఓ ఉన్నతాధికారి ధవళేశ్వరంలో నిర్వహించిన ఓ పత్రికాసమావేశంలో సర్ ఆర్థర్ కాటన్ని అపర భగీరథునిగా వర్ణించి,ఉభయగోదావరి జిల్లాల రైతు లు ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని చెప్పారు. వెంటనే ప్రముఖ దినపత్రికకు చెందిన విలేఖరి సర్ ఆర్థర్ కాటన్ అడ్రెస్ చెప్పండి,వెంటనే వెళ్లి స్పెషల్ ఇంటర్వ్యూ చేస్తాను అని ఉన్నతాధికారి వెంటపడ్డాడు. అలా అనగానే సదరు ఉన్నతాధికారి ఏమాత్రం ఆశ్చర్య పడకుండా అబ్బే ఆయన్ను ఇంటర్వ్యూచెయ్యడం ఇప్పుడు సాధ్యంకాదు ..మనందరికీ అందనంత దూరంలో ఉన్నారా యన అంటూ మరొక ప్రశ్నకు అవకాశం ఇవ్వకుండా కారెక్కి వెళ్ళిపోయారు. (అలా అవకాశం ఇవ్వకపోడానికి కారణం బహుశా విలేకర్ల జ్ఞానంపై ఆయనకున్న నమ్మకం కావొచ్చు.)

PLANT ENGINEER అంటే మొక్కల ఇంజినీరు అని అనువాదం చేసే జర్నలిస్టులుకూడా నాకు తెలుసు.

(మనవి: పై విషయాలు రాస్తున్నంతసేపూ తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు అన్న వేమన హెచ్చరిక నా మనస్సు లో మెలుగుతూనే ఉంది)

– ఆర్. జోగేశ్వరరావు,
సీనియర్ జర్నలిస్టు, విశాఖపట్నం,
93472 99333.

ఉగాది ఉత్తమ రచనల పోటీ

ఉత్తర అమెరికా ఇతర విదేశాల తెలుగు రచయితలకు ఆహ్వానం పలుకుతోంది వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా. రాబోయే శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది (ఏప్రిల్ 6, 2019) సందర్భంగా ఉగాది ఉత్తమ రచనల పోటీ నిర్వహిస్తున్నారు. భారతదేశం మినహా విదేశాలలో నివసిస్తున్న తెలుగు రచయితలందరినీ ఈ పోటీలో పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇది కేవలం స్నేహపూర్వకమైన పోట మాత్రమేనని ఇందులో రెండు విభాగాలు ఉన్నట్టు వివరించారు. ఇతర దేశాలలో ఉన్న తెలుగు రచయితల నుండి నూతన, అముద్రిత రచనలని ఈ పోటీకి అర్హమైనవిగా ప్రకటించారు. ఈ పోటీలో ఉత్తమ కథానికలుగా రెండింటిని ఎంపిక చేసి 116 డాలర్ల చొప్పున బహుమతి అందిస్తామని, అలాగే ఉత్తమ కవితలుగా రెండు ఎంపిక చేసి ఒక్కొక్కదానికి 116డాలర్ల బహుమతి ఉంటుందని తెలిపారు.

అలాగే మొట్ట మొదటి రచనా విభాగంలో కథ, కవితలూ వ్రాద్దామని కుతూహలం ఉన్నా, చిన్న ప్రయత్నాలు చేసినా, ఏదో ఒక కారణం చేత తమ రచనలను ఎక్కడా ప్రచురించని సరికొత్త రచయితలని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భారత దేశం మినహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఔత్సాహిక రచయితలు ఈ పోటీ లో పాలొన్వేకు అర్హులు. ఉత్తమ నా మొట్ట మొదటి కథకు 116 డాలర్లు, నా మొట్టమొదటి ఉత్తమ కవిత 116 డాలర్లు బహుమతిగా ప్రకటించారు.

ఈ పోటీలలో పాల్గొనేవారు ఒక్కొక్క ప్రక్రియకూ ఒక రచన మాత్రమే పంపించాలి. అదీవ్రాత ప్రతిలో నచ్చిన ఇతివృత్తంతో కథలు పదిహేను పేజీల లోపు, కవితలు ఐదు పేజీలు లోపుగా ఉండాలని తెలిపారు. రచయితలు ఎన్నుకోవచ్చును. స్వంత బ్లాగులు, స్వంత వెబ్ సైట్స్ మొదలైన వాటిల్లో ప్రచురించుకున్న రచనలు పరిగణింపబడవని స్పష్టం చేసారు. రచనలు vangurifoundation @ gmail.com మెయిల్‌కి యునికోడ్ ఫాంట్‌లో అందవలసిన ఆఖరి తేదీ: మార్చ్ 20, 2019, కాగా విజేతల వివరాలు ఉగాది పండుగ నాడు కానీ ప్రకటించబడ తాయి.

ఆ బ్రతుకులెందుకలా?

కాళ్ళ కింద గాజుపెంకులున్నా
పూలపరిచిన రెడ్డ కార్పెట్ పై నడుస్తున్నట్లు
పళ్ళు బిగపట్టతో
ముఖానికి రాసుకున్న నవ్వుల పువ్వుల్ని వెదజల్లుతూ
వదులు వదులుగా వేళ్ళు నుండి నీళ్ళుకారుతున్నా
ఒక్క చుక్కకూడా పోనట్లు
వినబడినా వినబడనట్లు మరలా అడుగుతూ
అర్థమైనా అర్థంకాని
అమాయకత్వాన్ని ముఖానికి పులుముకుంటూ
కొన్ని బతుకులలాగే సాగిపోతాయి
బతుకు బతకాలంటే
కొన్నలా నలిగిపోవాల్సిందేనేమో!
బతుకు పండాలంటే
కొన్నలా జరిగిపోతుండాల్సిందేనేమో!

–ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, 9182685231

నేటి తెలుగు కథ పొరుగింటి పుల్లకూరే!

రుచిగా ఉన్నప్పుడు తింటే మాత్రం తప్పేముంది?! పొరుగింటిది అయినంత మాత్రాన రుచిగా ఉన్నా మెచ్చుకోవద్దంటే ఇహ చేసేదేమీలేదు. మన కథల విషయానికి వద్దాం!:

అసలు కథానిక ప్రక్రియే పడమరది.. అంతకన్నా ముందే మనకీ ఉన్నాయంటూ కొంత మంది బుద్ధిజీవులు ఉదాహరణలు చూపిస్తుంటారు. అవీ మంచి కథానికాప్రక్రియలే! కాదనలేం! కానీ రాజుగారి పెద్దభార్య మంచిది అంటే చిన్నభార్య మంచిది కాదన్న అన్యోక్తి అన్నింటికీ అన్వయిస్తామంటే కొన్నింటికీ అన్యాయం చేస్తున్నట్లే! ఇప్పుడు మన దగ్గర వాడకంలో ఉన్న కథాప్రక్రియ మన పెద్దలు చెప్పుకొచ్చే జాతకకథల తరహావంటివి అయితే కాదు. ఇప్పటి తెలుగు కథలలో కనిపించే లక్షణాలన్నీ పాశ్చాత్య కథానిక ప్రక్రియ నుంచి మెరుగులు దిద్దుకుంటున్నవే! అచ్చుమయిన సమాజాన్ని [illegible] యధాతథంగా చూపించడం ఆ మాటకు వస్తే నిక్కచ్చిగా మొదలయింది తెలుగు లిపి అంతర్జాలంలో స్టాండర్డైజ్డ్ అయిన తరువాతనే! అస్తిత్వ పోరాట స్పృహకు సంబంధించిన అవగాహన ఆయా వర్గాలలో ఒక స్పష్టమయిన రూపం సంతరించుకుంటూ .. అన్ని వర్గాలకు స్వతంత్రమైన గొంతుక వినిపించుకునే స్వేచ్ఛ చేరువ కావడం అంతర్జాలం ఒక మాధ్యమంగా అభివఎద్ధి చెందుతుండబట్టే! ఏ వర్గం ఈతి బాధలు ఆ వర్గం ఆలోచనాపరుల నుంచి రావడం మొదలయినప్పటి బట్టి వ్యథార్థ జీవుల యథార్థ గాథల లోతు బైటి ప్రపంచానికి ఏ వడపోతల బెడదల్లేకుండా తెలిసొస్తున్నది!

కారాగారి 'యజ్ఞం ' కథలోని వేదన సహానుభూతి అవుతుంది గానీ స్వానుభూతి కాలేదు కదా! చలం, కొకుల స్త్రీ స్వేచ్ఛాభిలాష ఎంత గింజుకున్నా. వుమెన్స్ లిబ్ ఓల్గా, జయప్రదల మాదిరి స్వానుభూతి నుంచి వుట్టుకొచ్చిన కాంక్ష కాలేదు! పాలగుమ్మి,చాసో వంటి ఎందరినో మనం కథల అంశం దగ్గరకొచ్చే సరికి ప్రశంసలతో ముంచెత్తుతుంటాం ! కథానిర్మాణపరంగా ఆ ఘనాపాటీలకు ఖచ్చితంగా ఆ గౌరవం దక్కాల్చిందే! వాళ్లూ కథల నిర్మాణానికి అనుసరించిన మార్గం పాశ్చాత్యులు స్థిరపరుచుకున్న [illegible] స్త్రీయ పరిమితులకు లోబడే. అంటే కాదనడం కుదరదు. రుచికరమనేగా ఆ పొరుగింటి పుల్లకూర తయారీ విధానంతో పరిచయం పెంచుకుని మన నోటికి హితవైన పాళ్లల్లో రీమేక్ చేసుకుని ఆనందంగా ఆరగించేదీ! చదువు సంధ్యలు ఉన్నత వర్గాలకు , మెజారిటీ మధ్య తరగతి వర్గాల వరకు వచ్చి ఆగి పోయిన అప్ టు '70-80 'స్ వరకు భారతి నుంచి జ్యోతి వరకు వచ్చిన పత్రికలన్నింటిలో ఆ ధనిక, మధ్య తరగతి వారికి సంబంధించిన అంశాలే దర్శనం ఇచ్చే పరిస్థితి ఉండేది. అవీ అధికాధికంగా మిథ్యాభావాలు, స్వాప్నికమైన మోజులే! వాస్తవికమైన వారి జీవితాలను కథల్లా మలిచిందీ తక్కుచే ! మలిచిన కొద్ది కథలకు దక్కవలసినంత ప్రాధాన్యత దక్కిందీ అరుదే! ఏ చలం, కొకు , రావిశాస్త్రి వంటి వాళ్లు ఎంతో నైపుణ్యంతో స్త్రీల అధోగతినో, అట్టడుగు వర్గాలవారి జీవితాలనో కథానికలుగా చిత్రించినా వాటి స్పృహ ఆయా స్త్రీల, అట్టడుగు వర్గాల వరకూ సజావుగా చేరిందెక్కడా? వాళ్లంతా మధ్య తరగతి పాఠకుడి. మంచి కథకుల జాబితాలోకి చేరింది కూడా వస్తురీత్యా కన్నా శాస్త్రీయ కథానిర్మాణం, నూతన ప్రయోగాల దష్ట్యానే అనడం సబబేమో! ఆ శిల్పం , ప్రయోగం కూడా పాశ్చాత్య కథ నుంచి ప్రభావితమయి వికసించినవే మరి! ఛాందస భావాలతో గొప్పగా కథలు అల్లిన విశ్వనాథవారూ ఆ శిల్ప నిర్మాణానికి పాశ్చాత్య రీతులతో ప్రభావితమైనవారే! కనుక రుచి ఉంటే పొరిగింటి కూరనైనా మొచ్చుకు తీరతారు .. అది మానవ సహజం! పాశ్చాత్య సాహిత్యం సైతం(ఆంగ్ల సాహిత్యం అన్న భావనలో) కూడా అనేకానేకమైన ఇరుగు పొరుగు ఇళ్ల నుంచి తెచ్చుకున్న కలగూర సరుకే ! కాబట్టే ఎప్పటికి అప్పుడు కాలానికి అనుగుణంగా అప్ డేట్ అవుతూ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది అన్న మాటే ఆఖరి మాట!

అన్నట్లు ఆ కూర ఎట్లా చేసిందో ఆ పొరుగింటి అమ్మను విచారిస్తూ అందులోనే కొత్త మసాలా దినుసులూ ఉప్పూ కారాల పాళ్లూ మార్చుకుంటూ ఎప్పటికి అప్పుడు మనలోని నల, భీములూ రుచికరంగా వండి వడ్డిస్తామంటే మరీ ఆనందం! కడుపు నిండా తిని 'అన్నదాతా .. సుఖీ భవ ' అని మనసారా దీవిస్తాం!

–కర్లపాలెం హనుమంతరావు




నేటి నుంచి వినియోగదారుల ఫిర్యాదులపై విచారణ

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి వినియోగదారుల కమీషన్‌లో పెండింగ్‌లో ఉన్న వినియోగదారుల ఫిర్యాదుల అప్పీలు, రివిజన్ పిటిషన్‌లపై జాతీయ వినియోగదారుల వివాదాల, రిడసల్ కమిషన్ (ఎన్‌సిడిఆర్‌సి) సర్క్యూట్ బెంచ్ నేటి నుంచి హైదరాబాద్‌లో విచారణ ప్రారంభించనున్నది. ఈ కేసుల విచారణకు గాను ఆదివారంనాడు హైదరాబాద్‌కు వచ్చిన జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆర్.కె. అగర్వాల్‌ను తెలంగాణ వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి అకున్ సబర్వాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా వినియోగదారుల ఫోరంల బలోపేతంపై ఆయా జిల్లాల ఫోరం అధ్యక్షులు, సభ్యులతో ఈ సందర్భంగా సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎం.ఎస్.కె. జైస్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల్లో వినియోగదారుల ఫోరంల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఆదర్శనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సర్క్యూట్ బెంచ్‌లో వినియోగదారుల భద్రతా చట్టం, 1986 ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసులను విచారణకు చేపట్టనుంది. జాతీయ వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆర్.కె. అగర్వాల్, సభ్యురాలు ఎం. శిరీష నేతృత్వంలో ఏర్పాటైన సర్క్యూట్ బెంచ్ సోమవారం ఉదయం 10.30 గంటలకు కేసుల విచారణను చేపట్టనున్నది. వినియోగదారుల ఫిర్యాదులకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో దాదాపు 2685 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. నేటి నుండి ఫిబ్రవరి 8వ తేదీలోపు కోటీ రూపాయలు అంతకు పైబడిన ఫిర్యాదులను కూడా వినియోగదారులు ఈ సర్క్యూట్ బెంచ్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఈ రెండు రాష్ట్రాలకు సంబంధించి కొత్తగా అప్పిల్స్‌గాని, రివిజన్ పిటిషన్స్‌గాని నేరుగా ఈ సమయంలో దాఖలు చేసుకోవచ్చు.

'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'గా ట్రైన్ 18

- రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన
- పేరుపై జనాభిప్రాయం కోరిన ప్రభుత్వం
- వేల సంఖ్యలో ప్రతిపాదనలు
- తుదకు ఆ పేరు ఎంపిక



న్యూఢిల్లీ : పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ట్రైన్ 18కు కేంద్ర ప్రభుత్వం నామకరణం చేసింది. ఈ రైలును 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'గా పిలవనున్నారు. ఈ మేరకు రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం ప్రకటించారు. ఢిల్లీ– వారణాసి మార్గంలో ఈ రైలు గంటకు 160 కిలో మీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. దీని గరిష్ఠ వేగం గంటకు 180 కి.మీ. ప్రధాని నరేంద్ర మోడీ త్వరలోనే ఈ రైలుకు పచ్చ జెండా ఊపనున్నారు. 16 కోచ్‌లు కలిగిన ఈ ట్రైన్‌ను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దారు. పూర్తి ఎయిర్ కండీషన్డ్ సదుపాయం ఉన్న ఈ రైలు కాన్పూర్, అలహాబాద్‌లో మాత్రమే ఆగుతుంది. 'ట్రైన్ 18కి ఏ పేరు పెట్టాలని ప్రజల నుంచి అభిప్రాయాలను కోరగా, వేల సంఖ్యలో ప్రతిపాదనలు వచ్చాయి. చివరకు మేము 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'గా నామకరణం చేశాం. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలకు అందిస్తున్న బహుమతి ఇది. ప్రధాని మోడీ దీనిని త్వరలోనే ప్రారంభించాలని కోరుతున్నా' అని గోయల్ తెలిపారు. ఇక శతాబ్ది ఎక్స్‌ప్రెస్ కంటే ట్రైన్ 18లో ప్రయాణ చార్జీలు 40 నుంచి 50 శాతం అధికంగా వసూలు చేయనున్నారు. ఎగ్జిక్యూటివ్ క్లాస్ చార్జీలు రూ. 2800 నుంచి రూ. 2900 మధ్య ఉండగా, చైర్ కార్ రూ. 1600 నుంచి రూ. 1700 ఉంటాయని అధికారులు తెలియజేశారు. ట్రైన్ 18 ప్రారంభానికి ముందు అన్ని రకాల భద్రత ప్రమాణాలను మూడు రోజుల పాటు పరీక్షించి నడిపేందుకు ప్రభుత్వ విద్యుత్ తనిఖీదారు (ఇఐజి) అనుమతులు ఇచ్చారు. వచ్చే వారంలో ఈ ట్రైన్ పట్టాలు ఎక్కనున్నట్లు సమాచారం. ఈ నెల 31 నుంచి నిర్వహించే బడ్జెట్ సమావేశాల అనంతరం ప్రధాని మోడీ ఈ ట్రైన్ 18ని ప్రారంభిస్తారని ప్రధాని కార్యాలయ వర్గాలు తెలియజేశాయి. ఈ ట్రైన్ 18లో ప్రయాణికులకు అవసరమైన అత్యాధునిక సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్), లక్నోలోని రీసెర్చ్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డిఎస్‌ఒ) సంస్థల పర్యవేక్షణలో నిర్వహించిన ట్రయల్‌ను ఈ రైలు గంటకు 180 కిలో మీటర్ల వేగంతో విజయవంతంగా పూర్తి చేసింది. 30 సంవత్సరాల క్రితం ప్రారంభించిన శతాబ్ధి ఎక్స్‌ప్రెస్ వారసత్వానికి కొనసాగింపుగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను భావిస్తున్నారు. పూర్తి ఎసి సదుపాయం కలిగిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ దేశంలోనే తొలి ఇంజన్ రహిత రైలుగా గుర్తింపు పొందనున్నది.

ఎయిర్‌టెల్ నుంచి మళ్లీ రూ. 100 ప్లాన్




న్యూఢిల్లీ : దేశంలోని అతిపెద్ద టెలికమ్ సంస్థ భారతీ ఎయిర్‌టెల్ రూ. 100, రూ. 500 రీచార్జ్ ప్యాక్‌లను మళ్లీ తీసుకువచ్చింది. 28 రోజుల కాల పరిమితి కలిగిన ఈ ప్యాక్‌లకు లైఫ్‌టైమ్ యాక్టివేషన్ ఉంది. ఇప్పుడు ఈ రెండు ప్యాక్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే, ఈ ప్యాక్‌లు దేశవ్యాప్తంగా అందరికీ అందుబాటులో ఉన్నవీ లేనిదీ తెలియరాలేదు. రూ. 100 ప్యాక్‌లో రూ. 81.75 టాక్‌టైమ్ లభిస్తుంది. అవుట్‌గోయింగ్ కాల్స్ కాల పరిమితి 28 రోజులు. రూ. 500 రీచార్జ్ ప్యాక్‌లో రూ. 420.73 టాక్ టైమ్ లభిస్తుంది. 28 రోజుల కాల పరిమితి, లైఫ్ టైమ్ యాక్టివేషన్ లభిస్తాయి.

రైతుల కోసం ప్రత్యేక ప్యాకేజి : త్వరలో కేంద్రం ఆమోదం



న్యూఢిల్లీ : తాము పండించిన పంటలకు ధరలు పడిపోతుండడంతో సతమతం అవుతున్న రైతుల కోసం ఒక సహాయక ప్యాకేజిని కేంద్ర మంత్రివర్గం త్వరలో ఆమోదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్యవసాయ రంగాన్ని కుదిపివేస్తున్న ఇక్కట్లను అధిగమించడం కూడా కేంద్రం దృష్టిలో ఉందని అధికార వర్గాలు తెలియజేశాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందుగా వ్యవసాయదారులలోని అసంతృప్తిని పరిహరించే ప్రయత్నంగా ఈ సహాయక ప్యాకేజిని విశ్లేషకులు భావిస్తున్నారు. 'చిన్న, సన్నకారు రైతులకు పంటలపై రాబడి తగ్గిపోతున్న నేపథ్యంలో వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రతిపాదన కేంద్ర మంత్రివర్గం అజెండాలో ఉన్నదని అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇది ఇలా ఉండగా, సోమవారం జరపవలసి ఉన్న తమ సమావేశాన్ని మంత్రివర్గం వాయిదా వేసినట్లు ఆ వర్గాలు తెలియజేశాయి. వ్యవసాయ రంగంలోని సంక్షోభాన్ని అధిగమించేందుకు స్వల్ప కాలిక, దీర్ఘ కాలిక పరిష్కారాల నిమిత్తం వ్యవసాయ మంత్రిత్వశాఖ పలు చర్యలు సిఫార్సు చేసిందని, అయితే, ఇందు కోసం భారీగా ఖర్చు కానున్న దృష్ట్యా మంత్రివర్గం తుది నిర్ణయం తీసుకుంటుందని ఆ వర్గాలు తెలిపాయి. సకాలంలో రుణాలు తిరిగి చెల్లించే రైతులకు పంట రుణాలపై వడ్డీని మాఫీ చేయడం ఆ చర్యలలో ఒకటి. ఇందు కోసం ప్రభుత్వ ఖజానాపై రూ. 15 వేల కోట్లు అదనపు భారం పడుతుంది. మరొక ప్రతిపాదన ఏమిటంటే, ఆహార పంటల కోసం బీమా పాలసీని తీసుకోవడానికి వీలుగా ప్రీమియంను పూర్తిగా మాఫీ చేయడం. తెలంగాణ, ఒడిషా ప్రభుత్వాలు అమలు జరుపుతున్న పథకంపై కూడా కేంద్రం మదింపు వేస్తున్నదని ఆ వర్గాలు తెలిపాయి. ఆ పథకం కింద నిర్దిష్ట మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలలోకి నేరుగా బదలీ చేస్తున్నారు.

చందా కొచ్చర్‌పై కేసు నమోదు చేసిన సీబీఐ అధికారి ఒక్క రోజులోనే బదలీ



- నిబంధనలను ఉల్లంఘించి వీడియోకాన్‌కు లోన్ మంజూరు
- ఆరోపణల నేపథ్యంలో పదవి నుంచి వైదొలగిన చందా కొచ్చర్
- తాజాగా సీబీఐ కేసు నమోదు


న్యూఢిల్లీ : ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ అధినేత వేణుగోపాల్ ధూత్‌లపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన సీబీఐ అధికారి బదలీ సుధాన్షు ధార్ మిశ్రా అయ్యారు. కేసు నమోదైన మరుసటి రోజే ఈ పరిణామం సంభవించడం గమనార్హం. సుధాన్షు ధార్ మిశ్రా సీబీఐలో బ్యాంకింగ్, సెక్యూరిటీస్ ఫ్రాడ్ సెల్‌లో ఎస్పీ హోదాలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ అధికారిని తాజాగా ఝార్ఖండ్‌లోని రాంచీ శాఖకు బదలీ చేశారు. ఐసీఐసీఐ- వీడియోకాన్ కేసులో చందా కొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్‌తో పాటు ఇతరులపై ఈ నెల 22న నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌పై సుధాన్షు ధార్ సంతకం చేశారు. ఆ మరునాడే ఆ అధికారిని బదలీ చేస్తున్నట్లు సీబీఐ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయంగా మారింది. ఈ కేసులో 24న చందా కొచ్చర్ తదితరులపై సీబీఐ కేసు నమోదు చేసింది. చందా కొచ్చర్ సీఈవోగా ఉన్న సమయంలో ఆమె అధ్యక్షతన గల కమిటీ వీడియోకాన్‌కు రూ. 3250 కోట్లు రుణాన్ని మంజూరు చేసింది. రుణం మంజూరు విషయంలో నిబంధనలు పాటించలేదని సీబీఐ పేర్కొంది. ఇచ్చిన రుణాల్లో చాలా వరకు తిరిగి వసూలు కాకపోవడంతో బ్యాంక్‌కు రూ. 1730 కోట్లు నష్టం వచ్చినట్టు ఆరోపించింది. రుణం మంజూరు అయిన రోజుల వ్యవధిలోనే వీడియోకాన్ అధినేత వేణుగోపాల్.. దీపక్ కొచ్చర్‌కు చెందిన సంస్థలో రూ. 64 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఆ తరువాత ఈ అంశం వెలుగు చూడడంతో కొన్ని రోజుల అనంతరం చందా కొచ్చర్ తన పదవి నుంచి వైదొలిగారు. ఇది అవినీతి కిందకే వస్తుందని తాజాగా వారిపై కేసు నమోదైంది. అయితే, ఊహించని విధంగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన అధికారి ఒక్క రోజు వ్యవధిలోనే బదలీ అయ్యారు.

చెప్పులు... సెల్‌ఫోన్లు... ఆనంద్ మహీంద్ర ఆసక్తికర ట్వీట్




ముంబయి : ఫోన్ ఎక్కువగా ఉపయోగించే వాళ్లపై మహీంద్ర కంపెనీ అధినేత ఆనంద్ మహీంద్ర సెటైర్ వేశారు. చెప్పు ఆకారంలో ఉండే మొబైల్ కవర్లను తన ట్విట్టర్‌లో షేర్ చేస్తూ ఆయ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సెల్ ఫోన్ అధిక వినియోగాన్ని నిరోధించడానికి ఇటువంటి కవర్లే సరైనవని ఆయన అన్నారు. దీని వల్ల ఫోన్ ఉపయోగించిన ప్రతిసారి మనకు మనమే చెప్పుతో కొట్టుకున్నట్లుగా ఉంటుంది అని మహీంద్ర కామెంట్ చేశారు.

చోక్సీని భారత్‌కు అప్పగించం : ఆంటిగ్వా స్పష్టీకరణ



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణంలో ప్రధాన నిందితుడు మెహుల్ చోక్సీని భారత్‌కు రప్పించే ప్రయత్నాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చోక్సీ ప్రస్తుతం ఆంటిగ్వా పౌరుడని, ఆయనను భారత్‌కు పంపబోమని ఆంటిగ్వా అధికారి ఒకరు స్పష్టం చేశారు. రూ 13500 కోట్ల పిఎన్‌బి స్కామ్‌లో నిందితుడైన చోక్సీని దేశానికి రప్పించేందుకు భారత్ ప్రత్యేక విమానాన్ని కరీబియన్ దీవులకు పంపుతోందన్న వార్తల నేపథ్యంలో ఆంటిగ్వా అధికారి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మెహుల్ చోక్సీ కోసం భారత్ నుంచి అధికారులు ఆంటిగ్వా, బార్బుడాలకు వస్తున్నారన్న సమాచారం తమ ప్రభుత్వం వద్ద లేదని ప్రధాని గాస్టన్ బ్రౌన్ కార్యాలయ సిబ్బంది చీఫ్ మాక్స్ హర్ట్ చెప్పినట్లు 'ఇండియా టుడే టివి' వెల్లడించింది. మెహుల్ చోక్సీ ఇప్పుడు ఆంటిగ్వా పౌరుడని, ఆయన తన భారత పౌరసత్వాన్ని వదలివేయడంతో భారత పౌరుడు కారని, ఆయన ఆంటిగ్వా పౌరసత్వాన్ని తాము రద్దు చేయబోమని హర్ట్ తెలియజేశారు. వెస్టిండీస్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు భారత బృందం ఆంటిగ్వాకు రానుందని తాను భావిస్తున్నానని ఆయన తెలిపారు. చోక్సీని అరెస్ట్ చేసేందుకు లేదా ఆయనను తీసుకువెళ్లేందుకు భారత బృందం ఆంటిగ్వా వస్తుందని తాము భావించడం లేదని ఆయన చెప్పారు. ఈ నెల 31న వెస్టిండీస్‌తో రెండవ టెస్ట్ మ్యాచ్ అంటిగ్వాలో ప్రారంభం అవుతుండడంతో భారత అధికారులు ఆంటిగ్వా రావచ్చని ఆయన అన్నారు.

పిఎస్‌బిలతో నేడు ఆర్థిక మంత్రి భేటీ



న్యూఢిల్లీ : బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవలసిన చర్యల గురించి చర్చించేందుకు సోమవారం ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)లతో ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమావేశం కానున్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడం, మధ్యంతర బడ్జెట్‌కు కేవలం మూడు రోజుల ముందు ఈ సమావేశం జరుగుతుండడం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. రోజంతా జరిగే ఈ సమావేశానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తి కాంత దాస్ హాజరు కానున్నారు. మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఇ)లకు రుణాల మంజూరు, మొండి బకాయిల సమస్య, బ్యాంకుల ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై మంత్రి చర్చించనున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ పథకాల అమలు తీరు, గడచిన తొమ్మిది నెలల దేశ ఆర్థిక స్థితి గురించి సమావేశంలో సమీక్షించనున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల పిఎస్‌బిలు 2018 మార్చి నాటికి రూ. 23 వేల కోట్ల మొండి బకాయిలను తిరిగి రాబట్టగలిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగం ముగిసే సరికి అవి రికార్డు స్థాయిలో రూ. 60700 కోట్ల మొండి బకాయిలను వసూలు చేశాయి. అంతకు ముందు పీయూష్ గోయల్ వంద రోజుల పాటు ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు పంజాబ్ నేషనల్ బ్యాంక్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ సునీల్ మెహతా నేతృత్వంలో సమస్యాత్మకంగా పరిణమించిన బకాయిలను వేగంగా వసూలు చేసేందుకు ఉన్న మార్గాలను అన్వేషించేందుకు కమిటీని నియమించారు. అయితే, ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అనారోగ్యంతో అమెరికాలో చికిత్స పొందుతున్న కారణంగా పీయూష్ గోయల్ ఆర్థిక శాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టిన విషయం విదితమే.

తాజ్ మహల్‌ను ముస్లింలు నిర్మించలేదు

ఒక రాజు నుంచి కొనుగోలు చేశారు : అనంత్ కుమార్ హెగ్డే



న్యూఢిల్లీః ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్ మహల్‌పై కేంద్ర మంత్రి అనంత్ కుమార్ హెగ్డే సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజ్ మహల్‌ను ముస్లింలు నిర్మించలేదని...జయసింహ అనే రాజు వద్దనుంచి కొనుగోలు చేసినట్టు షాజహాన్ తన ఆత్మకథలో చెప్పాడని తెలిపారు. పరమతీర్థ అనే రాజు నిర్మించిన శివాలయాన్ని తేజోమహల్ అని పిలిచేవారని... తదనంతర కాలంలో దాని పేరును తాజ్ మహల్ గా మార్చారని చెప్పారు. మనం ఇలాగే నిద్రపోతూ ఉంటే మన ఇళ్ల పేర్లను కూడా మసీదులుగా మార్చుతారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాముడిని జహాపన అని, సీతాదేవిని బీబీ అని పిలుస్తారని అన్నారు. చరిత్రను కూడా వక్రీకరిస్తూ తిరగరాశారని ఆరోపించారు.

లోక్‌సభకు 14 రాష్ట్రాల్లో పోటీ : టిఎంసి

భువనేశ్వర్: తృణమూల్ కాంగ్రెస్ సంచలన ప్రకటన చేసింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 14 రాష్ట్రాల్లో పోటీ చేయనుంది. పశ్చిమబెంగాల్‌లో మొత్తం 42 స్థానాల్లో పోటీ చేస్తామని ఆ పార్టీ నేత డెరెక్ ఒబ్రెయిన్ తెలిపారు. ఒడిశా సహా మొత్తం 14 రాష్ట్రాల్లో పోటీ చేస్తామని ఆయన భువనేశ్వర్‌లో తెలిపారు. 2019 పార్లమెంట్ ఎన్నికలతో బీజేపీ పని ముగుస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఇటీవల పశ్చిమబెంగాల్లో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 42 స్థానాలకు గానూ 23 స్థానాలు గెలుచుకుంటుందన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ రెండు స్థానాలు మాత్రమే గెలిచింది. తృణమూల్ 34 సీట్లు గెలిచింది. ఎన్డీయేతర కూటమి ఏర్పాటు చేసే లక్ష్యంతో మమత అడుగులు వేస్తున్నారు. అన్నీ అనుకూలించి కేంద్రంలో హంగ్ ఏర్పడితే కీలకంగా వ్యవహరించాలని మమత యోచిస్తున్నారు.

సినిమాకు వెళ్లాలి.. సెలవు ఇవ్వండి

బెంగళూరు: సినిమాకు వెళ్లాలని సెలవు కోరిన ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీకి ముచ్చటపడిన డిపో మేనేజర్ అతడికి సెలవు మంజూరు చేశారు. కర్ణాటకకు చెందిన రాజేశ్ ఎంజే.. కృష్ణ రాజనగర్ బస్ డిపోలో డ్రైవర్ కమ్ కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కుటుంబంతో కలిసి తాజాగా విడుదలైన సీతారామ కల్యాణ సినిమాకు వెళ్లాలనుకుంటున్నానని, కాబట్టి తనకు సెలవు కావాలంటూ డిపో మేనేజర్‌కు దరఖాస్తు చేస్తున్నాడు. సినిమా హీరో నిఖిల్ గౌడ, ముఖ్యమంత్రి కుమారస్వామి తమ జిల్లాకు చెందినవారు కావడం తనకు గర్వకారణమని సెలవు చీటీలో పేర్కొన్నాడు. కాబట్టి కుటుంబంతో కలిసి సినిమా చూసేందుకు తనకు ఒక రోజు సెలవు కావాలని అందులో అభ్యర్థించాడు. కృష్ణరాజనగర్–మైసూరు మధ్య బస్సు నడిపే రాజేశ్ నిజాయతీకి డిపో మేనేజర్ పాపా నాయక్ అచ్చెరువొందారు. వెంటనే సెలవు మంజూరు చేశారు. తనకు సెలవు లభించినందుకు రాజేశ్ సంబరపడిపోయాడు. సోమవారం కుటుంబంతో కలిసి సినిమా చూడబోతున్నందుకు ఆనందంగా ఉందని పేర్కొన్నాడు. కాగా, భర్త రాసిన లీవ్ లెటర్‌ను రాజేశ్ భార్య ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడంతో అది వైరల్ అయింది.

ఈసారి పెద్దపల్లి టీఆర్‌ఎస్ అభ్యర్థి వివేకేనా?

సుమన్‌ను అందుకే అసెంబ్లీకి పోటీ చేయించారా?



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: రానున్నా లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి రిజర్వుడ్ స్థానం నుంచి అధికారపార్టీ అభ్యర్థిగా ఎవరు పోటీ చేయనున్నారనేదానిపై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సర్వత్రా చర్చ కొనసాగుతోంది. పెద్దపల్లి టికెట్ ప్రభుత్వ సలహాదారు జి.వివేక్‌కు కట్టబెట్టేందుకే, సిట్టింగ్ ఎంపీ బాల్కసుమన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్, అసెంబ్లీకి పోటీ చేయించారనే వాదనలున్నాయి. వివేక్‌కు దాదాపు టికెట్ ఖాయమే అన్న పార్టీ వర్గాలు పేర్కొంటున్నప్పటికీ, ఇటీవల పార్టీలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో వివేక్‌కు కాకుండా మరేవరికైన టికెటిచ్చే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. పెద్దపల్లి నుంచి 2009 ఎన్నికల్లో విజయం సాధించిన వివేక్, తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్‌లో చేరి, కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ ఇచ్చిందన్న కారణంగా తిరిగి ఆపార్టీలో చేరి 2014 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. ఎన్నికల అనంతరం చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో తిరిగి గులాబీగూటికి చేరుకున్నారు. మళ్లీ కారెక్కిన వివేక్‌కు కేసీఆర్, ప్రభుత్వ సలహాదారు పదవిని కట్టబెట్టారు.

నాలుగుసార్లు గెల్చిన వెంకటస్వామి

1962 నుంచి రిజర్వుడ్ స్థానంగా ఉన్న పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పదిహేను సార్లు ఎన్నికలు జరిగితే, కాంగ్రెస్ మూడుసార్లు, కాంగ్రెస్ (ఐ) ఆరుసార్లు, టీడీపీ నాలుగుసార్లు, తెలంగాణ ప్రజాసమితి ఒకసారి, తెలంగాణ రాష్ట్ర సమితి ఒకసారి గెలిచాయి. సీనియర్ కాంగ్రెస్ నేత జి.వెంకటస్వామి ఇక్కడ నుంచి నాలుగుసార్లు గెలవగా, సిద్దిపేటలో మరో మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఎంఆర్.కృష్ణ ఇక్కడ రెండుసార్లు, కరీంనగర్ నుంచి రెండుసార్లు గెలిచారు. మరోనేత వి.తులసీరామ్ ఇక్కడ రెండుసార్లు, నాగర్‌కర్నూల్‌లో ఒకసారి, గొట్టే భూపతి, చెల్లిమెల సుగుణకుమారి రెండేసిసార్లు గెలిచారు. కె.రాజమల్లు, వివేక్, సుమన్ ఒక్కోసారి గెలిచారు. వెంకటస్వామి కేంద్రంలోను, రాష్ట్రంలోను మంత్రిగా పనిచేయగా, ఎంఆర్.కృష్ణ కేంద్రంలో మంత్రిగా పనిచేశారు. రాజమల్లు రాష్ట్రమంత్రిగా పనిచేశారు. ఈ నియోజకవర్గంలో సుమన్ అత్యధిక మెజార్టీ తెచ్చుకున్న నేతగా రికార్డు నమోదు చేశారు. పెద్దపల్లి లోక్‌సభ సెగ్మెంట్ నుంచి ఎనిమిది మంది ఎస్సీ నేతలు పదిహేనుసార్లు విజయం సాధించారు.

తెలంగాణ ఉద్యమ ప్రభావం తీవ్రంగా ఉన్న నియోజకవర్గంలో పెద్దపల్లి లోక్‌సభ స్థానం ఒకటిగా పేర్కొనవచ్చు. ఈ సెగ్మెంట్ నుంచి గత ఎన్నికల్లో తెలంగాణ విద్యార్థి ఉద్యమ నేతలలో ఒకరైన బాల్క సుమన్‌కు టీఆర్‌ఎస్ టిక్కెట్ ఇవ్వగా ఆయన ఏకంగా 2,91,158 ఓట్ల అధిక్యతతో అనూహ్య విజయం సాధించారు. 2009లో పెద్దపల్లి లోక్‌సభ సెగ్మెంట్ నుంచి గెలిచిన జి.వివేక్ 2014లో కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. టీడీపీ తరుపున పోటీ చేసిన డాక్టర్ జె.శరత్‌బాబుకు కేవలం 63,334 ఓట్లే వచ్చి డిపాజిట్ కోల్పోయారు. ఈసారి ఇక్కడి నుంచి టీఆర్‌ఎస్ పార్టీ తరుపున మాజీ ఎంపీ జి.వివేక్‌తో పాటు మంచిర్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ప్రవీణ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీ నాయకత్వం మాత్రం వివేక్ వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. బీజేపీ నుంచి ఎస్.కుమార్ పేరు వినిపిస్తోంది. కాంగ్రెస్ తరుపున ఇటీవల చెన్నూరు నుంచి పోటీచేసి ఓడిపోయిన బి.వెంకటేశ్ తదితరులు పోటీ చేసే అవకాశం ఉందంటున్నారు.

ప్రియాంక గాంధీపై స్వామి వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ప్రియాంక గాంధీపై బీజేపీ సీనియర్ నేత, ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆమె బైపోలార్ డిజార్డర్ అనే మానసిక వ్యాధితో బాధపడుతున్నారంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాధితో బాధపడేవారు సంతోషంలో అతిగా స్పందిస్తారు. బాధలో ఉన్నప్పుడు తీవ్రంగా కుంగిపోతారు. ప్రియాంక వ్యాధిని ప్రజలకు కూడా అంటించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మానసిక వ్యాధితో బాధపడుతున్న ప్రియాంక ప్రజా జీవితంలో పనిచేయలేరని పేర్కొన్నారు. ప్రియాంక గాంధీ వాద్రాను తూర్పు యూపీ ప్రచార ఇన్‌చార్జ్‌గా నియమించాలని కాంగ్రెస్ ఇటీవల నిర్ణయించినప్పటి నుంచి ఆమెపై విమర్శల జడివాన కురుస్తోంది. బీజేపీ నేతలు సమయం దొరికినప్పుడల్లా ఆమెపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఇటీవల బీహార్ మంత్రి వినోద్ నారాయణ్ ఝా మాట్లాడుతూ.. ప్రియాంక అందమైన ముఖం ఎన్నికల్లో ఓట్లు రాల్చబోదన్నారు. బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ మాట్లాడుతూ.. అవినీతిలో కూరుకుపోయిన రాబర్ట్ వాద్రా భార్యకు కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు అప్పగించడం వల్ల అంతిమంగా బీజేపీకే లాభమన్నారు. చాక్‌లెట్ ఫేస్‌తో లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోవాలని కాంగ్రెస్ భావిస్తోందంటూ బీజేపీ నేత కైలాష్ విజయ్ వర్గియా ఎద్దేవా చేశారు.

నేడు భారత్‌లో విడుదల కానున్న గెలాక్సీ ఎం-సీరీస్ ఫోన్లు



న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ శాంసంగ్ గెలాక్సీ ఎం సీరీస్ ఫోన్‌లను సోమవారం భారత్‌లో విడుదల చేయనున్నది. గెలాక్సీ ఎం 10, ఎం 20, ఎం 30, ఎం 50 పేరిట నాలుగు కొత్త ఆండ్రాయిడ్ ఫోన్‌లను శాంసంగ్ విడుదల చేయనున్నట్లు తెలిసింది. వాటిలో ఇన్ఫినిటీ–వి డిస్‌ప్లే, భారీ బ్యాటరీలు, ఫాస్ట్ చార్జింగ్, డ్యుయల్ బ్యాక్ కెమెరాలు, యుఎస్‌బి టైప్ సి పోర్టు తదితర ఫీచర్లను కామన్‌గా అందివ్వనున్నట్లు సమాచారం. కాగా, మొదట గెలాక్సీ ఎం 10, ఎం 20 ఫోన్‌లను మాత్రమే శాంసంగ్ విడుదల చేస్తుందని తెలిసింది. కానీ వాటితో పాటు ఎం 30, ఎం 50 ఫోన్‌లను కూడా శాంసంగ్ విడుదత చేస్తుందని వార్తలు వచ్చాయి. ఇక ఆ నాలుగు ఫోన్‌లలోనూ ఆండ్రాయిడ్ 8.1 ఓరియోను అందివ్వనున్నట్లు సమాచారం. గెలాక్సీ ఎం 10కు చెందిన 2 జీబీ ర్యామ్ వేరియెంట్ ధర రూ. 7990 ఉండనున్నట్లు తెలుస్తోంది. 3జీబీ ర్యామ్ వేరియెంట్ ధర రూ. 8990 ఉంటుందని తెలిసింది. అదే విధంగా గెలాక్సీ ఎం 20 3జీబీ ర్యామ్ వేరియెంట్ ధర రూ. 10990, 4జీబీ ర్యామ్ వేరియెంట్ ధర రూ. 12990 ఉండనున్నట్లు సమాచారం. గెలాక్సీ ఎం 10 ఫోన్‌లో 6.2 అంగుళాల డిస్‌ప్లే, 2/3 జీబీ ర్యామ్, 13, 5 మెగాపిక్సల్స్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు, 3400 ఎంఏహెచ్ బ్యాటరీ ఫీచర్లు ఉన్నట్లు తెలుస్తున్నది. గెలాక్సీ ఎం 20లో 6.3 అంగుళాల డిస్‌ప్లే, 3/4 జీబీ ర్యామ్, 13, 5 మెగాపిక్సల్స్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు, 32/64 జీబీ స్టోరేజ్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఫీచర్లను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. గెలాక్సీ ఎం 30లో 6.38 అంగుళాల డిస్‌ప్లే, 4జీబీ ర్యామ్, 13, 5 మెగాపిక్సల్స్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు, 16 మెగాపిక్సల్స్ సెల్ఫీ కెమెరా, 64/128 జీబీ స్టోరేజ్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఫీచర్లను అందివ్వనున్నట్లు తెలుస్తున్నది.


రాహుల్‌కు 'ప్రధాని' లక్షణాలున్నాయి

పట్నా (బీహార్): ప్రధానమంత్రి పదవిని చేపట్టడానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అర్హుడని, ఆయనలో ఇందుకు కావాల్సిన అన్ని లక్షణాలు ఉన్నాయని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ అన్నారు. అయితే, ప్రతిపక్షాల నుంచి ఈ పదవిని ఎవరు చేపడతారన్న విషయంపై ఎన్నికల తర్వాతే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆదివారం ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... 'రాహుల్ గాంధీ నాయకత్వ లక్షణాలపై ఎటువంటి అనుమానాలు అవసరం లేదు. ఆయనకు వ్యతిరేకంగా కొందరు పెద్ద ఎత్తున ప్రచారం చేసినప్పటికీ, పట్టుదల, విశాల హృదయం వల్ల ఆయన ప్రజల ఆదరాభిమానాల్ని పొం దారు. ఆయన నాయకత్వంలో ఇటీవల రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఈ విజయాలతో ఆయన తమ పార్టీ నేతల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు' అని వ్యాఖ్యానించారు. ఓ గొప్ప ప్రధాని కావడానికి గల అన్ని లక్షణాలు ఆయనలో ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఆయన అధ్యక్షుడు. 15 ఏళ్లుగా ఎంపీగా ఉన్నారు. ఆయన పార్టీ ఐదు రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. ఆయన నాయకత్వ లక్షణాలను ప్రశ్నించే అవకాశం లేదు అని తేజస్వీ యాదవ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ తీర్పని, ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించాలని మనం కోరుకోమని, ఇటువంటి సంస్కృతి మనకువద్దని ఆయన బీజేపీని ఉద్దేశించి విమర్శించారు. బీజేపీని ఓడించేందుకు తాను పని చేస్తానని తెలిపారు. 'ఎన్నికలు ముగియగానే మహాకూటమి నేతలు చర్చలు జరుపుతారు. ప్రధానమంత్రి అభ్యర్థిత్వంపై తొందరేమీ లేదు. 2004 లోక్‌సభ ఎన్నికల ముందు మన్మోహన్ సింగ్‌ని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించలేదు. ఆయన ప్రధాని అయిన తర్వాత దేశంలో ప్రభుత్వాన్ని పదేళ్లపాటు సమర్థంగా నడిపించారు' అని తేజస్వీ వ్యాఖ్యానించారు. 2004 ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలను ఏకం చేయడానికి తన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ పోషించిన పాత్రను ఇప్పుడు మీరు పోషిస్తారా? అని ఆయనను ప్రశ్నించగా... ప్రస్తుతం రాజ కీయాల్లో నేను నేర్చుకునే స్థాయిలోనే ఉన్నాను. ఓ నాయకుడికి కాదు అని వ్యాఖ్యానిం చారు. కాగా, ఇటీవల డీఎంకే అధినేత స్టాలిన్.. ఓ సమావేశంలో మాట్లాడుతూ రాహుల్ గాంధీయే తదు పరి ప్రధాని అంటూ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీంతో తొందరపాటు ప్రకటన అంటూ ఆయనపై కొందరి నుంచి విమర్శలు వచ్చినప్పటికీ, ఆయన తన మాటపై ఇప్పటికీ కట్టుబడే ఉన్నానని పలుసార్లు పునరుద్ఘాటించారు.



బీసీలు సంఘటితమైతే ఎదురే ఉండదు

• మీరు నాకు అండగా ఉండండి...నేను మీకు అండగా ఉంటా • టీడీపీతోనే బీసీలకు గుర్తింపు • బీసీల విదేశీ విద్యకు రూ.15లక్షల రుణం • వంద యూనిట్ల నుంచి 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ • అధికారంలోఉన్నా లేకున్నా బీసీ పక్షాన పోరాడింది టీడీపీయే • అన్ని కుల ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చుతాం • వడ్డెరలను ఎస్సీల్లో చేర్చేందుకు కృషి • కాంగ్రెస్ హయాంలో బీసీలకు అన్యాయం • టీడీపీ బలపడకూడదని వై.ఎస్. బీసీలను అణగదొక్కారు • తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు టీఆర్ఎస్ అన్యాయం చేసింది • బీసీ రిజర్వేషన్లను అణిచే కుట్ర బీజేపీ, వై.ఎస్.జగన్ చేశారు • జయహో బీసీ సభలో సీఎం చంద్రబాబునాయుడు



(రాజమహేంద్రవరం సూర్య ప్రధాన ప్రతినిధి): బీసీలు సంఘటిత శక్తిగా మారితే వారిని అడ్డుకొనే ఏ శక్తి ఉండదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యతనిచ్చి న్యాయం చేసిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన జయహో బీసీ సభలో పాల్గొని ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ సభకు టీడీపీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బీసీ శ్రేణులతో రాజమహేంద్రవరం పసుపుమయమైంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ జనాభాలో బీసీలు 50 శాతం ఉన్నారని, వారిని ఆదరించి గుర్తింపునిచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. "ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చాం. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖతో పాటు 25 శాతం బడ్జెట్ పెట్టాం. గతంలో ఎప్పుడైనా ఇంత మంది బీసీ మంత్రులు ఉన్నారా అని ప్రశ్నించారు. అన్ని రంగాల్లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు గుర్తింపు వచ్చింది. తెలుగుదేశం పార్టీని వెనుకబడిన వర్గాలు నమ్ముకున్నాయన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా బీసీల కోసం పోరాడిన పార్టీ తెలుగుదేశం పార్టీ" అని సీఎం అన్నారు.

కాంగ్రెస్ హయాంలో బీసీలకు అన్యాయం...

"కాంగ్రెస్ హయాంలో బీసీలకు అన్యాయం జరిగింది. టీడీపీ బలపడుతుందని వెనుకబడిన వర్గాలను వైఎస్ అణగదొక్కారు. 31 కులాలను బీసీల్లోకి చేర్చి రిజర్వేషన్లు పెంచకుండా వైఎస్ అన్యాయం చేశారు. 11 బీసీ ఫెడరేషన్లను నిర్వీర్యం చేశారు. బీసీ నాయకులను హత్య చేశారు. 2 వేల మంది నేత కార్మికులు, 1600 మంది గీత, 30 మంది స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకున్నారు. బీసీ మంత్రులు జైలు పాలయ్యారు. తెలంగాణలో బీసీలకు రిజర్వేషన్లు రద్దు చేసిన పార్టీ టీఆర్ఎస్. బీసీ రిజర్వేషన్ల రద్దుకు జగన్ వత్తాసు పలికారు. బీసీలను దెబ్బతీసేందుకు వైసీపీ, బీజేపీ కుట్రపన్నాయి" అని విమర్శించారు.

బీసీలకు సీఎం వరాల జల్లు...

"విదేశీ విద్య కింద వెనుకబడిన వర్గాలకు రూ.15 లక్షలు ఇస్తాం. బీసీలకు 100 నుంచి 150 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తాం. నేతన్నలకు రూ.111కోట్లు రుణమాఫీ చేశాం. ఎంబీసీలను గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. ఎంబీసీలకు కేటాయించిన రూ.100 కోట్లలో రూ.90 కోట్లు ఖర్చు పెట్టాం. విద్యార్థులకు రూ.2,900 కోట్లు ఉపకార వేతనాలు ఇచ్చాం. ఆదరణ పథకం కింద రూ.950 కోట్లతో 4లక్షల మందికి పనిముట్లు ఇచ్చాం. బీసీలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది. మీకు తోడుగా నేనుంటా నాకు చేయూతనిచ్చే బాధ్యత మీరు తీసుకోవాలి. సంఘటిత శక్తిగా తయారైతే బీసీలకు ఎదురే ఉండదు. నా జీవితంలో మొదటి ప్రాధాన్యత వెనుకబడిన వర్గాలకే. టీడీపీ తరపున ప్రతి గ్రామంలో జయహో బీసీ గర్జన ఉధృతం చేయాలి. జయహో బీసీ గర్జనతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

వడ్డెరులను ఎస్సీల్లో చేర్చేందుకు కషి చేస్తాం...

యాదవ, తూర్పుకాపులు, మత్స్యకారులకు ప్రత్యేక కార్పొరేషన్, అగ్నికుల క్షత్రియులు, వన్నికుల క్షత్రియులు, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత, గౌడకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. చేనేతల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఇంకా చంద్రబాబు మాట్లాడుతూ "నాయిబ్రాహ్మణులకు 150 యూనిట్ల ఉచితంగా కరెంట్ ఇస్తాం. వాల్మికి, బోయలను ఎస్టీల్లో చేర్చేందుకు కషి చేస్తాం. బీసీలకు సబ్‌ప్లాన్ తీసుకొచ్చి చట్టబద్ధత కల్పిస్తాం. అత్యంత వెనుకబడిన బీసీలకు ఇచ్చే సబ్సిడీని రూ. 30 వేల నుంచి రూ. 50 వేలకు పెంచుతాం. బీసీలకు కార్ల కొనుగోలుపై 25 శాతం సబ్సిడీ ఇస్తాం. భగీరథ జయంతిని రాష్ట్ర పండుగగా చేస్తాం. బుడబుక్కల, దొమ్మర సంక్షేమానికి కమిటీ వేస్తాం. స్వర్ణకారులకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తాం. వడ్డెరులను కూడా ఎస్సీల్లో చేర్చేందుకు కషి చేస్తాం. 75 రోజులు టీడీపీ జెండా బీసీల ఇంటిపై ఎగరాలి. వచ్చే ఎన్నికల్లో 150 సీట్లకుపైగా గెలుస్తాం. 25 పార్లమెంట్ స్థానాలు గెలుస్తాం." అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేఈ కష్ణమూర్తి, చిన రాజప్ప, యనమల రామకృష్ణుడు, లోకేశ్, అచ్చెన్నాయుడు, పితాని సత్యనారాయణ, కాల్వ శ్రీనివాసులు, జవహర్, కొల్లు రవీంద్ర పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు సభలో పాల్గొన్నారు.

'ఐక్యత విగ్రహం' సమీపంలో మొసళ్ల పట్టివేత



అహ్మదాబాద్: పర్యాటకుల భద్రత ను దృష్టిలో పెట్టుకొని గుజరాత్ లోని 'ఐక్యత విగ్రహం 'సమీపంలో ని చెరువుల్లో మొసళ్లను అధికారులు మరో ప్రాంతానికి తరలిస్తున్నారు. ఇందు కోసం డైక్3, 4 పిలిచే రెండు చెరువుల్లో 20కిపైగా బోన్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. సర్దార్ సరోవర్ డ్యామ్ నుంచి విడుదలైన నీటిని నర్మదా ప్రధాన కెనాల్ చేరే కంటే ముందు కృత్రిమం గా ఈ చెరువుల్లో స్థిరీకరిస్తారు. ఈ విషయమై కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆరాధనా సాహూ మాట్లాడుతూ ఇప్పటి వరకూ 12మొసళ్లను పట్టుకున్నట్లు వెల్లడించా రు. కెవాడియా గ్రామ సమీపంలో నెలకొల్పిన ఐక్యత విగ్రహాన్ని చూడటానికి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారని, వారికి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వీటిని తరలిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఎన్ని మొసళ్లను తరలించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకోలేదని, ఇప్పటి వరకూ 12మొసళ్లను పట్టుకున్నామని, ఆ ప్రాంతంలో మరో 300వరకూ మొసళ్లు ఉండొచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. మరో అధికారి ఐడ్రిష్ తోపియా మాట్లాడుతూ చెరువుల్లో ఏర్పాటు చేసిన 20 బోన్లలో చేపలను, మాంసాన్ని ఎరగా వేశామని చెప్పారు. త్వరలోనే మిగిలిన మొసళ్లు ఆహారం కోసం వచ్చి అందులో చిక్కుతాయని, అనంతరం వాటిని రెస్క్యూ సెంటర్‌కు తరలిస్తామని చెప్పారు. త్వరలోనే వాటిని సర్దార్ సరోవర్ ప్రధాన జలాశయంలో వాటిని విడుదల చేస్తామన్నారు.

ఈ చెరువుల్లో పర్యాటకుల కోసం సీప్లేన్ సర్వీస్‌ను ప్రారంభించేందుకే అందులోని మొసళ్లను తరలిస్తున్నారనే వార్తలపై స్పందించడానికి వారు నిరాకరించారు. జనవరి 23న ఆ రాష్ట్ర మంత్రి భూపేంద్రసిన్హా మాట్లాడుతూ అహ్మదాబాద్‌లోని సబర్మతి నది నుంచి ఐక్యత విగ్రహం వరకూ సీప్లేన్ సర్వీస్‌ను ప్రారంభించనున్నామని ప్రకటించారు.

బీజేపీలో చేరిన బాలీవుడ్ నటి ఇషా



ముంబాయి: బాలీవుడ్ నటి ఇషా కొప్పికర్ ఆదివారం కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో ఆమె బీజేపీలో చేరారు. కొప్పికర్ తెలుగులో చంద్రలేఖ, ప్రేమతో రా.. వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించారు. తమిళ, కన్నడ, మరాఠీ చిత్రాల్లోనూ నటించారు. కొప్పికర్ 2002లో ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కించిన కంపెనీ సిని మాలోని ప్రత్యేక గీతంతో బాలీవుడ్‌కు పరిచయం అయ్యారు. తర్వాత అనేక హిందీ చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు.

కొన్ని రోజుల క్రితం ప్రముఖ సీనియర్ నటి మౌసమీ ఛటర్జీ పశ్చిమ బంగాలో బీజేపీలో చేరారు. నటి రూపా గంగూలీ 2015లో బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఆమె రాజ్యసభ సభ్యురాలిగా సేవలు అందిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల జిమ్మిక్కేనా?


ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలకు ప్రభుత్వం ఎలాంటి ప్రయోజనాలూ కల్పించడాన్ని ఎవరూ అడ్డుకోరు. అందుకోసం ఆ కోణంలో చూస్తే కేంద్రం నిర్ణయం సమర్థనీయ మేనని భావిస్తున్నా... కేంద్రం కోటా ప్రకటిస్తే సరిపోదని, దాని ఫలితాలు లభించాలంటే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలను కూడా భర్తీ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో వాటాపై వివిధ కులాల మధ్య జరిగే ఘర్షణను ఈ నిర్ణయం ఎంతవరకు పరిష్కరించగలదన్నది కూడా ఆలోచించాలని సూచిస్తున్నారు.. అగ్రవర్ణంలో పుట్టినప్పటికీ ఆర్థికంగా వెనకబడిన వ్యక్తి అన్ని విషయాల్లో ఇతర బలహీన వర్గాల వ్యక్తుల్లాగే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అయితే, దళితులు, ఇతర వెనకబడిన వర్గాల్లోని పేదలు అగ్రవర్ణ పేదలతో పోలిస్తే మరింత ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. దానికి కారణం వారు సామాజికంగా, సాంస్కృతికంగా కూడా వెనకబడి ఉండటం, వివక్షకు గురికావడం. కాబట్టి ఈ కోణంలో చూస్తే అగ్రవర్ణ పేదలను, ఓబీసీ పేదలను ఒకే గాటన కట్టడం ఎంత వరకు సమర్థనీయమని రాజ్యాంగ నిపుణులు వేస్తున్న ప్రశ్న. తాజా కోటాకు సంబంధించిన కుటుంబ ఆదాయం, సాగుభూమి ఆధారంగా ఆర్థిక వెనక బాటును నిర్ణయించనున్నట్టు పేదల బిల్లు ప్రతి పాదించింది. అయితే, ఈ ప్రాతిపదిక అగ్ర వర్ణాలకేనా లేక అన్ని వర్ణాలకీ వర్తిస్తుందా అన్నది బిల్లులో స్పష్టం చేయలేదు. కుల, మతాలకతీతంగా ఆర్థికంగా వెనుక బడినవారికి రిజ ర్వేషన్ కల్పిస్తు న్నట్టు మాత్రమే పేర్కొంది. దీనివల్ల అగ్రవర్ణ పేదలు కూడా దీని పరిధిలోకి వస్తారు. అదే జరిగితే రిజర్వేషన్లు మూడు రకాలుగా తయారవుతాయి. కేవలం గుర్తింపు ఆధారంగా



ఇచ్చే రిజర్వేషన్లు అంటే ఎస్సీ, ఎస్టీలు ఒక రకం. కులం, ఆర్థిక స్తోమత ఆధారంగా ఇచ్చే రిజర్వేషన్లు రెండో రకం. ఓబీసీ/ఈబీసీలు ఈ కోవలోకి వస్తారు. మూడోది కులంతో సంబంధం లేకుండా కేవలం ఆర్థిక ప్రాతిపదికపైనే ఇచ్చే రిజర్వేషన్లు. ఈ మూడు రకాల రిజర్వేషన్లకు సంబంధించి వివా దాలు తలెత్తే అవకాశం ఉంది. ఓబీసీ రిజర్వేషన్లలో కుల ప్రాతిపదికన తొలగించాలని, ఆర్థిక స్తోమతనే ప్రాతిపదికగా తీసుకోవాలని ఇప్పటికే పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ దీనిని అమలు చేస్తే, ఎస్సీ, ఎస్టీలు మినహా మిగిలిన అన్ని కులాలకూ ఒకే కోటా ఉంటుంది. ప్రస్తుత ఓబీసీ, ప్రతిపాదిత ఈబీసీ కోటాను కలిపేసి ఎస్సీ, ఎస్టీలు మినహా మిగిలిన అన్ని కులాలకూ క్రీమీలేయర్ వర్తింపజేసి, పేదలకు ఈ కొత్త కోటాలోనే రిజర్వేషన్ కల్పించాలనేది వారి డిమాండ్. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలోనూ క్రీమీలేయర్ విధానాన్ని ప్రవేశపెట్టి, అసలైన పేదలకే రిజర్వేషన్లు ఇవ్వాలన్న డిమాండ్ కూడా ఎప్పటినుంచో ఉంది. ప్రస్తుతానికయితే కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న అగ్రవర్ణాల కోపాన్ని కొంతమేర తగ్గించవచ్చు. రిజర్వేషన్లపై వారి అభిప్రాయాన్ని మార్చుకునేందుకు వీలు కల్పిస్తుంది. కేంద్రం తాజా నిర్ణయంపై వారిలో వ్యతిరేకత వ్యక్తం కాకపోవడం, ఇది మెరిట్‌ను చంపేస్తుందంటూ రోడ్డెక్కకపోవడమే దీనికి నిదర్శనం. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో తమ వాటాపై వివిధ కులాల మధ్య తలెత్తుతున్న ఘర్షణలను ఈ పేదల కోటా ఏ మేరకు పరిష్కరి స్తుందన్నది వారి అనుమానం. దశాబ్దాల తరబడి ఖాళీగా ఉంటున్న ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వం ఈ ఘర్షణను నివారించవచ్చు. ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గి పోతుండటం, నియామక ప్రక్రియ నిలిచిపోవ డం వల్ల యువజనుల్లో తలెత్తిన అసంతృప్తిని ఉద్యోగాల భర్తీ ద్వారా తొలగించడమన్నది ఈ ఎన్నికల సంవత్స రంలో ప్రభుత్వ తక్షణ ప్రాధాన్యం కావాలని బడుగు మేధావులు సూచిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

జగన్ 'మోడీ రెడ్డి'



తట్టుకోలేరని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నో అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రూ. 5,500 కోట్లతో 24వేల కి.మీ మేర సీసీ రోడ్లు వేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎన్టీఆర్ వల్లే బీసీ సోదరులకు రాజ్యాధికారం వచ్చిందన్నారు. చిన్న రాష్ట్రం అయినా సమస్యలు చాలా ఉన్నాయని, చంద్రబాబు నిద్రపోరు, మనల్ని నిద్రపోనివ్వరని లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షం ఏపీకి పరిశ్రమలు రాకుండా చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలతో టీడీపీ ప్రభుత్వం బలహీనవర్గాలకు అండగా ఉందని అన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని వివరించారు. "జలధార కింద రూ.22వేల కోట్లతో నీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నాం. 2020 నాటికి ప్రతి ఇంటికీ కుళాయి రాబోతోంది. 32 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశాం. సంక్షేమం చంద్రన్న జెండా, అభివద్ధి చంద్రన్న అజెండా. ఆదరణ పథకం కింద బీసీలకు పనిముట్లు అందజేశాం. 45 లక్షల బీసీలకు ఉపకారవేతనాల కోసం రూ.800 కోట్లు కేటాయించాం. ప్రధాని నరేంద్రమోదీ తెలుగు జాతిపై దాడి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివద్ధిని అడ్డుకుంటున్నారు. ఏపీలో ఎవరు పెట్టుబడులు పెట్టినా వారిపై ఐటీ దాడులు చేయిస్తున్నారు. వైసీపీ డ్రామా కంపెనీగా మారింది. బీజేపీ నాయకులకు దమ్ముంటే ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేస్తున్నా. ఎన్నికలు రాబోతున్నాయి. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. ఏపీలోని 25 పార్లమెంట్ స్థానాలు గెలిపిస్తే దేశ ప్రధానిని నిర్ణయించే శక్తి చంద్రబాబుకు ఉంటుంది" అని లోకేశ్ వివరించారు.


అమరావతి చరిత్రలో కీలకం

అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో మాట్లాడుతూ 62 ఏళ్ల తర్వాత విజయవాడ-గుంటూరు ప్రాంతంలో హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభమవడం ద్వారా నవ శకం మొదలైందన్నారు. "భారత ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ ఒక బలమైన స్తంభం. కొత్త రాజధానిలో న్యాయ కార్యకలాపాలు ప్రారంభమవడం నాకెంతో సంతోషంగా ఉంది. ఫిబ్రవరి 3న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) రాష్ట్ర తాత్కాలిక హైకోర్టు భవనాన్ని ప్రారంభించనుండడం మనకు గర్వకారణం. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దేశంలోనే ఉత్తమ న్యాయస్థానంగా నిలవాలని కోరుకుంటున్నా" అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. హైకోర్టు భవన ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్, న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ (ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షుడిగా పనిచేశారు), జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డిలను ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లినప్పుడు స్వయంగా ఆహ్వానించారు. ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లన్నీ త్వరగా పూర్తిచేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రపంచంలోనే తొలిసారిగా అమరావతిలో న్యాయ నగరాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. న్యాయ నగరాన్ని 450 ఎకరాల్లో రెండు దశల్లో నిర్మిస్తామని తెలిపారు. తొలి దశ 2022కల్లా పూర్తవుతుందని, రెండో దశ 2036కి పూర్తవుతుందని వివరించారు. "అనేక అడ్డంకులు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రజల రాజధాని నగరాన్ని నిర్మించాలన్న దఢ సంకల్పంతో ముందుకెళ్తున్నాం. రాజధాని కోసం 33 వేల ఎకరాలిచ్చి ఈ ప్రాంత రైతులు ఇప్పటికే చరిత్ర సష్టించారు. ఇలాంటి అద్భుతాన్ని దేశంలో ఎక్కడా చూడలేదు. అనేక రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఇదో అధ్యయన అంశంగా మారింది. అమరావతి ఐదు కోట్ల ఆంధ్రుల సెంటిమెంట్. నమ్మకం, ప్రజల భాగస్వామ్యంతోనే రాజధాని నగరాన్ని అభివద్ధి చేస్తున్నాం. రోజూ వేలాది మంది ప్రజలు అమరావతిని సందర్శిస్తున్నారు. చారిత్రిక నగరంపై వారికున్న ప్రేమకు ఇదే నిదర్శనం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాజధాని నగరం రాష్ట్ర అభివద్ధికి చోదక శక్తిలాంటిదని సీఎం అభివర్ణించారు. అమరావతి ఫలాలు రాష్ట్రంలోని నలుమూలలకూ చేరినప్పుడే తన ఆకాంక్ష నెరవేరినట్లన్నారు. రాజధాని ఆర్థికాభివద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి అందాలన్నదే తన ధ్యేయమని పునరుద్ఘాటించారు. 55 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మిస్తున్న సచివాలయానికి సంబంధించిన ఐదు టవర్ల పనులు పురోగతిలో ఉన్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. 8.25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం, 250 మీటర్ల ఎత్తులో నిర్మించనున్న అసెంబ్లీ భవన నిర్మాణ పనులనూ ప్రారంభించనున్నట్లు చెప్పారు. వివిధ న్యాయ సంబంధిత కార్యకలాపాలకు హైకోర్టు భవన సముదాయం ప్రధాన కేంద్రంగా మారుతుందని ఇంధన, ఐఅండ్ఐ, ఏపీసీఆర్డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. ఈ కాంప్లెక్సులో జ్యుడీషియల్ భవన సముదాయం, నివాసాలు, ఆర్బిట్రేషన్, ధ్యాన కేంద్రాలు, విద్యా సంస్థలు, ప్రైవేటు న్యాయ సంస్థలువంటివి ఉంటాయన్నారు. హైకోర్టు కాంప్లెక్సును 42 ఎకరాల్లో 12.2 లక్షల చదరపు



అడుగుల్లో నిర్మిస్తున్నట్లు వివరించారు. తొలి దశలో 36 కోర్టు హాళ్లు నిర్మిస్తున్నామని, భవిష్యత్తులో అదనంగా 24 కోర్టు హాళ్లను నిర్మించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. హైకోర్టుతో పాటు ట్రిబ్యునళ్లు, సిటీ కోర్టుల వంటి వాటినీ అభివద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. హైకోర్టు నిర్మాణ వ్యయ అంచనా రూ.1400 కోట్లని సీఆర్డీఏ కమిషనర్ సిహెచ్.శ్రీధర్ తెలిపారు. భవన నిర్మాణ ఆకతుల కోసం సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టు భవనాలపై అధ్యయనం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పురపాలక మంత్రి పి.నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా, సీఎం ప్రత్యేక సీఎస్ సతీశ్‌చంద్ర, సీఎం ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఏడీసీ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, సీఆర్డీఏ స్పెషల్ కమిషనర్ రామమోహన్‌రావు, అదనపు కమిషనర్ షాన్ మోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముహూర్తం దగ్గరున్నది!




మరో సారి కేబినెట్ విస్తరించే అవకాశాలున్నాయని అంటున్నారు.

ఐదు రోజులపాటు సహస్ర మహా చండీ యాగం నిర్వహించిన ముఖ్యమంత్రి, యాగం పూర్తికావడం తో, మంత్రివర్గ విస్తరణపై దృష్టి సారించారని చెబుతున్నారు. ఈ నెల 30తో పంచాయతీ ఎన్నికలు ముగు స్తుండటంతో, ముఖ్యమంత్రి మంత్రివర్గ విస్తరణ చేపట్టే అవకాశాలు న్నట్లు తెలుస్తోంది. మార్చి మొదటి వారంలోగా లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్న నేపథ్యంలో, ఫిబ్రవరి మూడో వారంలోగా బడ్జెట్ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుందని, అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉన్నందున ఖచ్చితంగా మంత్రి వర్గ విస్తరణ ఉంటుదని అధికారపార్టీ ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. జనవరి 31 తిథి పరంగా పుష్య మాసం బహుళ ఏకాదశి, గురువారం రోజు మంచి ముహూర్తమని అదే రోజు మంత్రి వర్గ విస్తరణ ఉండే అవకాశాలున్నాయని అంటున్నారు.

ఆరు నుంచి 8 మందితో విస్తరణ : తెలంగాణా మంత్రి వర్గ విస్తరణ పూర్తి స్థాయిలో ఉంటుందా? పాక్షికంగా ఉంటుందా అనే చర్చ సర్వత్రా కొన సాగుతోంది. విస్తరణలో ముఖ్యమంత్రి సీనియర్లకు అవకాశాలిస్తారా? లేకపోతే జూనియర్లను తీసుకుంటారా? అన్నదానిపై కూడా ఆసక్తికరమైన చర్చ జరుగు తోంది. ఇతర పార్టీల నుంచి పలువురు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో మంత్రి విస్తరణ చేపట్టకుండా, కేవలం ఆరు లేదా ఎనిమిది మందితో విస్తరణ చేపట్టే అవకాశాలున్నాయన్న వాదనలు రాజకీయవర్గాల్లో వినిపిస్తున్నాయి. లోక్ సభ ఎన్నికల తర్వాత మరో సారి పూర్తి స్థాయిలో మంత్రివర్గాన్ని విస్తరించే అవకాశాలున్నాయని అంటున్నారు.

రాజకీయ వేదిక కాదు

ఆయన పేర్కొన్నారు. మన్ కీ బాత్ సందర్భంగా ఆదివారం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి రాజకీయ అంశాలకు తావు లేదని, నెలకోసారి దేశ ప్రజలతో మాట్లాడే అదృష్టం తనకు కలిగిందని మోడీ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వినే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను ఫోన్లు, ఈ-మెయిళ్లు, సందేశాల ద్వారా అందిస్తున్నారని, ఇది మంచి పరిణామమని ఆయన చెప్పారు. నేతాజీ సుభాష్ చంద్ర బోస్, శివకుమార స్వామికి ఆయన నివాళులర్పించారు. వారు దేశానికి ఎనలేని సేవలు చేశారని ఆయన పేర్కొన్నారు. కలాంశాట్, రేడియో ప్రాముఖ్యంతో పాటు పలు అంశాలపై మోడీ ప్రసంగించారు. అంతరిక్షంలో పరిశోధనలు చేసే స్థాయికి భారత యువత ఎదిగిందని ఆయన కొనియాడారు. ఇది దేశం గర్వించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. భారత్ కు చెందిన విద్యార్థులు ఉపగ్రహాలు పంపే స్థాయికి చేరుకున్నారని చెప్పారు.. అలాంటి విద్యార్థులను అందరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలు గర్వించ దగ్గ కలాం శాట్‌ను భారత విద్యార్థులే తయారు చేసి ప్రారంభించారని, యువత ఇంతకంటే ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తన చిన్న తనంలో మీడియా ఇంత విస్తృతంగా లేదని, తాను రేడియో ద్వారానే అన్ని విషయాలు తెలుసుకునే వాడినని ఆయన తెలిపారు. అన్ని మాధ్యమాల కంటే రేడియో మాధ్యమం ప్రభావవంతంగా పనిచేస్తుందన్న నమ్మకం తనదని ఆయన



చెప్పారు. సోషల్ మీడియా, మీడియా కొన్ని పట్టణ ప్రాంతాలు, కొన్ని గ్రామాల వరకే పరిమితమవుతుందని, అయితే రేడియో మాత్రం మారుమూల ప్రాంతాలకు సైతం వినిపిస్తుందని ఆయన తేల్చి చెప్పారు. సుభాష్ చంద్రబోస్ పోరాటయోధులకు హీరో. స్వాతంత్ర్యపోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. వివిధ నినాదాలతో యువతలో స్ఫూర్తి రగిలించే వారు. అటువంటి మహనీయుడు మన దేశంలోనే జన్మించడం భారత ప్రజల అదృష్టమని మోడీ పేర్కొన్నారు. శివకుమార స్వామీజీ సిసలైన బసవేశ్వర స్వామి భక్తుడు. ఆజన్మాంతం ఆయన సమాజం కోసమే బతికారు. వేలాది మందికి విద్య, వైద్య, ఆర్థిక సమస్యలను తీర్చారు. 2007లో ఆయనను నేను కలిసే అవకాశం వచ్చింది. ఆ రోజును ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. బసవేశ్వరుడి సిద్ధాంతమైన కాయకావే కైలాశ్‌ను శివకుమార స్వామీజీ నిజమైన అనుచరుడు. 111 ఏళ్ల తన జీవితంలో వేలాది మంది ప్రజల సాంఘిక, విద్యా, ఆర్థిక అభివృద్ధి కోసం ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. అనేకసార్లు తనకు స్వామీజీ ఆశీస్సులు తీసుకునే అవకాశం కలిగిందని ప్రధాని పేర్కొన్నారు. 2007లో శివకుమార స్వామీజీ శత జయంతి ఉత్సవాలకు నాటి రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంతో కలిసి తూమకూరులో ఆయనను దర్శించుకున్నానని గుర్తుచేసుకున్నారు. కాగా ఈ ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా అర్హతగల యువతీ యువకులంతా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని కోరారు. భారత ఎన్నికల కమిషన్‌పైనా ప్రధాని ప్రశంసలు కురిపించారు. భారీ ఎత్తున భారత దేశంలో ఎన్నికలు నిర్వహిస్తూ, భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈసీ కృషి చేస్తున్నదన్నారు.




టీడీపీ పేదల పార్టీ: మంత్రి సోమిరెడ్డి

నెల్లూరు, సూర్య ప్రతినిధి : మనుబోలులో తాజా మాజీ ఉపసర్పంచ్ దండు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరుగురు తాజా మాజీ వార్డు సభ్యులు, 150 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆత్మీయ ఆహ్వానం పలికారు. ఈ సందర్బంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ దండు చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. అందరికీ మనస్ఫూర్తిగా ఆహ్వానం పలుకుతున్నామన్నారు. నాలుగున్నరేళ్లలో 35 గ్రామాల నుంచి వైసీపీ ముఖ్యనాయకులు టీడీపీలో చేరారన్నారు. ఎమ్మెల్యే ప్రవర్తనకు విసిగిపోయి రాబోయే నెలరోజుల్లో పెద్దసంఖ్యలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరబోతున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్న ప్రజల శ్రేయస్సు కోసమే పనిచేస్తున్నామన్నారు. ఐదు మండలాల్లో వైసీపీ ఎంపీపీలున్నప్పటికీ అధికారం ఉంది కదా అని సమావేశాలకు వెళ్లి వారిపై పెత్తనం చేయలేదన్నారు. టీడీపీ పేదల పార్టీ, పింఛన్ రేషన్ కార్డు, పక్కా ఇల్లు వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందే ఎన్టీఆర్ అని అన్నారు. పింఛన్ ను రూ.200 నుంచి రూ.2 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. పొదుపు లక్ష్మి గ్రూపులకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చింది చంద్రబాబు అనిఅన్నారు. 93 వేలమంది ఆడపడుచులకు ఇప్పటికే ఓసారి రూ.10 వేల చొప్పున పసుపు-కుంకుమ కానుక అందజేశారు. ఇప్పుడు మళ్లీ రూ.10 వేలతో పాటు స్మార్ట్ ఫోన్‌ను చంద్రన్న అందజేస్తున్నారన్నారు.

జాబితాపై నేతల్లో టెన్షన్


- నియోజకవర్గాల్లో అనుకూల, వ్యతిరేకతలపై నివేదికలు
- మార్పు తప్పని సరేనా
- రిజర్వుడు స్థానాలపైనా ప్రత్యేక దృష్టి
- రోజూ టెలీకాన్ఫరెన్స్ పాఠాలు
- ఫ్లెక్సీలు, వాట్సప్ సందేశాలతో గ్రామాల్లో ఆశావాహుల సందడి



(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) :సార్వత్రిక ఎన్నికల దగ్గరపడే కొద్ది నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీల కోలాహలం కనపడుతుంది. ఏ పార్టీలో ఎవరికి టిక్కెట్ వస్తుందోనని ఉత్కంఠత నెలకొంది. ఆశావాహుల సందడి అంతాఇంతా కాదు. దానిలో భాగంగా అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేల్లోనూ హైటెన్షన్ నెలకొంది. పార్టీ అధిష్ఠానం ప్రతీ ఒక్కరి జాతకాలను సేకరిస్తోంది. నియోజకవర్గాల్లో బలం, బలహీనతలను బేరీజు వేస్తూ సామాజిక వర్గాల్లో మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తోంది. ఎన్నికల్లో అభ్యర్థుల జాబితాలను సిద్ధం చేసి, సాధ్యమైనంత త్వరగానే విడుదల చేసేందుకు సమాయత్తమైంది. జాబితాలో ఎవరికి స్థానం దక్కబోతుంది? మరెవరి సీటు మారబోతుంది? రాబోయే కొత్త ముఖాలు ఏమిటి? ఇదీ ఇప్పుడు తెలుగుదేశం పార్టీ వర్గాలను వేధిస్తున్న ప్రశ్నలు. గోదావరి జిల్లాలో ఫలితాలు టీడీపీకి మరోసారి ఆయువు పట్టుకానున్నాయి. ప్రతిపక్ష వైసీపీని ధీరోదాత్తంగా ఎదుర్కొని, విజయం వైపు అడుగులు వేసే వారికే టికెట్ ఖాయమని, ప్రస్తుత సిట్టింగ్‌లైన కొందరికి మరోసారి ఛాన్స్ ఇచ్చే అవకాశమే లేదని విస్తత ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పార్టీల్లో వేడి పుట్టిస్తుండగా, అధికార పార్టీలో ఇప్పటికే సెగలు రేగుతున్నాయి.

మార్పు తప్పని సరేనా:ఈ ఎన్నికలు పార్టీకి జీవన్మరణ సమస్య కావడంతో గెలుపు గుర్రాలను మ్రాత్రమే బరిలో నిలువుతామని పార్టీ ప్రకటించింది. కొన్ని వారాలుగా అంతర్గత కసరత్తు ఆరంభించింది. 'ఈసారి తెలుగుదేశం సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో మార్పులు, చేర్పులు తప్పవు. కనీసం అర డజను సీట్లలో అయినా సీఎం చంద్రబాబు ఒకింత సాహసం చేయవచ్చు. సామాజిక వర్గాల వారీగా వచ్చిన మార్పులు, చేర్పులను దష్టిలో పెట్టుకుని కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వవచ్చు' అని పార్టీ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. దీనిని బట్టి చూస్తే పార్టీ అధిష్ఠానం మార్పులు, చేర్పులు చేయనుంది. రిజర్వుడు నియోజకవర్గాల్లో మార్పులకు అవకాశం ఉన్నట్టు ఇప్పటికే ప్రచారం జోరుగా సాగుతోంది. దీనిపై ఇప్పటికే కసరత్తు కొలిక్కి వస్తున్నట్లు సమాచారం. ఆశవహులు మ్రాం పార్టీ నిర్ణయం ఏదీ వెలువడక మునుపే తమకు అనుకూలంగా, ప్రస్తుత సిట్టింగ్‌కు వ్యతిరేకంగా ప్రచారం ఆరంభించారు. 'ఒక నియోజకవర్గంలో మీరంతా అనుకున్నట్టు జరగబోదు. సీఎం చంద్రబాబు కసరత్తు పూర్తి చేశారు. జాబితాను విడుదల చేయబోతున్నారు. ఆ జాబితాలో మా నాయకుడి సంఖ్య ఏడు' అంటూ వాట్సప్‌ల్లో ఊదరగొడుతున్నారు. అలాగే తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో స్నేహపూరిత కోటాలో బీజేపీకి కేటాయించారు. ఇప్పుడు అదే పార్టీని దీటుగా ఢీకొనేందుకు ముందుగానే అభ్యర్థిని ఖరారు చేయనున్నారు.

ఫ్లెక్సీల యుద్ధం :'పార్టీ అధిష్ఠానాన్ని కలిశాం. పార్టీ కోసం పనిచేయమన్నారు. సీటు విషయం పరిశీలిస్తామన్నారు. ఇప్పటికిప్పుడు చెప్పడం సరికాదని భావించే పరోక్షంగా మాకు లైన్ క్లియర్ చేశారు' అంటూ ఆశావహులందరూ నియోజకవర్గాల్లో ఫ్లెక్సీల యుద్ధం ఆరంభించారు. 100 నుంచి 200 వరకు ఫ్లెక్సీలను తయారు చేసి నియోజకవర్గం అంతటా మోహరింపజేశారు. అధిష్టానం అనుమతి ఉందా? అని క్రియాశీలక కార్యకర్తలు ప్రశ్నిస్తే, 'సిట్టింగ్ ఎమ్మెల్యేకు టిక్కెట్ రాని పక్షంలో ప్రత్యామ్నాయంగా మనకే అవకాశం ఇవ్వబోతున్నారు' అంటూ ఆశవహులు దీటుగానే సమాధానం ఇస్తున్నారు.




దాదాపు సగం నియోజకవర్గాల్లో ఫ్లెక్సీల ప్రచారం వాడి వేడిగా సాగుతోంది.

తగ్గుతున్న వ్యతిరేకత :తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పటికే ఎన్నికలను దష్టిలో పెట్టుకుని వరాలను కురిపిస్తుండడంతో నియోజకవర్గాల్లో అనుకూలత పెరుగుతోంది. ఇంతకు ముందున్న వ్యతిరేకత నియోజకవర్గంలో తగ్గింది. 'అప్పుడే ఏమైంది. ముందు ముందు మరిన్ని వరాలు ప్రకటించడం ఖాయం. పేద వర్గాలతో సహా మిగతా వారంతా పార్టీకి కొమ్ము కాసే విధంగా పథకాలు ఉండబోతున్నాయి. సీఎం చంద్రబాబు చాణిక్యత ముందు ఎవరూ నిలవలేరు' అంటూ టీడీపీ నేతలు ధీమాగా ఉన్నారు.

రోజూ టెలీకాన్ఫరెన్స్ పాఠాలు :ప్రతీరోజూ గంటపాటు జిల్లాల వారీగా నేతలకు ఉమ్మడిగా సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పాఠాలు నేర్పుతున్నారు. పార్టీ శ్రేణులు ఎన్నికల బరిలోకి దిగేందుకు ఎలా సిద్ధం కావాలో పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. దీనిలో భాగంగానే పార్టీలో వివిధ హోదాల్లోవున్న నాయకులంతా ఉదయం 7.30 గంటలకు ఠంచన్‌గా టెలీ కాన్ఫరెన్స్‌కు సిద్ధం అవుతున్నారు. జరిగిన విషయాన్ని అందరికీ చేరవేస్తున్నారు. 'ఒకటికి రెండుసార్లు చెబుతున్నాను. ఎవరంతట వారుగా వ్యవహరించడం సరికాదు. పార్టీ కోసం సమష్టిగా కష్టపడి తీరాల్సిందే. దీనిలో ఎలాంటి జాప్యం చేసినా సహించేది లేదు' అంటూ సీఎం చంద్రబాబు కేడర్‌కు సరికొత్త సంకేతాలు ఇస్తున్నారు.

వచ్చే నెల 13న ఢిల్లీలో సీఎం దీక్ష




వెలగపూడి, సూర్య ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ ఫిబ్రవరి 13వతేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దేశ రాజధాని ఢిల్లీలో దీక్ష చేపట్టనున్నారు. ఈనెల 31వతేదీ నుంచి ఫిబ్రవరి 13వతేదీ వరకు పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లోనే ఏపీకి ప్రత్యేక హోదాను కేంద్రం ప్రకటించాలని, లేకుంటే సమావేశాల చివరి రోజైన 13వతేదీన దీక్ష చేపట్టాలని చంద్రబాబు నిర్ణయించినట్లు సమాచారం.

ఐదు గజాల స్థలమూ ఇవ్వలేదు : మోహన్‌బాబు



పాలకొల్లు, సూర్య ప్రతినిధి : "దాసరి నారాయణరావు స్మారకంగా సొంతూరులో కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తుంటే, ఆయన ఎంతో సేవ చేసిన హైదరాబాద్‌లో మాత్రం విగ్రహం కోసం ఐదు గజాల స్థలం కూడా కేటాయించలేదు"ని ప్రముఖ నటుడు మోహన్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. దాసరి సొంతూరు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఆయన కాంస్య విగ్రహాన్ని మోహన్‌బాబు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం నెత్తిన పాలుపోసిన పాలకొల్లు ప్రజలను ఎన్నడూ మరిచిపోనన్నారు. భక్తవత్సలం నాయుడుగా ఉన్న తనకు మోహన్‌బాబుగా నామకరణం చేసి హాస్యనటుడిగా, విలన్‌గా, కథానాయకుడిగా అవకాశాలిచ్చి ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన దాసరి నారాయణరావును చిత్రపరిశ్రమకు అందించిన ఘనత పాలకొల్లుదన్నారు. అగ్ర కథానాయకులు కూడా అవకాశాల కోసం దాసరిని ప్రాథేయపడేవారని అన్నారు. దాసరి ఓ మహాగ్రంథమని అభివర్ణించారు. దాసరి గౌరవార్థం పాలకొల్లుకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు తన విద్యానికేతన్ కళాశాలలో ఇంజినీరింగ్ వరకు చదివిస్తానని తెలిపారు. పాలకొల్లు శాసన సభ్యుడు నిమ్మల రామానాయుడు, ఏపీ మంత్రి గంటా శ్రీనివాసరావు, సినీనటులు ప్రభ, శ్రీకాంత్, శివాజీరాజా, కవిత, హేమ, సంగీత దర్శకుడు కోటి, దర్శకులు రవిరాజా పినిశెట్టి, రేలంగి నరసింహారావు, ధవళ సత్యం, నిర్మాత సి.కళ్యాణ్ పాల్గొన్నారు.

నరసరావుపేటలో బ్రాహ్మణ ఆత్మీయ సన్మానసభ



నరసరావుపేట, సూర్య ప్రతినిధి: నరసరావుపేట లోని గీతామందిరంలో ఏర్పాటు చేసిన బ్రాహ్మణ ఆత్మీయ సన్మానసభ కార్యక్రమంలో ఏపీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద సూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ కోడెల మాట్లాడుతూ బ్రాహ్మణులు పేదరికం కారణంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వాలు బ్రాహ్మణులను కేవలం ఓటు బ్యాంకుగా మ్రాత్రమే చూశాయన్నారు. ఈ ప్రభుత్వం బ్రాహ్మణుల కోసం అనేక సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. సీఎం చంద్రబాబు పరిపాలనా దక్షితతో రాష్ట్రం అభివద్ధి సంక్షేమంలో దూసుకుపోతుందన్నారు. కోటప్పకొండను అద్భుతంగా అభివద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజల సహకారం, తోడ్పాటుతో నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాలలో వేల కోట్ల అభివద్ధి జరిగిందన్నారు. ఆనందం సూర్య మాట్లాడుతూ దేశంలో, ప్రపంచంలో బ్రాహ్మణుల సంక్షేమం గురించి మాట్లాడిన పార్టీ టీడీపీ అని అన్నారు. చంద్రబాబు పాదయాత్రలో బ్రాహ్మణులకు ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణుల అభివద్ధికి, సంక్షేమానికి 2వందల కోట్ల రూపాయలు ఖర్చుచేయడం జరిగిందన్నారు. అమరావతి నిర్మాణాన్ని అడుకోవడానికి చాలా మంది విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అలాంటి వారికి బుద్ధి చెప్పాలంటే మనందరం చంద్రబాబుకి అండగా ఉండాలన్నారు.

ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- మొత్తం 9 స్థానాలకు 10న ప్రకటన
- మళ్లీ యనమల రామకష్ణుడికే
- ఆశావహుల జోరు



(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) :రాష్ట్ర శాసనమండలిలో ఖాళీ అవుతున్న 9 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధమవడంతో టిక్కెట్లు ఆశిస్తున్న ఆశావహుల్లో సందడి మొదలైంది. వీటికి ఎన్నికలు నిర్వహించేందుకు ఫిబ్రవరి 10న ఎన్నికల సంఘం నుంచి ప్రకటన వెలువడుతుందని భావిస్తున్నారు. శాసనసభ్యుల కోటాలోని 5 స్థానాల్లో పదవీ విరమణ చేస్తున్న వారిలో మంత్రులు యనమల రామకష్ణుడు, పి.నారాయణ, ఎమ్మెల్సీలు ఆదిరెడ్డి అప్పారావు, పి.శమంతకమణి, అంగూరి లక్ష్మి శివకుమారి ఉన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ప్రాతనిధ్యం వహిస్తున్న గాదె శ్రీనివాసులునాయుడు, తూర్పు-పశ్చిమగోదావరి, గుంటూరు-కష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి ప్రాతనిధ్యం వహిస్తున్న కలిదిండి రవికిరణ్ వర్మ, బొడ్డు నాగేశ్వరరావుల సభ్యత్వం కూడా ముగియనుంది. 5లో టీడీపీకి 4:శాసనసభలో ప్రస్తుతం ఉన్న సంఖ్యా బలాన్ని బట్టి చూస్తే, ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అవుతున్న 5 ఎమ్మెల్సీ స్థానాల్లో 4 టీడీపీకి, ఒకటి వైసీపీకి వస్తాయి. 4 స్థానాల్లో ఒకటి మళ్లీ యనమల రామకష్ణుడికే కేటాయించడం దాదాపు ఖాయం. మంత్రి నారాయణ ఈసారి నెల్లూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తున్నారు. వంగవీటి రాధాకష్ణ టీడీపీలో చేరితే ఆయనకు విజయవాడ సెంట్రల్ టిక్కెట్ ఇవ్వలేని పక్షంలో, ఎమ్మెల్సీగా పంపించే అవకాశం ఉంది. ఏపీ ఎన్జీవోల సంఘం మాజీ అధ్యక్షుడు అశోక్‌బాబు, త్వరలో టీడీపీలో చేరనున్న ఘట్టమనేని ఆదిశేషగిరిరావు పదవులను ఆశిస్తున్నారు. 3 చోట్ల ఆశావహుల జోరు:ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు పార్టీలకు అతీతంగా ఎన్నికలు జరిగినా, ప్రధాన రాజకీయ పార్టీల మద్దతుతో అభ్యర్థులు బరిలోకి దిగుతారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీఆర్‌టీయూ తరవున ప్రస్తుత ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు మళ్లీ బరిలోకి దిగనున్నారు.

ప్రస్తుతం పద్మనాభం మండలంలో ఒక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రఘువర్మ ఏపీటీఎఫ్ తరవున, సమైక్యాంధ్ర ఉద్యమంలో చురుగ్గా పనిచేసిన అడారి కిశోర్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. తూర్పు-పశ్చిమగోదావరి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.

అక్కడ ప్రస్తుత ఎమ్మెల్సీ రవికిరణ్ వర్మ లేదా ఆయన తండ్రి 'చైతన్య' రాజు పోటీ చేయాలని భావిస్తున్నారు.


అలాగే ఐ.వెంకటేశ్వరరావు (పీడీఎఫ్), బండారు సూర్యనారాయణమూర్తి (ఐఎన్‌టీయూసీ), ఎన్.శేషారెడ్డి (ఆదిత్య విద్యాసంస్థల అధినేత), టి.కె.విశ్వేశ్వరరెడ్డి (రాజమహేంద్రి విద్యా సంస్థలు), హిప్నో కమలాకర్ (ప్రజాశాంతి పార్టీ), మాగంటి చినబాబు, పోతుల వెంకట విశ్వం (క్రైట్ విద్యా సంస్థల కరస్పాండెంట్) పోటీకి సిద్ధమవుతున్నారు.

భాజపా కూడా ఒక అభ్యర్థిని పోటీకి నిలబెట్టాలని భావిస్తోంది. గుంటూరు-కష్ణాజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పోటీ చేయడం లేదు. పీడీఎఫ్ తమ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేరు ఇప్పటికే ప్రకటించింది. వీరితో పాటు టీడీపీ నాయకులు రాయపాటి శ్రీనివాస్ (మాజీ ఎమ్మెల్సీ), పోతినేని శ్రీనివాస్, గొట్టిపాటి రామకష్ణ ప్రసాద్, దాసరి రాజా మాస్టారు, టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు బ్రహ్మం చౌదరి, తదితరులు పోటీ చేయాలని భావిస్తున్నారు.

టీడీపీ మద్దతుతో బరిలోకి దిగే అభ్యర్థులు ఎవరన్న విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. మరోపక్క ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల శాసనమండలి ఎన్నికలపై వైసీపీఇంత వరకు తన వైఖరేంటో స్పష్టం చేయలేదు.


శ్రీనివాసుని వైభవం... పులకించిన భక్తజనం

విజయవంతంగా ముగిసిన శ్రీవారి నిత్యోత్సవాలు



విజయవాడ, సూర్య బ్యూరో : లోక కళ్యాణార్థం శ్రీ లక్ష్మి శ్రీనివాసా వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో కష్ణా తీరంలోని పున్నమీ ఘాట్‌లో నిర్వహించిన సర్వకార్య సిద్ది మహా శాతి హోమ సహిత శ్రీవారి నిత్యోత్స వాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ నెల 20 నుంచి ప్రారంభమైన నిత్యోత్సవాల తొలి రోజు నుంచే భక్తులు వేలాదిగా తరలి వస్తూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో ఆరాదించారు. శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవంలో నిత్యం 600 మంది దంపతులు పాల్గొన్నారు. సాయత్రం వేళ స్వామివారి ఉత్సవమూర్తులతో మాడవీధుల్లో నిర్వ హించిన తిరుమాడ వీధి ఉత్సవాలకు భక్తులు తండోప తండాలుగా తరలి వచ్చారు. శ్రీవారి వైభవాన్ని వివరిస్తూ పలువురు పీఠాధిపతులు చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో ఓలలా డించాయి. కార్యక్రమంలో శ్రీ లక్ష్మి శ్రీనివాసా వాసవి సేవా సమితి అధ్యక్షులు దూపుగుంట్ల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు గరిమెళ్ళ నానయ్య చౌదరి (నాని), ప్రధాన కార్యదర్శి మామిడి వెంకట కష్ణారావు, గౌరవాధ్యక్షురాలు మానేపల్లి లక్ష్మీకుమారి, కోశాధికారి ఉదయగిరి శ్రీనివాసులు, పలువురు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు సొంత ఇళ్లు




ఏలూరు, సూర్య ప్రతినిధి : సొంతగహం లేని ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు. ఉద్యోగుల హౌసింగ్ పాలసీని ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో 43 ఉత్తర్వులను జారీచేసింది. ఆ మేరకు నవ్యాంధ్రప్రదేశ్‌లో హౌసింగ్ సొసైటీలకు ఇళ్ళ స్థలాలు, ప్లాట్లను కేటాయించేందుకు మార్గదర్శకాలను విడుదల చేసింది. జిల్లాలో వర్కింగ్ ఉద్యోగులందరికీ సొంత నివాసం కల్పించాలన్న లక్ష్యంతో ఎంప్లాయిస్ హౌసింగ్ పాలసీని రూపొందించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఈ పథకానికి అర్హులే. ప్రభుత్వ భూమి ఉన్నచోట ఇళ్ళ స్థలాలు కేటాయిస్తారు. ప్రభుత్వ భూమి లేనిచోట ప్రైవేటు భూములను సమీకరించి, ఆ భూమిని బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలకు అనుమతించి ఫ్లాట్లను కేటాయిస్తారు. సొసైటీలు, గ్రూపులుగా ఏర్పడిన వారికి మ్రాత్రమే కేటాయింపు ఉంటుంది. వ్యక్తిగతంగా ఏ ఒక్క ఉద్యోగికి భూకేటాయింపులు ఉండవు. సంబంధిత గ్రూపు లేదా సహకార సొసైటీగా ఏర్పడి ఇంటి స్థలాలు, ఫ్లాట్లకు దరఖాస్తు చేసుకోవాలి. సొసైటీ లేదా గ్రూపులో కనీసం 12 మంది అర్హతగల సభ్యులు ఉండాలి. ఉద్యోగులు తమ పేరునగాని, స్పౌజ్ పేరునగాని లేదా తమపై ఆధారపడిన పిల్లల పేరునగాని అర్బన్ ఏరియా, పట్టణ ప్రాంతాల్లో నివాసం లేదని ధ్రువీకరిస్తూ ప్రమాణపత్రాలను అఫిడవిట్ రూపంలో సంబంధిత సొసైటీ, గ్రూప్ ద్వారా అందజేయాల్సి ఉంటుంది. ఉద్యోగులు సంతకం చేసిన దరఖాస్తులను సంబంధిత సొసైటీ, గ్రూప్‌లు కలెక్టర్‌కు అందజేయాలి. దరఖాస్తుదారుల అర్హతలపై కలెక్టర్ సంతప్తి చెందిన తర్వాతే ఇంటి స్థలం, ఫ్లాట్ కేటాయింపు ఉంటుంది. ప్రమాణ ప్రంతో కూడిన అఫిడవిట్‌ను కూడా కలెక్టర్‌కు దరఖాస్తుతోపాటే అందజేయాలి. ఈ దరఖాస్తులను, ప్రమాణప్రం అఫిడవిట్‌లను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో సాధారణ ప్రజానీకం తెలుసుకునేందుకు వీలుగా కలెక్టర్ అందుబాటులో ఉంచుతారు. దరఖాస్తులు, డిక్లరేషన్‌లను ప్రాతిపదికగా తీసుకుని ఇళ్ళ స్థలాలు, ఫ్లాట్లకు అవసరమైన భూమిని కలెక్టర్ కేటాయిస్తారు. ఏపీ ల్యాండ్ మేనేజ్‌మెంట్ ఆథారిటీ రికమండేషన్ మేరకు నామమ్రాత్రపు ధరపై సొసైటీకి ప్రభుత్వం భూమిని కేటాయిస్తుంది. కేటాయించిన ప్రభుత్వ భూమిని సొసైటీకి రిజిష్టర్డ్ సేల్ డీడ్గా బదలాయిస్తారు. భూమిని కేటాయించిన తర్వాత ఆరునెలల్లోగా ఇంటి స్థలాలుగా సొసైటీలు విభజించాల్సి ఉంటుంది. కేటాయించిన స్థలం, ఫ్లాట్‌లో నిర్మాణ పనులను మూడేళ్ళలో పూర్తి చేసుకోవాలి. సంబంధిత ఇంటి స్థలం, ఫ్లాట్‌ను 15 సంవత్సరాల వరకు



విక్రయించేందుకు వీలు లేదు. ఒక ఉద్యోగి ఒక సొసైటీలో మ్రాత్రమే సభ్యత్వం కలిగి ఉండడానికి అర్హులు. జీవితకాలంలో ఒక్కసారి మ్రాత్రమే తన సర్వీసులో ప్రభుత్వ ఇంటి స్థలం, ఫ్లాట్‌ను పొందేందుకు అర్హత కలిగి ఉంటారు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైన సందర్భాల్లో ఒకరికి మ్రాత్రమే అర్హత ఉంటుంది. ఇళ్ళు, ఫ్లాట్లు నిర్మాణంలో ఉద్యోగుల కోఆపరేటివ్ సొసైటీ లేదా గ్రూపునకు నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఉంది. ఒకవేళ ఏపీహౌసింగ్ బోర్డు, ఏపీ టిడ్కో సహకారాన్ని అర్థిస్తే ఇస్తారు.

రైతులకు అపార నష్టం మిగిల్చిన అకాల వర్షం!

హైదరాబాద్ నగరంలో భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే సూచన




హైదరాబాద్: తెలంగాణలో శనివారం పలుచోట్ల కురిసిన అకాల వర్షాలతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. కాలం కాని కాలంలో కురిసిన వర్షాలతో కంది, మిరప, మామిడి, పెసర, పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలు మరో రెండు రోజులు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అంచనాలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రాజధాని హైదరాబాద్‌లోనూ శనివారం రాత్ర భారీ వర్షం కురిసింది. గోల్కొండ, లంగర్ హౌజ్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మెహిదీపట్నం, పంజాగుట్ట, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో జనం ఇబ్బందులు పడ్డారు. మహబూబ్‌నగర్, మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురం భీం జిల్లాల్లో భారీగా కురిసన వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి పలు చోట్ల జల్లులు పడ్డాయి. కమలాపూర్, భీంపల్లి, కన్నూరు, దేశరాజ్‌పల్లి, గూడూరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కమలాపూర్‌లోని పర్కాల - హుజురాబాద్ రహదారిపై వరద నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారి వెంట నూతనంగా వేసిన విద్యుత్ లైన్ స్తంభాలు నేలకొరిగాయి. నర్సంపేట, వర్ధన్నపేట ప్రాంతాల్లో చలిగాలులు వీచాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని టేకుమట్ల, మొగుళ్లపల్లి, ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో కురిసిన వర్షానికి మిర్చి, పత్తి పంటలు తడిసి ముద్దయ్యాయి. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతోపాటు తూర్పు విదర్భ మీదుగా ఉత్తర కర్ణాటక వరకు ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణ, ఏపీలో రాగల 48 గంటల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సముద్రానికి 1.5 కి.మీ. ఎత్తున ఉపరితల ఆవర్తనం కేంద్రీకృతమై ఉందని వెల్లడించింది.

సత్యనారాయణమూర్తి సైకిలెక్కేనా?



విజయవాడ, సూర్య బ్యూరో : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో అన్ని నియోజకవర్గాలలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అలాగే పాలకొల్లు నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు మారనున్నాయా? అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. పదిరోజులుగా పట్టణంలో వివిధ రాజకీయ పరిణామాలు చోటుచేసుకోగా తాజాగా గురువారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి)ని ఇక్కడి టీడీపీ శ్రేణులు కలసి పార్టీలోకి ఆహ్వానించినట్లు విశ్వసనీయ సమాచారం. ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఏఎంసీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, మున్సిపల్ ఛైర్మన్ వల్లభు నారాయణమూర్తి, కౌన్సిలర్లు జీవీ, పెచ్చెట్టి బాబు తదితరులు డాక్టర్ బాబ్జీని కలసి తెలుగుదేశం పార్టీలోనికి రావాల్సిందిగా కోరినట్లు సమాచారం. అయితే ఆలోచించి తగిన నిర్ణయం తీసుకుంటానని డాక్టర్ బాబ్జీ చెబుతూ పార్టీ అంటే తనకు అభిమానమేనని, అయితే ఆలోచించి తన నిర్ణయం చెబుతానని చెప్పినట్లు తెలిసింది. ఇప్పటికే సీఎం పేషీ నుంచి డాక్టర్ బాబ్జీకి ఆహ్వానం వచ్చినట్లుగా పట్టణంలో ప్రచారం జరుగుతోంది. నీతికి నిజాయితీకి కట్టుబడి ఉండే డాక్టర్ బాబ్జి పార్టీలో ఉంటే పార్టీ ఇమేజ్ మరింతగా పెరుగుతుందన్న ఉద్దేశంతో పేషీ నుంచి ఆహ్వానం పంపించినట్లు ప్రచారం జరుగుతోంది. డాక్టర్ బాబ్జీ సానుకూలంగా స్పందించి పాతగూటికి వస్తే పార్టీలో సముచిత ప్రాధాన్యం కల్పించే దిశలో పార్టీ ఉన్నత స్థాయి శ్రేణులు ఇప్పటికే రూపకల్పన చేసినట్లు సమాచారం. డాక్టర్ బాబ్జీ ప్రస్తుతం బీజేపీ స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్‌గా పార్టీలో మంచి పేరు పొంది ఉన్నారు. ఈ పరిస్థితుల్లో కొన్ని నెలలుగా ఒకవైపు వైసీపీ, మరోవైపు జనసేన పార్టీలు డాక్టర్ బాబ్జీని తమ పార్టీలలోకి ఆహ్వానించినట్లు ప్రచారం జరుగుతూనే ఉంది. మొన్నామధ్య రాజమండ్రి ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ నేరుగా డాక్టర్ బాబ్జీని కలిసి జనసేనలోకి రావాల్సిందిగా ఆహ్వానించినట్లు ప్రచారం జరిగింది. ఆయన రెండ్రోజుల క్రితం జనసేనలో చేరారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో డాక్టర్ బాబ్జీని పార్టీలోకి రావాల్సిందిగా నేరుగా స్థానిక టీడీపీ ఎమ్మెల్యే ఆహ్వానించినట్లు తెలియడంతో ఒకవైపు బీజేపీ శ్రేణులు ఆందోళన చెందుతుండగా మరోవైపు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. డాక్టర్ బాబ్జీ పాత గూటికి వస్తే నియోజకవర్గంలో టీడీపీకి భారీ మెజారిటీ వస్తుందని, ఈ



ప్రభావం జిల్లా అంతటిపైనా కనిపిస్తుందని పార్టీ శ్రేణులు ఆశిస్తున్నాయి. ఏది ఏమైనా ఈసారి జరగబోయే ఎన్నికల సమరంలో భారీ మార్పులు జరిగే అవకాశం వుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

టీడీపీకి బీసీలు అండగా నిలవాలి : మంత్రి యనమల



రాజమహేంద్రవరం, సూర్య ప్రతినిధి : రాష్ట్రంలోని బీసీలంతా ఐకమత్యంగా ఉండాలని, టీడీపీకు అండగా నిలవాలని ఏపీ ఆర్థికమంత్రి యనమల రామకష్ణుడు కోరారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన 'జయహో బీసీ' సదస్సుకు టీడీపీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ 1983కు ముందు బీసీలకు ఆర్థిక, రాజకీయ సాయం ఉండేది కాదని, 1982లో టీడీపీ స్థాపించిన తర్వాత బీసీలను గుర్తించింది నందమూరి తారకరామారావు అని గుర్తు చేశారు. బీసీల కోసం టీడీపీ ప్రభుత్వం 43వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని యనమల తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు144 బీసీకులాలను విడదీయడానికి కొన్ని శక్తులు పనిచేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని పిలువునిచ్చారు. తెలుగుదేశం పార్టీ వచ్చిన తర్వాతే బీసీల జీవితాలు బాగుపడ్డాయని, కొందరికి రాజకీయ అవకాశాలు వచ్చాయని వివరించారు. పారిశ్రామిక విధానంలో బీసీలకు న్యాయం చేసేందుకు సీఎం క షి చేస్తున్నారన్నారు. బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్ల కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపామన్నారు. బీసీలు ఆర్థికంగా బలపడాల్సిన అవసరం ఉందని, బీసీల భవిష్యత్తు కోసం సీఎం కషి చేస్తున్నారన్నారు. మరోసారి చంద్రబాబును సీఎం చేసి మన కోరికలు నెరవేర్చుకోవాలని యనమల కోరారు. ఈ సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర మంత్రులు కేఈ కష్ణమూర్తి, కళా వెంకట్రావు, చినరాజప్ప, పితాని సత్యానారయణ, కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నవ్యాంధ్రాభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుంది



- త్వరలో రైతుల కోసం సరికొత్త కార్యక్రమం
- ఇది నా అత్తగారి గ్రామంగా భావిస్తున్నా
- కృష్ణాజిల్లా కొమరవోలులో చంద్రబాబు
- పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొమరవోలు గ్రామాన్ని 10 స్టార్స్ గ్రామంగా ప్రకటిస్తున్నామని, ఎక్కడ ఉన్నా పుట్టిన ఊరును మర్చిపోవద్దని అన్నారు. నారా భువనేశ్వరి దత్తత తీసుకున్న గ్రామం కొమరవోలు పర్యటనకు చంద్రబాబు తన సతీమణి భువనేశ్వరితో కలిసి వచ్చారు. ఆయన సతీమణి భువనేశ్వరి, ఇతర కుటుంబసభ్యులతో కలిసి కష్ణాజిల్లా కొమరవోలులో పర్యటించారు. నారా భువనేశ్వరి ఈ గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో పలు అభివద్ధి కార్యక్రమాలను చంద్రబాబు ప్రారంభించారు. గ్రామంలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, పంచాయతీ కార్యాలయం, ఎన్టీఆర్ గహసముదాయాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో అభివద్ధి కార్యక్రమాల పైలాన్‌ను సీఎం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. మద్యం, ధూమపాన రహిత గ్రామంగా చేయాలని గ్రామస్థులంతా నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న నారా భువనేశ్వరిని అభినందిస్తున్నానని చెప్పారు. కొమరవోలును 10 స్టార్స్ గ్రామంగా గుర్తిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు.

త్వరలో రైతుల కోసం సరికొత్త కార్యక్రమం...

తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జీవితం అన్ని తరాల వారికి ఆదర్శమని ఈ సందర్భంగా చంద్రబాబు కొనియాడారు. ప్రపంచంలో ఐదు అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా అమరావతి నిలిచిపోతుందని, రాజధాని నిర్మాణానికి సొంతభూమి లేని సంక్షోభ స్థితిలో పాలన మొదలుపెట్టామన్నారు. ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా రైతుల నుంచి 33వేల ఎకరాల భూమిని సేకరించగలిగామని చెప్పారు. పోలవరం కంటే ముందు పట్టిసీమ పూర్తి చేసి కష్ణా డెల్టా రైతులను ఆదుకున్నామన్నారు. చర్త్రి ఉన్నంత వరకు తాను చేసిన అభివద్ధి నిలిచిపోతుందని చెప్పారు. ఆదాయం లేనప్పటికీ పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని, ఆటోలు, ట్రాక్టర్లపై పన్నులు ఎత్తివేసి ఆదుకున్నామని సీఎం వివరించారు. రైతులు, కౌలు రైతులను ఆదుకునేందుకు సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టనున్నామని చంద్రబాబు ప్రకటించారు.

ఇది నా అత్తగారి గ్రామంగా భావిస్తున్నా...

రూ.10 కోట్లతో పలు అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. సీఎం మాట్లాడుతూ ఎన్టీరామారావు సతీమణి బసవతారకం, తన పిల్లల బాగోగులు చూసుకోవడమే కాకుండా రామారావు బాగోలు కూడా ఆమె చూసేవారని, ఆయన అన్ని విజయాలు సాధించారంటే ఆయన వెనుక బసవతారకం క షి



సహకారం ఎంతో ఉందని, ఇది తన అత్తగారి గ్రామంగా భావిస్తున్నానని అన్నారు. భవిష్యత్తులో కూడా కొమరవోలు గ్రామాన్ని ఒక ఆదర్శ గ్రామంగా తయారు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలను ఒకే విధంగా అభివద్ధి చేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లు నివాసయోగ్యంగా ఉండేవి కాదని, ఇప్పుడు పేదవాళ్లకు ధఢమైన ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని అన్నారు. రైతులు తనపై నమ్మకంతో అమరావతి రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు ఇచ్చారని సీఎం కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ లోటు బడ్జెట్‌లో ఉన్నా, ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. వెయ్యి నుంచి రూ.2వేలకు పెన్షన్ పెంచామని, పసుపు-కుంకమ పథకం కింద రూ. 10 వేల చొప్పున డ్వాక్రా మహిళలకు సాయం చేస్తున్నామని అన్నారు. రైతు రుణాలు మాఫీ చేశామని, ఆటో, ట్రాక్టర్లకు పన్ను ఎత్తివేశామన్నారు. కౌలు రైతులను కూడా ఆదుకునేందుకు చర్యలు చేపట్టామని చంద్రబాబు పేర్కొన్నారు.



విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షనులో జరిగిన మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ కుమారుడు ధోవతీ ఫంక్షన్లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు.
(సూర్య ప్రధాన ప్రతినిధి,అమరావతి)

హైకోర్టు భవనాలను పరిశీలించిన సీఎం



అమరావతి, సూర్య బ్యూరో : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివారం నేలపాడులో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ నూతనంగా నిర్మిస్తున్న హైకోర్టు భవనాలను ఆయన పరిశీలించారు. రాష్ట్ర హైకోర్టుకు కోట్లాది రూపాయల అంచనా వ్యయంతో భవనాలను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. త్వరలో వీటి నిర్మాణం పూర్తికానున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు, తన సతీమణి భువనేశ్వరితోపాటు పలువురు మంత్రులు, అధికారులు భవనాలను పరిశీలించారు. అనంతరం సంభందిత అధికారులకు తగు సూచనలు, సలహాలు చేశారు.



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కోర్ క్యాపిటల్ ఏరియాలో జోరుగా సాగుతున్న భవన నిర్మాణాలను మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించారు. నిర్మాణం పూర్తయి నివాసానికి సిద్ధం చేసిన అఖిల భారత సర్వీసు అధికారుల భవన లోపలి భాగాన్ని మరోసారి ప్రత్యక్షముగా పరిశీలించారు. ప్రధానంగా ఫిబ్రవరి మూడున రాజధాని పరిధిలో విధులు నిర్వహించడానికి సిద్ధమైన కోర్టు భవనాలను సైతం సందర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల క్వార్టర్లను బయట నుంచే పరిశీలించారు. అమరావతి కోర్ క్యాపిటల్ ఏరియాలో వేగంగా జరుగుతున్న నిర్మాణ పనుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతృప్తిని వ్యక్తం చేశారు.

సూర్య బ్యూరో, అమరావతి.

భారీ మెజారిటీకి వ్యూహం

- చీరాల, కొండపిపై టీడీపీ దృష్టి
- పార్లమెంట్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం
- సీనియర్లకు నామినేటెడ్ పదవులు

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి)


రాబోయే సార్వత్రిక ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికకై అధికార తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కసరత్తు చేస్తున్నారు. క్యాడర్ బలోపేతానికి, అభ్యర్థుల మెజారిటీ పెంపుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పార్లమెంటు అభ్యర్థుల విజయానికి దోహదపడే అసెంబ్లీ నియోజకవర్గాలను ఎంపిక చేసుకుని టీడీపీ ముందడుగు వేస్తోంది. జిల్లాలో బాపట్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో చీరాల, ఒంగోలు లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో కొండెపి అసెంబ్లీ నియోజకవరాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు సమాచారం. అక్కడ నేతల సమన్వయ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే అంశాలను గుర్తించడంలో నిమగ్నమయ్యారు.


ఆమంచికి ప్రత్యేక ప్రాధాన్యం...

చీరాల అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆమంచి కష్ణ మోహన్ వ్యక్తిగత పరపతిని, రాజకీయంగా ఉన్న పట్టును సద్వినియోగం చేసుకోవాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలిసింది. అందుకు అనుగుణంగా గత ఎన్నికల్లో ఆయన సాధించిన విజయంతోపాటు చేయూతనిచ్చిన అంశాన్ని ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకున్నారు. గత ఎన్నికల్లో చీరాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన ఆమంచి కృష్ణమోహన్ పార్లమెంట్‌కువచ్చే సరికి టీడీపీ అభ్యర్థికి చేయూతనిచ్చారు. ఫలితంగానే శాసనసభ్యుడిగా గెలు పొందిన ఆమంచికి 11 వేల పైచిలుకు ఆధిక్యం రాగా, చీరాల అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రస్తుత ఎంపీ మాల్యాద్రికి 9వేలకు పైగా మెజారిటీ వచ్చింది. తర్వాత అమంచి టీడీపీలో చేరినప్పటికీ ఆయనకు ఆశించిన ప్రాధాన్యం లభించలేదు. పార్టీలో కిందిస్థాయిలో చోటుచేసుకున్న పరిణామాలతో ఆమంచి నిరాశతోనే ముందుకు సాగారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమంచిని ముఖ్యమంత్రి చంద్రబాబు చేరదీశారు. పలు సార్లు ఆమంచి పనితీరును ఆయన కొనియాడారు. ఇక రాష్ట్రంలో జనసేన ఆవిర్భావం, ఆ తర్వాత నెలకొన్న పరిణామాల నేపథ్యంలో అనేక సంద ర్భాల్లో ఆమంచితో భేటీ అయిన సీఎం కొన్ని విషయాల్లో వ్యూహాత్మకంగా ఆయన్ను ముందుకు నడిపారు. దీనికితోడు తాను ఆమంచికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పలుసార్లు బహిరంగంగానే తన ప్రవర్తన ద్వారా తెలియజేశారు. ఒంగోలులో నిర్వహించిన ప్రతిభ అవార్డుల సభకు ఆమంచి కాస్తంత ఆలస్యంగా హాజరు కాగా, ముఖ్యమంత్రి తన పక్కన కుర్చీ వేయించి ఆమంచిని కూర్చోబెట్టుకోవడం కన్పించింది. తదనంతరం పర్చూరు నియోజకవర్గంలో గ్రామదర్శిని సభకు వచ్చిన ముఖ్యమంత్రి ఎక్కడో వెనుక ఉన్న ఆమంచిని దగ్గరకు రమ్మని సైగ చేసి ఆయన భుజంపై చెయ్యి వేసి ముందుకు సాగారు. చంద్రబాబు రాజకీయ నడవడికలో ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా జరుగు తాయని ఆ పార్టీలోని సీనియర్లు చెవుతున్నారు.

కొండెపిలో నేతల సమన్వయంపై దృష్టి...

ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కొండెపి అసెంబ్లీ సెగ్మెంట్‌లో





నాయకుల మధ్య సమన్వయంతో మంచి ఆధిక్యతను సాధించాలన్న ఆలోచనతో టీడీపీ ఉన్నట్లు సమాచారం. ఆ నియోజకవర్గంలోని వైసీపీ వ్యవహారాల్లో గందరగోళ పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో అక్కడ మరింత ఆధిక్యం సాధించాలన్న ఆలోచనకు చంద్రబాబు వచ్చినట్లు తెలిసింది. గతేడాది నవంబరు 3న నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఈ విషయాన్ని ఆయన బహిరంగంగానే చెప్పారు. 'మంచి అవకాశాలున్నాయి. మరింత ఆధిక్యం సాధించి ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి గెలువునకు దోహదడాలి' అని స్పష్టం చేశారు. దామచర్ల కుటుంబ సభ్యుల మధ్య ఉన్న విభేదాలను సరిచేసుకోవాలని వారిని సూటిగానే ఆయన హెచ్చరించారు. ఇటు పార్టీ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌తోపాటు, కందు కూరు ఎమ్మెల్యే పోతుల రామారావును సమన్వయం చేసుకోవాలని ముందు నుంచి ఎమ్మెల్యే స్వామికి చంద్రబాబు సూచిస్తున్నారు.

ప్రస్తుతం దామచర్ల కుటుంబం నుంచి ఆ నియోజకవర్గ వ్యవహారాలు చూస్తున్న యువనేత సత్యకు ఆవిషయంలో అవసరమైన చొరవ తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇంకోవైవు పార్టీ అధ్యక్షుడిగా జనార్దన్,



పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన మాగుంటలపై కూడా బాధ్యతలు మోపారు. ఈ నెల 9న జిల్లాకు వచ్చినప్పుడు కూడా చంద్రబాబు కొండెపి వ్యవహారాలపై ఆరా తీశారు. పరిస్థితులను చక్కదిద్దుకొని భారీ ఆధిక్యాన్ని ఇవ్వకపోతే మీరే ఇబ్బంది పడ"తారంటూ నేతలను హెచ్చరించారు. శుక్రవారం తనను కలిసిన ఎమ్మెల్సీ మాగుంటతో కూడా అదే విషయాన్ని చంద్రబాబు ప్రస్తావిస్తూ 'మీరూ చొరవ చూపండి. ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గం నుంచి మీ గెలువునకు కొండెపి కీలకమవుతుంది' అని సూచించినట్లు తెలిసింది. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక సమస్యలు, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు రాజకీయంగా పరిస్థితులను చక్కబెట్టుకొని లోక్‌సభ అభ్యర్థుల గెలువులో చీరాల, కొండెపి అసెంబ్లీ నియోజకవర్గాలను కీలకం చేయాలని భావిస్తున్న చంద్రబాబు వ్యూహం ఎంత వరకు ఫలిస్తుందన్నది చూడాల్సి ఉంది.

ఈసారి మరింత మెజారిటీ లక్ష్యం...

నియోజకవర్గ పరిస్థితిపై వివిధ రకాల సర్వేలు చేయించి ఒక అంచనాకు వచ్చిన చంద్రబాబు అక్కడ మరింత మెజారిటీ దిశగా నియోజకవర్గాన్ని తీసుకువెళ్లాలన్న ఉద్దేశంతో పార్టీలో అక్కడ ఉన్న ఇతరులకు కూడా అవసరమైన గుర్తింపునిస్తూ వారిని కూడా ఆమంచికి మద్దతిచ్చే దిశగా నడిపేందుకు శ్రీకారం పలికారు.

అందుకు అను గుణంగానే గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన పోతుల సునీతకు పదవులిచ్చి తద్వారా చేనేత వర్గాల ప్రజలను గౌరవిస్తూ వారందరికీ కూడా ఆమంచే తిరిగి మన అభ్యర్థి అన్న సంకేతాన్ని ఇచ్చారు. ఆవిషయంపై పోతుల సునీత వర్గీయులకు కూడా స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. అయితే మాజీ మంత్రి పాలేటి రామారావు, ఆయన వెంట ఒకరిద్దరు టీడీపీ పేరుతోనే ఆమంచికి వ్యతిరేకంగా చేస్తున్న కార్యక్రమాలపై కష్ణమోహన్ తీవ్ర అసంతప్తితో ఉన్నారు.

అయితే వారిని తాము టీడీపీ నాయకులుగా గుర్తించడం లేదన్న విధంగానే ఆమంచికి సంకేతాన్ని పంపినట్లు తెలిసింది. అలాగే పార్టీలో సీనియర్ అయిన గొడుగుల గంగరాజులాంటి వారికి కూడా పదవులు ఇచ్చారు. ఇటు తొలి నుంచి పార్టీకోసం పనిచేస్తున్న వారిని గౌరవిస్తూనే, అటు సమర్థుడైన ఆమంచికి ప్రాధాన్యం పెంచారు.

ఎన్టీఆర్ వర్ధంతికి ఎమ్మెల్సీ పోతుల సునీత చీరాల రాకపోవడం కూడా ఆ ఎత్తుగడలో ఒక భాగమని భావన. ఇటు అమంచికి ప్రాధాన్యం ఇస్తూనే అటు మిగిలిన పార్టీ శ్రేణుల్లో ముఖ్యులను సమన్వయం చేసి పూర్తి స్థాయి మెజారిటీతో బాపట్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి గెలువునకు చీరాల నియోజకవర్గాన్ని కీలకం చేయాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నట్లు సమాచారం.

బీసీలకు అన్యాయం చేసినవారితో జగన్ జతకట్టారు: సీఎం చంద్రబాబు




(రాజమండ్రి సూర్య ప్రత్యేక ప్రతినిధి) :బీసీ రిజర్వేషన్లను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసిందని, దానికి జగన్ మద్దతు పలికారని సీఎం చంద్రబాబు అన్నారు. టీడీపీ 'జయహో బీసీ గర్జన' బహిరంగ సభలో పాల్గొన్న ఆయన జగన్‌పై మండిపడ్డారు. బీసీలకు అన్యాయం చేసినవారితో జగన్ జతకట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను దెబ్బతీసేందుకు వైసీపీ, బీజేపీ కుట్ర పన్నారని ధ్వజమెత్తారు. బీసీలు తమ వెనుక ఉన్నారని బీజేపీ, వైసీపీ గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు సూచించారు. తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో 34 శాతం బీసీలకు కేటాయింపును ఒక ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. ఫెడరల్ ఫ్రంట్‌ని ముందుకు తీసుకెళ్లాలంటే టీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు జరుగుతున్న అన్యాయంపై వివరణ ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్గ చేశారు. ప్రతి గ్రామంలో జయహో బీసీ గర్జన ఉధతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలువు నిచ్చారు. ప్రతిపక్షం గుండెల్లో రైళ్లు పరుగెత్తించే బాధ్యత పార్టీ శ్రేణులదేనంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు.

టీడీపీతోనే బీసీలకు గుర్తింపు : చంద్రబాబు



రాజమండ్రి, సూర్య ప్రతినిధి : టీడీపీతోనే బీసీలకు గుర్తింపు వచ్చిందని సీఎం చంద్రబాబు అన్నారు. టీడీపీ 'జయహో బీసీ గర్జన' బహిరంగ సభలో పాల్గొన్న ఆయన బీసీలకు గుర్తింపు తెచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని స్పష్టం చేశారు. చంద్రబాబు ఇంకా మాట్లాడుతూ "ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో బీసీలకు 20శాతం రిజర్వేషన్లు పెట్టారు. బీసీలు అంటే టీడీపీ, టీడీపీ అంటే బీసీలు. అన్ని వ్యవస్థల్లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చాం. వైఎస్ హయాంలో బీసీలకు ఏమీ చేయలేదు. వైఎస్ వెనుకబడిన వర్గాలను అణగదొక్కారు. రూ. 950 కోట్లతో 4 లక్షల మందికి పనిముట్లు ఇచ్చాం. టీటీడీ చైర్మన్‌గా సుధాకర్‌యాదవ్‌ని నియమించాం. కాంగ్రెస్ హయాంలో ఒక్క బీసీ అయినా ఉన్నాడా. బీసీల కోసం పోరాడిన ఏకైక ప్రభుత్వం టీడీపీనే. నేతన్నలకు రూ. 111 కోట్లు రుణమాఫీ చేశాం. వెనుకబడిన వర్గాలకు విదేశీ విద్యకు రూ. 15 లక్షలు ఇస్తున్నాం. ఎంబీసీల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. చేనేత కార్మికులకు ఇచ్చే 100 యూనిట్ల ఉచిత కరెంట్‌ను 150 యూనిట్లకు పెంచుతాం. బీసీలకు రిజర్వేషన్లు పెంచకుండా వైఎస్ అన్యాయం చేశారు. 11 బీసీ ఫెడరేషన్లను నిర్వీర్యం చేశారు. బీసీ మంత్రులను జైలుపాలు చేశారు." అని అన్నారు.

5.8 కోట్ల వ్యయంతో గిడ్డంగులు ప్రారంభం



విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : విశాఖపట్నం జిల్లా, పరవాడ మండలం పి.యెస్ బోనంగి గ్రామంలో రూ. 5.8 కోట్ల వ్యయంతో 10000 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంగల గిడ్డంగులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ ఎల్.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ ప్రారంభోత్సవం చేయగా, ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు బండారు సత్యనారాయణ, సంస్థ ఎండి కె.వి.సత్యన్నారాయణ, జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ తదితరులు హాజరయ్యారు.

కీలకం కానున్న బెజవాడ రాజకీయాలు



- రసవత్తరంగా రాజకీయ సమీకరణాలు
- బేజారెత్తిస్తున్న వలసలు


విజయవాడ, సూర్య బ్యూరో : రాబోయే సార్వత్రిక ఎన్నికలకు బెజవాడ కీలక కేంద్రం కానుంది. బెజవాడ కనకదుర్గమ్మ ఎవరిని ఆశ్వీరదిస్తుందో కాలమే నిర్ణయిస్తుంది. ఏ రాజకీయ సమీకరణం అయినా విజయవాడ రాజకీయ పరిణామాలపై ఆధారపడి వుంటుంది. దీనికి కారణం రౌడీయిజం నుండి రాజకీయ, సినిమా, రవాణా రంగాలతో విజయవాడ ప్రాధాన్యత సంతరించుకుంది. నగరం పరిధిలోని అన్ని నియోజకవర్గాలలో కూడా టీడీపీ, కాంగ్రెస్, వామపక్షాలు, ఇప్పటి జనసేనవరకు వాటివాటి స్థాయిలలో పావులు కదుపుతున్నాయి. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమా, వల్లభనేని వంశీ, బోడే ప్రసాద్, తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య, ఉప్పులేటి కల్పన తదితరులు తమ స్థాయిలో తమ స్థానాలు పదిలం కోసం విశ్వప్రయత్నం చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు. దానికి తోడు నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక హోదా సెగ ఉధృతమవుతున్న తరుణంలో అన్ని పార్టీలు తప్పనిసరిగా ఒకే వేదికపై రావాల్సిన తరుణం ఆసన్నమైందని ప్రజలు భావిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం కేంద్రంపై ప్రభావం చూపే అవకాశం వుంది. కేంద్రం, రాష్ట్రం విధించే పన్నులు కూడా ప్రజలు మోయలేని బరువుగా మారింది. టీడీపీ నుండి, వైసీపీ నుండి, కాంగ్రెసు నుండి వలసల పర్వం కొనసాగుతుంది. దీనికి ఎవ్వుడు ఆనకట్టపడుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. వీరు తమ మనుగడకోసమేనా, ప్రజా శ్రేయస్సు కోసమా పార్టీలు మారుతుందని ప్రజలు భావిస్తు న్నారు. ఇప్పటికైనా



సంస్థాగతంగా పార్టీలని బలోపేతం చేసే చర్యలు సత్వరం తీసుకోవాలని పార్టీ అభిమానులు కోరుతున్నారు. ఉదాహరణకు పశ్చిమ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయపక్షాల నాయకులు తమకు ఎన్నికల్లో పోటీ చేసే ఛాన్స్‌లను బలోపేతం చేసుకునేదిశగా పావులు కదువుతున్నారు. ఆశావహులు తమ గెలువుకోసం గట్టిగా ప్రయత్నించాలన్న ఆలోచనతో వున్నారు. 2014 ఎన్నికల్లో విజయవాడ పశ్చిమలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా గెలిచిన ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ అటుపై జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెలుగుదేశం తీర్థం వుచ్చుకున్నారు. మళ్లీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ కుమార్తెకు కేటాయించే సీటుపై విశ్లేషకులు రకరకాలు ఊహగానాలు వెలిబుచ్చుతున్నారు. ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా వైసీపీ తరువున పోటీచేసే అవకాశం తనకే దక్కుతుందన్న గట్టి నమ్మకంతో వైసీపీ విజయవాడ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పనిచేసుకుపోతున్నారు. ప్రస్తుతం వైసీపీ తరుపున మరో బలమైన అభ్యర్థి ఈ నియోజకవర్గంలో లేకపోవడం ఆయనకు కలసివచ్చే అంశం. జనసేన పార్టీ తరువున పోతిన వెంకట మహేష్ పేరు ప్రముఖంగా వినబడుతోంది. జనసేన కార్యాలయం ఏర్పాటుతో సహా ఆయన జిల్లాలో పలు కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తూ పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ వద్ద మంచి పేరు సంపాదించుకున్నారు.ఇక్కడ అధికంగా ఉన్న నగరాల సామాజిక వర్గంలో కూడా ఆయనకు మంచి పట్టు వుంది. బీసీ నాయకుడిగా గతంలో అనేక ఉద్యమాలు చేసిన అనుభవంతో పోతిన వెంకట మహేష్ ముందంజలో ఉన్నారు. వామపక్షాల విషయానికి వస్తే ఈ నియోజకవర్గంలో



గతంలో సీపీఐ తరువున పలువురు ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఇక బీజేపీ తరువున ఈ నియోజకవర్గంలో పోట ీచేసేందుకు పలువురి పేర్లు వినబడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడటంతో



ఇప్పటినుంచే ప్రజల దృష్టిని తమ వైవు తిప్పుకునేందుకు నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. కుల, మత, వర్గ సమీకరణలను కూడా జోరుగా లెక్కలు గడుతున్నారని తెలుస్తోంది. ఈ విధంగా కృష్ణాజిల్లాలో అన్ని నియోజకవర్గాలలో రకరకాలుగా విశ్లేషణలు జరుగుతున్నాయి. మల్లాది విష్ణు, వంగవీటి రాధా, దేవినేని అవినాష్ ఇలా యువనాయకులు ముందుకు రావడం కొత్తతరాన్ని కోరుకునే యువ తరంలో కొంత వరకు ఉత్తేజాన్ని నింపనుంది రాబోయే ఎలక్షన్ రాజకీయాలు. ఇక కోగంటి సత్యం లాంటి పారిశ్రామికవేత్తలు రాజకీయాలలోకి వచ్చే అవకాశం వుందను కుంటున్నారు.కోరాడ శ్రీకొరగంజి శేఖర్‌బాబు మెమోరియల్ ట్రస్టు తరువున పలు సామాజిక సేవాకార్యక్రమాలను నిర్వహిస్తూ, తమ సామాజిక వర్గంలో మంచి పట్టువున్న కొరగంజి జగన్, వైసీపీ నాయకుడు పోతిన వెంకటప్రసాదు కూడా పావులు కదువుతున్నారు. రాష్ట్రంలో మనుగడ కోసం బీజేపీ ప్రజలలోకి రాకపోవడం ఆ పార్టీకి మైనస్ పాయింటుగా భావిస్తున్నారు. సినీ గ్లామర్, సామాజికవర్గాల వారీగా నాయకులు రంగంలోకి దిగే అవకాశం ఉండడంతో ఓట్లు శాతం కూడా చీలే పరిస్థితి వుందని ప్రజలు అనుకుంటున్నారు.



విరబూసిన తెలుగు పద్మాలు

పదసిరివెన్నెల సీతారామశాస్త్రి

ఆశకే ఆయువు పోసే మధుమంత్రాలు ఆ అక్షరాలు. సామవేద సారంతో సినీసంగీత సాహిత్యపు సేద్యం చేసి తెలుగు ప్రజలహృదయ వేదికపై లలిత ప్రియ కమలాన్ని వికసింపజేసిన నిత్య కృషీవలుడు. కలువ చందన ములు పూయించి, సినీ వినీలాకాశంలో సిరివెన్నెలను కురిపించి మురిపించాడు కాబోలు చేంబోలు సీతా రాముడు సిరివెన్నెల సీతారామశాస్త్రిగా ప్రస్తుతిని పొందాడు. చేం బోలు వేంకటయోగి, శ్రీమతి సుబ్బలక్ష్మి దంపతులకు ప్రథమ సంతానం సీతారామశాస్త్రి. 1955 మే 20వ తారీఖునజన్మించారు. విద్యాభ్యాసం కాకినాడలో జరిగింది. టెలిఫోన్ శాఖలో 1983 వరకూ విధులను నిర్వహించారు. భరణి అనే కలం పేరుతో ఆంధ్రప్రభ పత్రికలో ప్రచురణలు ప్రచురితమైనాయి. శ్రీ శివానంద మూర్తి గారి అశీస్సులతో సినీగేయ రచనకు శ్రీకారంచుట్టింది ఆ కలం.

శతదళ శోభిత వికశిత స్వర్ణ కమలాలతో విశ్వనాధుని ప్రణవాక్షరార్చన చేసిన భాగవతోత్తముడు. కుదురు లేని గాలిని వెదురులోకి పంపి అజంతాక్షరాలతో శ్రీకృష్ణ తత్వాన్ని ఇష్టాక్షరి మంత్రంగా మార్చిన మరో పోతన. అచ్చతెలుగు మాటలతో రేపల్లె వాడల్లోని ఆనందలీలని ఆస్వాదించేటట్లు చేసి జాణజాణపదాలతో జ్ఞాన మెసగేరీతిలో శ్రీకృష్ణ అవతారంలోని ప్రముఖ ఘట్టాలని వర్ణించి ఔరా అనిపించేటట్లు రాయడం ఆయనకే చెల్లు.

అన్నమయ్యను ఆవాహనం చేసుకున్నాడో, ఆ కలియుగ దైవం ఆశీర్వచనాన్ని పొందాడో తెలియదు కాని తెలవారదేమో స్వామి నీ తలపుల మునకలో అలిసిన అలిమేలుమంగకు అంటూ ముక్తాయింపునిస్తూ విరచించిన అ గీతం శ్రుతిలయ బద్ధం కావడం విధాత తలంపే. అక్షరాక్షతలతో గీర్వాణిని స్తుతించి పాటల పంచామృతంతో అభిషేకించి శారద చరణ సంచారానికి పద పల్లావాలని పరచిన శతగీతకారుడు. తరలిరాని వసంతాన్ని జనాల దరికి చేర్చి సంతసాన్ని పంచిన వసంతుడు. కన్నుల కమండలంలో సముద్ర అలలని బంధించిన అగస్త్యుడు.

తెల్లారింది లెగండోయి కొక్కురోకో అంటూ జనాన్ని మేలుకొలిపి పాము లాంటి చీకటి పడగదించి పలాయనం చిత్తగించిన వైనాన్ని కళ్ళకు కట్టి గూటిలోన గువ్వ పిల్లకి కొత్తగా రెక్కలొస్తే ఎంత హృద్యంగా ఉంటుందో అక్షరాలతో సాక్షత్కరింప జేసిన అక్షరశిల్పి. జాబిలమ్మ కోపాన్ని చల్లార్చి జాజిపూల మీద జాలి చూపమని జాములాతిరి జాబిలమ్మకి జోలపాడి అల్లంత దూరాల తారకలను ఆహ్లాదపరచిన అక్షర బ్రహ్మ. క్లాస్ రూంలో తపస్సు చేయుట వేస్ట్ రా గురు అంటూ నీకు అసక్తి ఉన్న రంగంలో అభ్యాసం చేసి స్వయం కృషితో ఆశయాన్ని సాధించాలని విజయ సూత్రాన్ని చెప్పిన సుకవి. బలపం పట్టి భామ బడిలో అ ఆ ఇ ఈ నేర్చుకో అంటూ యువతని ఉర్రూతలూగించిన భావుకుడు.

సాహసం నా పథం అని ఎప్పుడూ ఓటమిని ఒప్పుకోవద్దని నిగ్గదీసి అడిగి సమాజాన్ని అగ్గి తో కడిగేసినా అర్ధ శతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్రం అనలేమని అక్షర సత్యాన్ని చెప్పిన సంస్కర్త. మంగళ సూత్రం అంగడి సరుకు కాదని ఎడారంటి ఆశల వెనుక వెంపర్లాడవద్దని కాసుల జడిలో తడిసి నిరుపేదలా మారవద్దని సాంద్రాయాలకి విలువనివ్వాలన్నవైతాళికుడు. తిరిగే కాలానికి తిరొకటి ఉన్నదని అది జీవిత పాఠాన్ని నేర్పుతుందని చెప్పిన కాలజ్ఞాని. తెలుగింటి లోగిళ్ళలో జరిగే పెళ్ళిని, పచ్చని మెడపై పురుషుడు రాసే చిలిపి రహస్యాలని రస రమ్యంగా వర్ణించి తెలుగు వారి పెళ్ళి వేడుకలను ఘనతను చెప్పిన ఘనాపాఠి.

ప్రతి పెళ్ళి ఇంటిలో ఈ సిరివెన్నెల గీతం వినిపించడం పరిపాటి. భంభం బోలే అంటూ అ బోళాశంకరుని తన పదఝరితో అభిషేకించి వారణాసిని వర్ణించి ఆ ఆనంద లహరిలో ఒలాలాడేటట్లు చేసిన పద సిరి నాధుడు నా ఉఛ్వాసం కవనం సీతారామ శాస్త్రి కలం వేడి వేడి నిశ్వాసాల శృంగార ఆశ్వాసాలని అలవోకగా అల్లేసింది కొత్త కొత్తగా ఉన్న స్వర్గాన్ని సృష్టించింది. గొప్ప సొగ స్సులని ఎక్కడ దాచావని బ్రహ్మని ప్రశ్నించింది. గుంభ న పదబంధాలతో తెలుగుపలుకుబడులని పాటగా అల్లి, అమలిన శృంగారాన్ని నైపుణ్యంతో చెప్పిన దిగ్గజ కవి. నల్లని అకాశంలోని తెల్లని చుక్కల వెలుగు వెన్నెలైనట్లు తెల్లని కాగితంపై నల్లని సిరా చుక్కలు సినీ వినీలాకాశంలో సిరివెన్నెల పాటైయింది. పదహారణాల తెలుగు పాటకు చక్కని ఉదాహరణ. అ వెన్నెల అకాశంలో ఆశల హరివిల్లు. ఆనందాలు పంచే పొదరిల్లు ప్రజ్ఞతో ప్రభవించిన సినీగీతాలు నందివర్ధనాలై కళామతల్లి పాదపీఠంపై అలంకరించ బడ్డాయి.

రుద్రవీణలోని పాటకు కళైంజర్ కరుణానిధి అవార్డు. 1986,1992,1994,1995 కళాసాగర్ అవార్డు. 1994,1995, 1998, 1999 మనస్విని అవార్డు. 1992,1996. 1999 భరతముని అవార్డు రసయయి, వంశీబర్కిలీ అవార్డు ఫిలింఫేర్ అవార్డు శాస్త్రి గారి ప్రజ్ఞకు మచ్చుతునకలు.

ఆ కవనం చంద్రుడిలో ఉండే కుందేలును క్రిందకి దింపగలదు ,గాలికి సంకెళ్ళు వేయగలదు ,అదిభిక్షువుని నిందాస్తుతి చేయగలదు, జగమంత కుటుంబంనాది అని జీవన వేదాంతాన్నివల్లె వేయగలదు. సిరివెన్నెల గీతాలు వాసిలోనూ రాశిలోనూ జాస్తే. దర్శక నిర్మాతలు ఇచ్చే స్వేఛ్చను సద్వినియోగం చేసుకున్న ఆకలం సినీగీతానికి సాహిత్యపు విలువలద్దింది. ప్రేక్షకులు సాహిత్యాన్ని అర్దంచేసుసుకుని పాటను అస్వాదించేటట్లు చేసి వారి స్థాయిని తన స్థానాన్ని సుసంపన్నం చేసుకుంది. ఆకాశంలో ఆశల హరివిల్లును సాక్షాత్కరించి ఆనందాల పొదరింట్లో పొందికగా పొదువుకున్న అక్షరాలు. భరతమాత తలరాతను మార్చిన విధాతలా గాంధీ తరతరాల యమ యాతన తీర్చిన వరదాతర గాంధీఅని నిజమైన గాందీయిజాన్ని తన పదునైన పదాల ద్వారా తెలియజెప్పి దేశభక్తిని ప్రబలింప జేసిన పాటకారి సిరివెన్నెలేమరి.

ఆది బిక్షువుని బూడిదిమ్మని ఆడిగిన నీకు పద్మాన్ని ప్రసాదించడం విధాత తలంపేఅకవితామయూఖాలు శతవసంతాలు సినీవినీలాకాశంలో తన పద సిరివెన్నెలను కురిపించాలి. నీ సినీగీత సిరులు పద్మమై విరాజిల్లినవి పద్మశ్రీ ఆందుకోనున్న నీకు ప్రణతులు శుభాబినందనలు

శ్రీధర్ వాడవల్లి
9989855445

ద్రోణవల్లి హారిక

క్రీడా ప్రపంచంలో తమ ప్రతిభాపాటవాలతో దేశ ప్రతిష్టను ఇనుమడింప జేసిన మన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చెస్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికకు పద్మపురస్కారం లభించింది. గత రెండేళ్లుగా ఈ అవార్డు కోసం దరఖాస్తు చేస్తునే ఉన్నా, ఈ పురస్కారం అందుకోని ఆమె ఊహించని విధంగా ఈ ఏడాది పద్మ విజేత అయినందుకు తన అమితానందం కుటుంబ సభ్యులతో పంచుకుంది. ఈ వురస్కారం నాలో మరింత బాధ్యతను పెంచిదని, ఇక ప్రపంచ చాంపియన్‌షిప్ దక్కించుకుని స్వర్ణాన్ని అందుకోవటమనే నా జీవిత లక్ష్యాన్ని చేరుకునేందుకు మరింత కృషి చేస్తానని, ఈ పురస్కారం తనలో మరింత ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించినట్టు చెప్పారు హారిక.

1991జనవరి12న గుంటూరులో జన్మించిన హారిక ఆరేళ్ల ప్రాయంలో చెస్‌లో ఓనమాలు దిద్దుకుని, నేడు అంతర్జాతీయ చెస్‌లో మేటి క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. 2000లో స్పెయిన్‌లో జరిగిన ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో అండర్10 బాలికల విభాగంలో రజతం గెలిచి వెలుగులోకి వచ్చింది. కోచ్ ఎన్‌వీఎస్ రామరాజు వద్ద శిక్షణ తీసుకుంటూ ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో అండర్12 విభాగంలో రజత, కాంస్యాలు సాధించింది. 2006లో ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో అండర్18 విభాగంలో స్వర్ణం.



2008 ప్రపంచ జూనియర్ చాంపియన్ షిప్‌లో స్వర్ణం, 2009 ఆసియా మహిళా చాంపియన్ 2010 లో కామన్వెల్త్ చాంపియన్‌గాఅవతరించింది. 2011లో గ్రాండ్‌మాస్టర్ హోదా పొందిన ఆమె వరుసగా మూడు ప్రపంచ చాంపియన్ షిప్‌లలో (2012, 2015, 2017) కాంస్య పతకాలను కూడా దక్కించుకుంది.

టీ అమ్మే తెలుగు వాడికి పద్మశ్రీ

తెలుగు పత్రికల్లో ఒక వార్త ఈ రోజు కనిపించలేదు. తెలుగువాళ్లకు పద్మశ్రీ వచ్చినట్లు పత్రికల్లోవచ్చిన పేర్లలో ఒక పేరు మిస్ అయింది. ఆయన చాలా చిన్నవాడు, జీవితంలో తళుకులు బెళుకులు లేని వాడు. ఎవుడూ సంపాదన మీద దృష్టిపెట్టని వాడు. ఉన్నదాంట్లో సగం, అది ఇల్లూ కావచ్చు, సంపాదన కావచ్చు, ఎవుడూ పేద పిల్లలతో పంచుకునేవాడు. ఆయనే దేవరపల్లి ప్రకాశ్ రావు. ఒరిస్సాలోని కటక్ లో టీ బంకు నడువుతూ ఉంటాడు. తన టీ స్టాల్‌తో ఆయన విప్లవం తీసుకువచ్చారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన ప్రకాశ రావు చాలా కిందట ఒరిస్సా వెళ్లి, అక్కడ రకరకాల మార్గాల్లో బతుకు పోరాటం సాగించి చవరకు టీ బంకుతో సెటిల్ అయ్యారు. అయితే, తానుంటున్న బస్తీలో పేద పిల్లలకు స్కూల్ లేకపోవడంతో తన చిన్న ఇంట్లో నే స్కూల్ తెరిచారు. తన సంపాదనలో సగంతో పిల్లల మీద ఖర్చ పెట్టి చాలా పెద్ద వాడయ్యాడు. ఆంధ్ర ప్రదేశ్ దాకా ఆయన కీర్తి రాకపోయినా, ప్రపంచ మంతా ఆయన నీరాజనాలు పట్టింది. ఈ రోజు ఆయన పద్మశ్రీ ప్రకటించారు. ఆయన కథ ఇది

ఒదిషా కటక్‌లో బక్సిబజార్ బస్తీ ఉంది. అక్కడ ఉండేవాళ్లంతా కూలీ నాలి చేసుకునే వాళ్లు, రిక్షా తోలేవాళ్లు, ఇతర కంటికి ఆనని చిన్న చిన్న పనులు చేసి బతుకు వెళ్లదీస్తున్న వాళ్లు. భారత దేశంలోని అన్ని బస్తీల లాగానే ఇది కూడా ఒక మురికి వాడ. ఈ మధ్య హఠాత్తుగా ఈ బస్తీ వార్తలకెక్కింది. జాతీయ, అంతర్జాతీయ విలేకరులు, సీనియర్ ప్రభుత్వాధికారులు, అంతర్జాతీయ ఎన్జీవోల ప్రతినిధులు బస్తీకొస్తున్నారు. బస్తీ పేరు ఎక్కడ చూసిన మారుమ్రోగుతూ ఉంది. తాజాగా ఈ మధ్య జిల్లాకలెక్టర్ కూడా వచ్చి పోయారు. దీనికంతటికీ కారణం, అక్కడున్న ఒక చిన్న చాయ్ దుకాణం, దాన్నినడిపే తెలుగోడు ఈ ప్రకాశ్ రావు. ప్రకాశ్ రావుతో ఫోన్లో మాట్లాడండి, తెలుగులో బాగున్నారా? అనడగండి. అంతే ఆయన అనర్గళంగా తెలుగులో సంభాషణ మొదలుపెట్టి, మధ్య మధ్య ఒడియాలో కి దూకుతూ, ఇంగ్లీష్ లో అలవోకగా మాట్లాడుతూ, అవుడవుడు హిందీవాడుతూ మిని ఇండియాలా ప్రత్యక్షమవుతాడు. ప్రకాశ్ రావు ఖాయిలాపడి, చచ్చిబతికినవాడు. అపరేషన్ జరుగుతున్నపుడు ఎవరో అనామకుడు చేసిన రక్తదానంతో బతికి బయటపడ్డాడు. ఈ రోజు ఇంత వాడు అయ్యాడు. ఇది జరిగి 40 సంవత్సరాలయింది. అప్పటినుంచి చావుబతుకుల్లో ఉన్నవాళ్లకి రక్తదానం చేసితీరాలనుకున్నాడు. రక్తమే కాదు, ఎంత సహాయం చేయాలో అంతచేయాలనుకున్నాడు. చేస్తున్నాడు. ఆయన రక్తదానం నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకుంది.అప్పటినుంచి ఇప్పటిదాకా ఆయన 210 సార్లు రక్తదానం, 17 సార్లు ప్లేట్ లెట్స్ దానం చేశాడు. ఇవుడు, పేద రోగులకు అసుప్రతిలో వేడి నీళ్లిందిస్తాడు, పాలు, బ్రెడ్ అందిస్తాడు, వీలయితే, పళ్లు కూడా అందిస్తాడు. ఇది రోజూ జరిగే ప్రక్రియ. ప్రకాశ్ రావు సేవ చూసి ఒక పెద్ద మనిషి ఆయన గీజర్ కొనిచ్చాడు, అధికారులు ఆసుప్రతిలో ఒక గది ఇచ్చారు. మరొకరెవర్ అంబులెన్స్ ఇచ్చారు. ఇంతకంటే మరొక ముఖ్యవిషయం ఉంది. బస్తీలో పిల్లలెవరు చదువుకోవడం లేదని, చిల్లరు తిరుగుళ్లో ఉన్నారని కనిపెట్టి, పరిస్థితి మార్చాలనుకున్నాడు.

అంతే, తన రెండుగదుల ఇంటిలో ఒక గదిని స్కూలుగా మార్చేశాడు. పిల్లలని ఒప్పించి ఇంటికి తీసుకువచ్చి, పుస్తకాలు కొనిపించి చదువు చెప్పడం మొదలుపెట్టాడు. మొదట్లో తల్లిదండ్రులు నన్నుతిట్టారు. మాపిల్లలకు పాచి పనికి వెళ్లి నాలుగు రూకలు తెచ్చే వాళ్లు. నువ్వు బడిపెట్టాక, వీళ్లు పనిమానేస్తున్నారని దబాయించారు. వాళ్లని ఒప్పించేందుకు చాలా కష్టపడ్డాను. చివరకుభోజనం నేనే పెడతాను అనిచెప్పి వాళ్ల అంగీకారం పొందాను. ఇవుడు నా గది స్కూలయింది. 70 మంది విద్యార్థులు, అయిదుగురు టీచర్లున్నారు. టీచర్ కు రు. 1500 ఇస్తాను.అందరికి భోజనం ఉచితం, అని ఎషియానెట్ కు ఫోన్లో వివరించాడు.ఇదంతా నా సొంత డబ్బే. టీ స్టాల్ లో బన్ బిస్కట్ లతో పాటు వడలు కూడా ఉంటాయి. రోజూ అన్ని ఖర్చులు పోను రు. 600 దాకా మిగులుతుంది. అందులో


దేవరపల్లి ప్రకాశ్‌రావు

స్కూల్ కోసం రు. 300 ఇస్తాను. నాకుటుంబానికైనా తగ్గిస్తాను, బడి ఖర్చు తగ్గించను. అది జీవితధ్యేయం. చిన్నవుడు డాక్టర్ కావాలని నాకు కల ఉండేది.పేదరికం, అనారోగ్యం వల్ల సాధ్యం కాలేదు. అందువల్ల ఈ పిల్లలను చదివిస్తున్నాను. కొంత మంది మెట్రిక్ లేషన్ పాస్ అయ్యారు కూడా, అని స్కూల్ ప్రగతి గురించి వివరించాడు.మధ్యాహ్నబోజనానినికి రోజూ రు. 8 కావాలి, అయితే, అంత లేదు. అందువల్ల ఉన్నంతలో చేస్తున్నాను. ఈ మధ్య కలెక్టర్ వచ్చి అభినందించారు. మధ్యహ్నం భోజనం పథకాన్ని మాస్కూల్‌కు పొడిగించాలని కోరాను. అయితే, రూల్స్ ప్రకారం ప్రయివేటు స్కూళ్లకు పథకం వర్తించదని చెప్పారు, దీనితో తాను నిరుత్సాహ పడటం లేదు అని అన్నాడు. పొద్దున పూటంతా చాయ్ దుకాణం నడిపి, మధ్యాహ్నం టీచర్ అవతారం ఎత్తుతాడు ప్రకాశ రావు. ఈ మధ్య లో ఒక రౌండ్ సైకిలేసుకుని ఆసుప్రతికి వెళ్లడం ఆయన రోజు వారి పని.

ఇంతకీ ప్రకాశరావు ఎవరు? : ప్రకాశరావు ముత్తాత దేవరపల్లి అప్పల స్వామి. 1888 ప్రాంతంలో పిల్లా జెల్లా వేసుకుని నడుచుకుంటూ తూర్పు దేశ యాత్ర ప్రారంభించారు. చివరకు వాళ్ల ఒరిస్సా కటక్ సమీపంలో ఉన్న ఒక ప్రాంతంలో మకాం వేశారు. అదివుడు తెలంగపెంటగా మారింది. తాత మంచి వంటగాడు కావడంతో బ్రిటిష్ వాళ్ల దగ్గిర కొలువు కుదిరాడు. బెంగాల్ అస్సాం తిగిరి చివరకు తెలంగపెంటకే వచ్చాడు. తండ్రి కృష్ణమూర్తి రెండోపప్రపంచయుద్ధ కాలం లో సైన్యంలో బర్మా లో పనిచేసి తిరిగొచ్చి ఒక ప్రయి వేటు కంపెనీలో అర్క్ వెల్డర్‌గా పనిచేశాడు. 1960లో టీస్టాల్ తెరిచాడు. అయితే, తండ్రి చనిపోవడం, తర్వా త టిబి వ్యాధి సోకడంతో ప్రకాశ్ రావు చదువు మానేసి టీస్టాల్ బాధ్యత తీసుకున్నాడు.

అంతర్జాతీయ అవార్డు : ఈ మధ్య బిసెంట్ సెల్ఫ్ లెస్ సర్వీస్ అవార్డు–2016కి ఆయన ఎంపిక అయ్యారు. ఆయనకు గతంలో చాలా అవార్డులొ చ్చాయి. ఇవుడాయన కీర్తి అంతర్జాతీయస్థాయికి చేరుకుంది. ఇవుడాయన వయస్సు 59 సంవత్సా రాలు. అలసటలేదు, విశ్రాంతి లేదు. ఈ సేవ ఇలా గే కొనసాగుతుందని ఉత్సాహంగా చెబుతాడు.

నీకింత ఉత్సాహం ఎలా వచ్చిందంటే ఇద్దరు కూతుర్లు న్నతండ్రికి కొంచెం గర్వం ఉండాలి. నాకు ఇద్దరు కూతు ర్లు. బాగా చదువుకున్నారు. స్థిరపడ్డారు. అదే నా ఉత్సాహానికి అసలు కారణం. నాస్కూళ్లో కూడా అడపిల్లలకు ప్రాధాన్యం. అని ముగిస్తాడు. కటక్ ఒకసారి రండి, మా స్కూలుపిల్లలను చూడాలి మీరు– అని ఫోన్లో పలకరించిన వారందరిని ఆహ్వానించడం ఆయనకు అలవాటు. పద్మశ్రీ వచ్చిన సందర్భంగా ఆయనకు అభినందనలు చెప్పండి. ఫోన్ నెంబర్. 09861235550

– జింకా నాగరాజు, తెలుగురాజ్యం.కామ్

యడ్లపల్లి వెంకటేశ్వరావు



రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడపల్లి వెంకటేశ్వరావును పద్మశ్రీ అవార్డు వరించింది. ప్రకృతి, సేంద్రియ సేద్యం విస్తృతమయ్యేలా ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మం డలం కొర్నెపాడుకు చెందిన యడ్లపల్లి వెంకటేశ్వరరావు 15 ఏళ్ల నుంచి రైతునేస్తం, ప్రకృతినేస్తం, పశునేస్తం పేరుతో మాస పత్రికలు నడువుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో మెరుగైన సేవలందించిన శాస్త్రవేత్తలు, అధికారులు, ఉద్యోగులు, పాత్రికేయులకు ఐ.వి.సుబ్బారావు పేరుతో రైతు నేస్తం అవార్డులను అంద జేస్తుంటారు.వ్యవసాయరంగంలో ఖర్చులు తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయోత్పత్తుల నాణ్యతను మెరుగుపర్చి విదేశాలకు ఎగుమతులు చేసేవిధంగా రైతులకు 15 ఏళ్ల నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్, శిక్షణ కోసం తరగతులు నిర్వహించాలని తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు రైతునేస్తం ఫౌండేషన్‌తో ఒప్పందాలు చేసుకోవటం విశేషం.

సునీల్ ఛైత్రి

సునీల్ ఛత్రీ జననం ఆగష్టు 3, 1984లో జన్మించాడు. 17 ఏళ్ల ప్రాయంలో 2002లో మోహన్ బగాన్ మ్యాచ్‌తో ఫుట్‌బాల్ క్రీడా జీవితాన్ని ప్రారంభిం చాడు. అనంతరం ఎన్నో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అత్యధిక గోల్స్ చేసిన ఘనత సాధించిన భారతీయుడిగా వినుతికెక్కాడు. ఒక భారతీయ ప్రొఫెషనల్ క్రీడాకారుడుగా ఎదిగిన అతను ఇండియన్ సూపర్ లీగ్ జట్టు బెంగళూరు, భారత జాతీయ జట్టుకు స్ట్రైకర్ వింగర్‌గా కెప్టెన్‌గానూ వ్యవహరిస్తున్నాడు. ఇప్పటివరకు అతను ఐదు రాష్ట్రాల్లోని 10 క్లబ్బులు, మూడు దేశాల్లో జరిగిన మ్యాచ్లలో ఆడాడు. ఛత్రి భారత ఫుట్బాల్ తరవున వివిధ మ్యాచ్‌లలో ఆడిన సందర్భంగా అత్యధికంగా 56 గోల్స్‌తో ప్రపంచ వుటల్లో మంచి స్ట్రైకింగ్ రేటుతో దూసుకుపోయాడు. గత ఏడాది జూన్ నాటికి దేశంలోనే ఎక్కువ గోల్స్ (కిర్‌గిస్థాన్‌పై జరిగిన మ్యాచ్‌తో 54 గోల్స్) చేసిన ఆటగాడిగా ఘనత సాధించాడు.ఒక జట్టుకు నాయకత్వం వహించడమే కాకుండా దానిని విజయవంతంగా నడిపించిన ఘనతను సాధించిన అగ్రశ్రేణి క్రీడాకారుడు. 2007, 2009, 2012లలో నెహ్రూకప్‌ను భారత్‌కు అందించడంలో కీలకంగా వ్యవహరించాడు. 2008లో జరిగిన ఎఎఫ్‌సి ఛాలెంజ్ ఫుట్‌బాల్ కప్‌లో సునీల్ ఛత్రీ పాత్ర కీలకం ఇండియన్ ఫుట్‌బాల్ జట్టు కీలక ఆటగాడు మాత్రమే కాదు అతి తక్కువ మ్యాచ్‌ల్లో ఎక్కువ గోల్స్ చేసిన క్రీడాకారునిగా ప్రపంచరికార్డు సృష్టించిన వ్యక్తి. ఆతనిని భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించడం సముచితమే.



ఆచంట శరత్ కమల్

శరత్ కమల్ జులై 12, 1982 తమిళనాడులో స్థిరపడిన తెలుగు కుటుంబంలో జన్మించిన. చెన్నై లోని లయోలా కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ఆయన బ్యాడ్మంటన్ క్రీడలో అంచెలంచెలుగా ఎదిగాడు. కమలేష్ మెహతా తర్వాత 8 సార్లు జాతీయ ఛాంపియన్‌గా నిలిచిన రెండవ భారతీయ టేబుల్ టెన్నిస్ ఆటగాడుగా పేరు సంపాదించాడు.

2004 లో కౌలాలంపూర్లో జరిగిన 16వ కామన్ వెల్త్ క్రీడలలో బంగారు పతకము గెలుపొందగా అదే ఏడాది భారత ప్రభుత్వం అర్జున వురస్కారంతో సన్మానించింది. ఇక 2006 లో కొలంబోలో జరిగిన దక్షిణ ఆసియా క్రీడలలో నాలుగు పతకములు గెలుపొందగా అదే ఏడాది మెల్బోర్న్ లో జరిగిన కామన్వెల్త్ క్రీడలలో రెండు బంగారు పతకములు సాధించాడు,2007లో ఉత్తర కొరియాలో జరిగిన ప్యోంగ్ యాంగ్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో విజేతగా నిలవగా 2008లో నాలుగవసారి జాతీయ ఛాంపియన్ సాధించి దేశాన్ని తనవైపుకు తిప్పుకున్నాడు. 2010లో న్యూఢిల్లీలోని 2010 కామ న్వెల్త్ గేమ్స్‌లో వురుషుల డబుల్స్ బంగారు పతకాన్ని గెలవడానికి సుభాజీత్ సాహ తో జతకట నిలవగా గౌహతిలో జరిగిన 71వ జాతీయ ఛాంపియన్‌గా గెలిచాడు. 2010– 11లో జర్మన్ ప్రధాన లీగ్ (బుండెస్లిగా)లో గ్రెఫ్ఫెల్లింగ్ కొరకు అగ్ర జర్మన్ టిటి ఆటగాళ్ళపై గెలుపొందిన లీగ్‌లో ఉత్తమ ఆటగాళ్ళలో ఒకడుగా నిలచాడు.2013లో జర్మనీలో ప్రతిష్టాత్మక కప్ భారత్‌కు అందించాడు. ప్రస్తుతం ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ ఉద్యోగిగా పని చేస్తున్న కమల్ అక్టోబర్, 2018 నాటికి ప్రపంచ ర్యాంక్ 31గా ఉంది.



చంద్రోదయం ఆడియో ఆవిష్కారం త్వరలో



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బయోపిక్‌గా తెరకెక్కుతున్న చిత్రం చంద్రోదయం. పి.వెంకటరమణ దర్శకత్వంలో మోహన శ్రీజ సినిమాస్ శ్వేతార్క గణపతి ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుకుంటోంది .

దర్శకుడు పి.వెంకట రమణ చిత్ర విశేషాలను వెల్లడిస్తూ.. చంద్రబాబు నాయుడు భారతదేశం గర్వించతగ్గ నాయకుడని, అపారమైన తన మేథా సంపత్తితో ఆంధ్రప్రదేశ్‌ని అగ్ర పథాన నిలిపాడని, 68 ఏళ్ల వయసులోనూ తెలుగు ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాడని అందుకే అలాంటి మహానుభావుడి కష్టం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువాళ్ళకు తెలియజేయడానికే ఈ చంద్రోదయం చిత్రాన్ని రూపొందిస్తున్నాం. చంద్రబాబు బయోపిక్ ఎందుకు తీస్తున్నావని అడిగే వాళ్లకు మా చంద్రోదయం సరైన సమాధానం చెబుతుంది. ఈ చిత్ర ఆడియో వేడుక ఈనెల 31న నిర్వహించనున్నామన్నారు. చిత్ర నిర్మాత జి జె రాజేంద్ర మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడి బయోపిక్ తీసే అదృష్టం నాకు దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది . డిజిటలైజేషన్ వర్క్ కంప్లీట్ అయ్యాక త్వరలోనే సెన్సార్ కార్యక్రమాలను పూర్తిచేసి సినిమాని విడుదల చేస్తామన్నారు!!

అవకాశమిస్తే చాలు అదే పదివేలు అనుకున్నోడు
ఇప్పుడు ఏకంగా పది కోట్లు అడుగుతున్నాడు



చాలామంది కుర్రాళ్లలానే అతను కూడా ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటూ ఆఫీసుల చుట్టూ తిరిగాడు. అవకాశమిస్తే చాలు అదే పదివేలు అనుకునేవాడు. అలాంటివాడు ఇప్పుడు ఏకంగా పది కోట్లు అడుగుతున్నాడంట.

పెళ్లిచూపులు చిత్రం కంటే ముందు విజయ్ దేవరకొండ ఒక సినిమాలో నటించినా.. అది విడుదలకు నోచుకోలేదు. పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి సినిమాల తర్వాత ఏ మంత్రం వేశావే పేరుతో విడుదలైంది. అలాగే, ద్వారక పేరుతోనూ ఒక సినిమా వచ్చింది. కానీ గీతా గోవిందం తర్వాత విజయ్ దేవరకొండ రేంజ్ మారిపోయింది. నోటా బాగా డిజప్పాయింట్ చేసినా.. సోసో అనిపించుకున్న టాక్సీవాలా సైతం కలెక్షన్ల వర్షం కురిపించడంతో.. అతని కాల్షీట్స్ కోసం నిర్మాతలు ఎగబడుతున్నారు. ఈ నేపథ్యంలో అతను తన పారితోషికాన్ని ఏకంగా పది కోట్లు చెబుతున్నాడని తెలుస్తోంది. నిజమే మరి, పోలోమని నిర్మాతలంతా ఎగబడుతుంటే.. ఏ హీరో అయినా అదే చేస్తాడు మరి!!

అనుష్కకి అవకాశం?
చిరంజీవి-కొరటాల కాంబినేషన్ సినిమాలో



ఇంతకుముందు స్టాలిన్ సినిమాలో చిరంజీవితో కలిసి ఓ ఐటం సాంగ్‌లో చిందులేసింది అనుష్క. ఆ తర్వాత చిరంజీవి రాజకీయాల్లోకి వెళ్లిపోయారు. చిరంజీవి సెకండ్ ఇన్నింగ్స్ షురూ చేసేటప్పటికి అనుష్క బాహుబలి, భాగమతి చిత్రాలతో బిజీగా ఉంది. అందుకే చిరు సరసన హీరోయిన్‌గా నటించే అవకాశం అనుష్కకి లభించలేదు. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు చిరంజీవితో కొరటాల శివ దర్శకత్వంలో రూపొందే సినిమాలో అనుష్కను తీసుకునేందుకు గట్టిగా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. సైరాలో చిరు సరసన నటిస్తున్న నయనతారకు కూడా మరోమారు ఛాన్స్ దక్కే అవకాశం ఉందని చెప్పుకుంటున్నప్పటికీ, అనుష్క వైపే చిరంజీవి, కొరటాల మొగ్గు చూపుతున్నారని సమాచారం!!

వీరి అరంగేట్రం అలా జరిగింది









సినిమా పరిశ్రమల్లో అనే కాదు.. ఏ రంగంలోనైనా ఒక్క ఛాన్స్ వస్తే చాలు తన ప్రతిభను నిరూపించుకుంటామని చాలా మంది కలలు కంటుంటారు. అలా అని ఒక్క ఛాన్స్ రాగానే క్లిక్ అవ్వడం కూడా అంత ఈజీ కాదు. కాకపోతే ముందు తమ ఉనికిని ప్రకటించుకునే అవకాశమొస్తే.. ఆ తర్వాత ప్రతిభను నిరూపించుకోవచ్చు. నేటి మన హీరోయిన్స్ కూడా కొంతమంది ఒక్క ఛాన్స్ అందుకొని.. కష్టపడి.. ట్యాలెంట్ చూపించి స్టార్ హీరోయిన్స్ అయిపోయారు. కొంతమంది ఒక్క సినిమాతోనే తెరమరుగైపోతుంటారు. కానీ కొందరు మాత్రం ఫస్ట్ ఛాన్స్‌ని బెస్ట్ ఛాన్స్‌గా మలచుకొని దూసుకుపోతుంటారు. అలా దూసుకుపోతున్న ఆ హీరోయిన్స్ ఎవరో .. వారికి ఆ ఒక్క ఛాన్స్ ఎలా వచ్చిందో.. తెలుసుకుందాం.

కీర్తి సురేష్

తన తల్లి మేనకను చూసి కీర్తి సురేష్ నటి కావాలని చిన్నతనంలోనే మైండ్‌లో గట్టిగా ఫిక్సయిపోయింది. కానీ తల్లి మాత్రం చదువు తర్వాతే ఏదైనా అని మెలిక పెట్టడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ముందు చదువు మీద దృష్టి పెట్టింది. చదువు పూర్తి అయిన వెంటనే సినిమాల్లోకి వచ్చిన కీర్తికి ఇక వెనుతిరిగి చూసుకోవలసిన అవసరం లేకపోయింది. మహానటి మూవీతో స్టార్ హీరోయిన్ హోదా అందుకుంది.

నివేదా థామస్

చెన్నైలో స్కూల్లో చదువుతున్న రోజుల్లోనే నివేదా థామస్ సినిమాలో నటించే అవకాశం వచ్చింది. ఓ మలయాళీ సినిమాలో చిన్నపాప క్యారక్టర్ చేసింది. ఈ పాత్రకే కేరళ ప్రభుత్వం నుంచి అవార్డును అందుకుంది. తెలుగులో 'జెంటిల్ మ్యాన్' సినిమాతో హీరోయిన్‌గా అడుగుపెట్టి తొలి చిత్రంతోనే మంచి విజయం అందుకొని, బిజీ హీరోయిన్ అయిపోయింది.



మెహ్రీన్ కౌర్

చిన్నతనంలో మెహ్రీన్ బొద్దుగా ఉండేది. మెహ్రీన్ తల్లికి కూతురు సన్నగా మారాలని కోరిక. ఇండియాలో ఉండగా సన్నపడమని తల్లి ఎంత చెప్పినా మెహ్రీన్ బుర్రకెక్కించుకునేది కాదు. ప్లస్ టూ అయిపోయిన తర్వాత కెనడా వెళ్లారు. అక్కడ దక్షిణాసియా నుంచి వచ్చిన అమ్మాయిలకు అందాల పోటీ నిర్వహించారట. పోటీలో పాల్గొనాలని మెహ్రీన్‌కి లేకపోయినా తల్లి బలవంతం మీద ఒప్పుకుని పేరు ఇచ్చిందట. అందుకోసం సన్నబడింది. ఆ పోటీల్లో గెలుపొందిన మెహ్రీన్‌ని పలు కంపెనీలు బ్రాండ్ అంబాసిడర్ గా ఎంపిక చేసుకున్నాయి. మోడల్‌గా బిజీగా ఉన్న సమయంలోనే మెహ్రీన్‌కి 'కృష్ణగాడి వీరప్రేమ గాథ' సినిమాలో అవకాశం వచ్చింది. అలా సన్నపడి మెరుపుతీగలా మారి వెండితెర మీద వెలుగుతోంది.

సాయి పల్లవి

చిన్నతనం నుంచే మంచి డ్యాన్సర్ అయిన సాయి పల్లవి పలు డ్యాన్స్ కార్యక్రమాల్లో పాల్గొని సినీ ప్రముఖుల దృష్టిని ఆకర్షించింది. మలయాళంలో ప్రేమమ్ సినిమాతో మంచి పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత హీరోయిన్ గా అవకాశాలు వచ్చినప్పటికీ మెడిసిన్ పూర్తయి డాక్టర్ పట్టా చేతికి వచ్చేవరకూ సినిమాల జోలికి పోకూడదని నిర్ణయి ంచుకుంది. ఆమె కోసం "ఫిదా" దర్శకుడు రెండేళ్లు ఆగి, ఆమెతోనే సినిమా చేశారు. ఇది హిట్ కావడంతో స్టార్ హీరోయిన్ అయిపోయింది.



అనుపమా పరమేశ్వరన్

మలయాళ 'ప్రేమమ్' సినిమా ఆడిషన్‌కు అనుపమ ఫోటోలు పంపిందని తెలిసి ఇంట్లో చిన్నపాటి యుద్ధమే జరిగిందట! అనుపమ సినిమాల్లోకి రావడం వారి కుటుంబ సభ్యులకు అస్సలు ఇష్టం లేదు. కుటుంబ సభ్యులు ఎంత వ్యతిరేకించినా.. 'ప్రేమమ్' సూపర్ డూపర్ హిట్ కావడం, ఆ తరువాత 'అ ఆ'లో పెద్ద విజయం అందించడంతో సినిమాల్లో వెనుతిరిగి చూసుకునే అవసరం లేకుండా పోయింది.

రాశీఖన్నా

రాశీఖన్నా సరదాగా పాల్గొన్న ఓ ఫోటోషూట్ రాశీకి సినిమా అవకాశాన్ని ఇచ్చింది. ఇంతకీ అసలు జరిగిందేమిటంటే.. వాజిలైన్ వారు రాశీ చదివే కాలేజీలో అమ్మాయిలకు ఓ ఫోటోషూట్ నిర్వహించారు. అందులో పాల్గొన్న అమ్మాయిలకు ఓ వాజిలైన్ ఫ్రీగా ఇస్తామన్నారట! ఫ్రీగా వాజిలైన్ వస్తోంది కదా అని ఫోటో తీయించుకుందట! ఆ ఫోటోను ఆ కంపెనీ వారు ఆన్‌లైన్ పెట్టారు. కట్‌చేస్తే రాశీ ఫోటో ఫెమీనా మ్యాగజైన్ కవర్‌పేజీ ప్రత్యక్షమైంది. ఆ మ్యాగజైన్ మీద రాశీ ఫోటో చూసి చాలా మంది తమ ఉత్తత్తులకు మోడల్‌గా ఆమెనే ఎంపిక చేసుకున్నారు. మోడల్‌గా బిజీగా ఉన్న సమయంలోనే 'మద్రాస్ కెఫే' సినిమాలో అవకాశం వచ్చింది. ఆ తరువాత తెలుగులో 'ఊహలు గుసగుసలాడే' చేసింది. ఈ సినిమా తర్వాత బిజీ అయిపోయింది.

అను ఇమ్మాన్యుయెల్

తండ్రి సినీ రంగానికి చెందిన వ్యక్తే కావడంతో సినిమాల్లోకి రావడానికి అను ఇమ్మాన్యుయెల్ పెద్దగా ఇబ్బంది పడలేదు. మళయాల దర్శకుడు ఒకరు అను ప్రొఫైల్ చూసి ఆమెను తన సినిమాలో హీరోయిన్‌గా చెయ్యమని అడిగారట. కానీ చదువు పూర్తి కాకపోవడంతో ఇంట్లో వాళ్ళు అప్పుడే సినిమాల్లోకి రావడానికి ఒప్పుకోలేదట. అలా చదువుకునే రోజుల్లోనే హీరోయిన్‌గా చేసే అవకాశాన్ని వదులుకుంది. టెక్సాస్‌లో చదువు పూర్తి కాగానే వచ్చి మలయాళంలో వెండితెర ప్రవేశం చేసింది. ఆ చిత్రాల్లో చూసి మన స్టార్ హీరోలు అవకాశం ఇచ్చారు.



ప్రియా ఓ ప్రియా అంటున్నాడా





మలయాళీ సెన్సేషన్ ప్రియా వారియర్ గురించి తెలిసిందే. ఒకే ఒక్క కన్నుగీటుతో వరల్డ్ వైడ్ ఫాలోయింగ్ దక్కించుకుంది. టాప్ హీరోయిన్స్ రేంజ్‌లో సామాజిక మాధ్యమాల్లో పావులరైపోయింది. ఒరు ఆధార్ లవ్ టీజర్ వీక్షించిన వెంటనే ప్రియా కోసం టాలీవుడ్ దర్శకనిర్మాతలు క్యూ కట్టారన్న ప్రచారం సాగింది. అప్పట్లోనే వింక్ గాళ్ అందచందాలకు ఫిదా అయిపోయిన బన్ని తనకో ఆఫర్ ఇచ్చాడు. కానీ ఆ టైమ్‌లో రకరకాల కమిట్మెంట్ల వల్ల ప్రియా ఆ ఆఫర్‌ని అంగీకరించకలేకపోయింది. అప్పట్లోనే విజయ్ దేవరకొండ, శర్వానంద్, నాని వంటి హీరోలు ప్రియా కోసం ఆఫర్ ఇచ్చారని ప్రచారం సాగింది. అయితే అవేవీ అప్పటికి నిజం కాలేదు.

ప్రస్తుతం ప్రియా నటించిన ఒరు ఆధార్ లవ్ తెలుగులో లవర్స్ డే పేరుతో రిలీజవుతోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజు కానుకగా దూసుకొస్తోంది. ఇటీవలే హైదరాబాద్ ప్రమోషన్స్‌లో ప్రియా వారియర్ టీమ్‌ని బన్ని బ్లెస్ చేశాడు. ఇక ఇదే ఊపులో ప్రియా వారియర్‌ను మరో లక్కీ ఛాన్స్ వరించిందని తెలుస్తోంది. నేచురల్ స్టార్ నాని సరసన తదుపరి చిత్రంలో నటించే అవకాశం ఈ భామను వెతుక్కుంటే వచ్చిందని తెలుస్తోంది.

నాని-విక్రమ్.కె.కుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న తాజా చిత్రానికి ప్రియాని ఆడిషన్స్‌కి పిలిచారట. ఆడిషన్‌లో మెప్పిస్తే ప్రియాని జాక్ పాట్ వరించినట్టే. ఇప్పటికే తనకు అనూహ్యంగా వచ్చిన క్రేజును డైజెస్ట్ చేసుకునేందుకే ప్రియా తడబడుతోంది. ఇంటిచుట్టూ చేరి తనని కలవాలనుందని అభిమానులు వెంటపడితే హౌస్ అరెస్ట్ అయ్యానని, ఆ సమయంలో ఎంతో భయపడ్డానని ప్రియా వారియర్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించడాన్ని బట్టి ఆమెకు గల క్రేజ్ అర్థం చేసుకోవచ్చు!!

వేధింపులు మరింత ఎక్కువయ్యాయి



సినీపరిశ్రమలో లైంగిక వేధింపులను బయటపెట్టినందుకే తనకు అవకాశాలు రాకుండా చేశారని నేపథ్య గాయని, డబ్బింగ్ కళాకారిణి చిన్మయి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గొంతెత్తి మాట్లాడినందుకు తనకు అవమానాలు, హేళనలు ఎదురయ్యారని వాపోయారు. తనను డబ్బింగ్ యూనియన్ నుంచి బహిష్కరించారనీ, అదే సమయంలో గేయ రచయిత వైరముత్తు గొప్ప వ్యక్తిగా చలామణి అవుతూ సన్మానాలు పొందుతున్నారని మండిపడ్డారు. ఆ సన్మానాల్లో ఒక సన్మానానికి తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి ముఖ్య అతిథిగా హాజరు కావడం ఎటువంటి సంకేతాలు పంపుతుందని ఆమె వ్యాఖ్యానించారు. భారత సమాజంలో బాధితురాలికి న్యాయం జరగడం అంత సులభం కాదని చిన్మయి వ్యాఖ్యానించారు. బాధితురాలు చనిపోతే లేదా హత్యకు గురయితేనే సమాజం సీరియస్‌గా పట్టించుకుంటుందని ఆమె దుయ్యబట్టారు. ప్రస్తుతం తాను సోషల్ మీడియా నుంచి అన్నిరకాల వేధింపులను ఎదుర్కొంటున్నానని ఆమె వాపోయారు. తనను దూర్భాషలాడుతూ ట్రోలింగ్ చేస్తున్నారనీ, 'నాతో పడుకోవడానికి ఎంత తీసుకుంటావు' అని పిచ్చిపిచ్చి సందేశాలతో వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొందరైతే తనను వ్యభిచారిణి అంటూ దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చర్చిలో బాంబు పేలుళ్లు : 27 మంది మృతి

మనీలా : ఫిలిప్పీన్స్‌లో మిలిటెంట్ల దుశ్చర్యతో 27 మంది దుర్మరణం చెందారు. దక్షిణ ఫిలిప్పీన్స్ ప్రాంతంలోని రోమన్ కాథలిక్ కాథడ్రల్ చర్చి లక్ష్యంగా రెండు బాంబు పేలుళ్లకు పాల్పడిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేకెత్తించింది. ఈ ఘటనలో 70 మందికిపైగా గాయపడినట్లు సమాచారం.ముస్లిం మిలిటెంట్ల ప్రభావం ఎక్కువగా ఉండే జోలో ప్రాంతంలోని కాథడ్రల్ చర్చికి సమీపంలో మొదటగా బాంబు పేలుడు చోటుచేసుకుంది. అనంతరం చర్చి ఆవరణలో మరో పేలుడుకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న భద్రతాబలగాలు ఘటనాస్థలికి చేరుకొని ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయి ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. క్షతగాత్రుల్లో పలువురిని హెలికాప్టర్లలో సమీపంలోని జాంబోంగా నగరానికి తరలించారు.ఈ ఘటనపై ఆ దేశ రక్షణ శాఖ కార్యదర్శి డెల్ఫిన్ లోరెన్జానా స్పందించారు. అన్ని ప్రాంతాల్లో భద్రత పెంచాలని.. ప్రార్థనాస్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని కోరినట్లు చెప్పారు. ఈ ఘటనకు బాధ్యులుగా ఇప్పటివరకూ ఏ సంస్థ ప్రకటించుకోలేదు. జోలో ద్వీపంలో అబు సయ్యఫ్ సంస్థ మిలిటెంట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ సంస్థను అమెరికా నిషేధిత జాబితాలో చేర్చింది. గత కొంత కాలంగా ఈ ఉగ్రవాద సంస్థ ఆ ప్రాంతంలో బాంబు పేలుళ్లు, కిడ్నాప్‌లు, శిరచ్ఛేదనలకు పాల్పడుతూ మారణహోమాన్ని సృష్టిస్తోంది.

కోటాపై విపక్షాల దుష్ప్రచారం

● అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం ● ఇప్పటికే ఉన్న రిజర్వేషన్లపై ప్రభావం పడదు ● అన్ని వర్గాల సంక్షేమానికి మా ప్రభుత్వం కృషి ● తమిళనాడు పర్యటనలో ప్రధాని మోడీ



మదురై : అగ్ర వర్ణ పేదలకు జనరల్ కేటగిరీలో కల్పించిన 10 శాతం కోటాకు తాము కట్టుబడి ఉన్నామని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. అన్ని వర్గాల సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అగ్ర వర్ణ కోటాపై వివిధ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తమిళనాడులోని తోపూర్‌లో ఆదివారం జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తూ ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. అన్ని వర్గాలకు విద్య, ఉపాధి అవకాశాలను తీసుకువచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోడీ చెప్పారు. ఇప్పటికే ఉన్న రిజర్వేషన్లపై ఎలాంటి ప్రభావమూ పడకుండా అగ్ర వర్ణ పేదలకు కోటాను వర్తింపజేస్తామని తెలిపారు. ఇప్పటికే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందుతున్న దళితులు, గిరిజనులు, ఓబీసీలపై ఎలాంటి ప్రభావమూ లేకుండా అగ్ర వర్ణ పేదలకు కోటా వర్తింపచేయాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తమిళనాడులో కొన్ని రాజకీయ పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం పది శాతం కోటాపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కాగా అంతకుముందు కేరళలోని కొచ్చిలో బీపీసీఎల్‌లో ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ విస్తరణ కాంప్లెక్స్‌ను ప్రధాని మోడీ జాతికి అంకితం చేశారు. మరో వైపు తమిళనాడులోని మదురైలోనూ ఎయిమ్స్ ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు.

మోడీ పర్యటనపై తమిళనాడులో నిరసన
గజ తుపాను బాధితులను పట్టించుకోలేదని ఆగ్రహం

ఇది ఇలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా తమిళనాడులో నిరసన జ్వాలలు చెలరేగాయి. మదురైలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎయిమ్స్‌ను ఆదివారం మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష ఎండీఎంకే పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్ల జెండాలు, బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మధురై వీధుల్లో పర్యటిస్తూ మోడీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమిళనాడు ప్రయోజనాలను కేంద్రం విస్మరిస్తోందని ఆరోపించారు. ప్లకార్డులపై తమ డిమాండ్లను రాసి ప్రదర్శించారు. మరో వైపు ట్విట్టర్ వేదికగా గోబ్యాక్ మోడీ హ్యాష్‌ట్యాగ్‌తో నెటిజన్లు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. గత నవంబర్‌లో తీవ్ర తుపాను ధాటికి అతలాకుతలమైన తమిళనాడును కేంద్ర ప్రభుత్వం ఆదుకోలేదని వారు సామాజిక మాధ్యమాల వేదికగా ఆరోపించారు. అయితే ఇది కొంత మంది చేయిస్తున్న తప్పుడు ప్రచారంగా బీజేపీ వర్గాలు కొట్టిపడేశాయి. మరో వైపు మధురైలోని ఓ వర్గం మాత్రం ఎయిమ్స్ స్థాపన పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గజ తుపాను తీవ్రతకు తమిళనాడులోని కొన్ని జిల్లాలో జన జీవనం అస్తవ్యస్తమైన విషయం తెలిసిందే. దీనిలో దాదాపు మూడు లక్షల మంది నిరాశ్రయులు కాగా 11 లక్షల చెట్లు తుడిచిపెట్టుకు పోయినట్లు సమాచారం.

బోరుబావిలో పడిన చిన్నారి భద్రం



భోపాల్:మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలి జిల్లా కెర్వల్‌లో ఆదివారం ఉదయం 70 అడుగుల లోతైన బోరుబావిలో పడిపోయిన రెండేళ్ల చిన్నారి వెలికితీశారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ చౌదరి తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం 8 గంటలకు తేజ్‌ప్రతాప్.. తమ గ్రామంలో బోరుబావి ఉన్న ప్రాంతంలో ఆడుకుంటూ ఒక్కసారిగా అందులో పడిపోయాడు. సమాచారం అందుకున్న జిల్లా అధికారులు, సహాయక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని, బోరుబావి పక్కన దానికి సమాంతరంగా మరో రంధ్రాన్ని తవ్వి ఆ చిన్నారిని సురక్షితంగా బయటకు తీశారు. తేజ్ శరీరంపై చిన్నపాటి గాయం కూడా కాలేదు.

స్నేహితురాలితో హార్దిక్ పటేల్ వివాహం



అహ్మదాబాద్: పాటిదార్ ఉద్యమ నాయకుడు హార్దిక్ పటేల్ తన చిన్ననాటి స్నేహితురాలు కింజల్ పారిఖ్‌ను వివాహం చేసుకున్నారు. గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లా దిగ్సార్ గ్రామంలోని హార్దిక్ ఇంటి దైవం మేల్డీ మాత గుడిలో నిరాడంబరంగా వారి పెళ్లి వేడుక జరిగింది. ఈ వివాహానికి అతికొద్ది మంది సన్నిహితులు, బంధువులను మాత్రమే ఆహ్వానించారు. హార్దిక్, కింజల్‌ల ప్రేమను అంగీకరించిన కుటుంబ పెద్దలు హార్దిక్ లాజ్‌పూర్ జైల్లోఉన్న సమయంలోనే ఇరువురికీ నిశ్చితార్థం ప్రకటించారు. కింజల్ కుటుంబం సూరత్‌లో స్థిరపడింది. హార్దిక్ స్వగ్రామం చందన్ నగరి ఈ పట్టణానికి కొద్ది దూరంలో ఉంటుంది. పారిఖ్-పటేల్ కమ్యునిటీకి చెందిన కింజల్ ప్రస్తుతం గాంధీనగర్‌లో ఎల్‌ఎల్‌బీ చదువుతోంది. పాటిదార్లకు రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్యమ నినాదంతో హార్దిక్ 2015లో తెరపైకి వచ్చారు. జనవరి 19న కోల్‌కతాలో మమతా బెనర్జీ ఆధ్వర్యంలో చేపట్టిన ఐక్యతా ర్యాలీకి కూడా హార్దిక్ హాజరయ్యారు.

ఉత్తమ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ మంత్రివర్గంలో హోం శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ అత్యుత్తమ పనితీరును ప్రదర్శించారు. ఇండియా టుడే- కార్వీ నిర్వహించిన మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వేలో పాల్గొన్న 13వేల మందిలో అత్యధికులు(50 శాతం) ఆయనకే ఓటువేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ అంశాల పై ప్రజానాడి తెలుసుకోడానికి ఈ సర్వేను నిర్వహించారు. విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ(46 శాతం), ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ(45 శాతం), రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ(39 శాతం), రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్(26 శాతం) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. ట్విటర్‌లో చురుగ్గా వ్యవహరించే సుష్మా స్వరాజ్..విదేశాల్లో చిక్కుకున్న భారతీయులకు సాయం చేయడంలో వేగంగా స్పందిస్తారని పేరు తెచ్చుకున్నారు.

ఈ నెల 31 నుంచి పార్లమెంట్ సమావేశాలు



న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీ ఖరారైంది. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు ఈ సమావేశాలను నిర్వహించనున్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఇవే చివరి పార్లమెంట్ సమావేశాలు కానున్నాయి. ఫిబ్రవరి 1న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టను న్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఈనెల 30న అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు తెలిపారు. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అనారోగ్యంతో అమెరికాలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా ఆ శాఖ బాధ్యతలను చేపట్టిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఫిబ్రవరి 1న లోక్‌సభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

చొరబాటుదారుడిపై బీఎస్ఎఫ్ కరుణ



జమ్మూ: పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించి తుపాకీ కాల్పులకు గాయపడిన యువకుడిని వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పాక్‌లోని భోల్లియన్ డా కొథే గ్రామానికి చెందిన ఫరూఖ్ అహ్మద్ సైనికులు హెచ్చరిస్తున్నా భారత సరిహద్దుల్లోకి ప్రవేశించాడు. దీంతో సైనికులు అతనిపై కాల్పులు జరపగా బుల్లెట్ తగిలి పడిపోయాడు. చనిపోయాడని మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన సిబ్బంది.. అతను బతికే ఉండటంతో వైద్యశాలకు తరలించారు. అతని వద్ద ఆయుధాలు లభించలేదనీ, మాదకద్రవ్యాల మత్తులో ఉన్నట్లు అధికారులు చెప్పారు.

వరుస బాంబు పేలుళ్లు : నలుగురు పోలీసులు మృతి

సమర్రా(ఇరాక్) : ఇరాక్ లోని అల్ షర్కత్ లో వరుస పేలుళ్లు సంభవించాయి. వరుస బాంబు పేలుళ్లలో నలుగురు ఇరాక్ పోలీసులు మృత్యువాతపడ్డారు. ఉదయం 8 గంటలకు అల్ షర్కత్ జిల్లా పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఓ బాంబు పేలింది. ఈ పేలుడులో ఇద్దరు పోలీస్ అధికారులు మృత్యువాత చెందగా..మరో 8 మంది పోలీసులు గాయపడ్డారు. గంట వ్యవధిలోనే రెండోసారి బాంబు పేలింది. ఈ ఘటనలో మరో ఇద్దరు పోలీసులు చనిపోగా..మరో ముగ్గురికి గాయాలయ్యాయని పట్టణ మేయర్ అలీ దోధా తెలిపారు.బాగ్దాద్ కు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్ షర్కత్ 2017వరకు ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ఆధీనంలో ఉండేది. అయితే ఇరాక్ ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది. అప్పటినుంచి ఐఎస్ ఉగ్రవాదులు విధ్వంసాన్ని సృష్టించడం, అధికారులను కిడ్నాప్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతూనే ఉన్నారు.


కుంభమేళాలో భక్తుల కోసం తెలుగులో సమాచారం



ప్రయాగ్‌రాజ్(యూపీ): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు దేశనలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్న విషయం తెలిసిందే. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. కుంభమేళాలకు వచ్చే భక్తులకు సూచనలు ఇస్తూ హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, తమిళ భాషల్లోనూ సూచనలు చేస్తున్నారు. అయితే తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం తెలుగులో సమాచారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీనికోసం ప్రభుత్వం 100 డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేసింది.

ఒక్క సాధువుకైనా భారత రత్న ఇచ్చారా?

● ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న పక్షపాత వైఖరి ● రాజకీయ, క్రీడా, సినిమా రంగాలకే పురస్కారాలా?
● హిందుత్వం కోసం పాటుపడేవారంటే చులకన? ● స్వామి వివేకానంద, దయానంద కంటే ఎవరు ఎక్కువ?
● పద్మ అవార్డుల ఎంపిక కమిటీపై మండిపడ్డ రామ్‌దేవ్ బాబా



లక్నో: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రకటించిన భారత రత్న అవార్డుల పట్ల ప్రముఖ యోగా గురువు రామ్‌దేవ్ బాబా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో అత్యున్నత పురస్కారమైన భారతరత్నకు ఎంపికలో ప్రభుత్వం పక్షపాతం చూపిందని ఆయన ఆరోపించారు.ఎంపిక కమిటీ సభ్యులు సాధువులను పట్టించుకోలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, 'స్వామి వివేకానంద, దయానంద సరస్వతీ దేశానికి చేసిన సేవ కంటే రాజకీయ నాయకులు, కళాకారులు చేసిన సేవలు ఎక్కువా? ఈ రోజుకీ వివేకానందుడి ప్రసంగాలు, సూక్తులు వల్లె వేస్తున్నారు కదా! మరి అలాంటి గొప్ప వ్యక్తి భారత రత్నకు అర్హుడు కాకుండా పోయారా? రాజకీయ, క్రీడా, సినీ రంగాలు చేసే గొప్ప సేవలు సాధువులు చేయడం లేదా? 70 ఏళ్లలో ఎవరైనా సరే ఏ ఒక్క సాధువుకైనా భారత రత్న ఇచ్చారా? మదర్ థెరెస్సాకి దేశ అత్యున్నత పురస్కారం ఇచ్చినప్పుడు సాధువులకు ఇవ్వడంలో ఎందుకు పక్షపాతం చూపుతున్నారు. హిందుత్వం కోసం పాటుపడే సన్యాసులను కొందరు చులకనగా చూస్తున్నారు. ఈ దేశంలో హిందూ సాధువులుగా పుట్టడం అంత పాపమా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, సామాజిక కార్యకర్త, ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త నానాజీ దేశ్‌ముఖ్ (మరణానంతరం), అసోమ్ గాయకుడు డాక్టర్ భూపేన్ హజారికాకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డులను ప్రకటించిన విషయం తెలిసిందే.

హజారికాకు భారతరత్నపై అనుమానాలు



గువాహటి: ఎంతో కాలంగా భూపేన్ హజారికాకు భారత రత్న ఇవ్వాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ ఇప్పుడే ఇవ్వడంపై అసోంలోని కొన్ని వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రానికి చెందిన వ్యక్తికి భారతరత్న వరించడం గర్వించదగ్గ విషయం అని అసోం ముఖ్యమంత్రి శర్వానం పౌరసత్వ సవరణ బిల్లును రద్దు చేయడమే అసోం ప్రజలకు హజారికా భారతరత్న కంటే పెద్ద బహుమానమని ప్రకటించాయి.
'హజారికాకు భారతరత్న ఇవ్వడం పట్ల అందరం హర్షిస్తున్నాం. కానీ పౌరసత్వ బిల్లు వివాదం కారణంగానే ఇది సంభవించిందని భావించాల్సి వస్తోంది. ఆ బిల్లును రద్దు చేయడమే హజారికాకు నిజమైన నివాళి' అని అసోం మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ అన్నారు. అలాగే అస్సాం విద్యార్థి సంఘం (ఏఏఎస్‌యూ) సైతం దీనిపై ప్రశ్నల వర్షం కురిపించింది. హజారికాకు భారతరత్న ఇవ్వాలన్న డిమాండ్ ఎంతోకాలంగా ఉంది. ఆయన బతికి ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేదు? ఇప్పుడే ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? అని ఏఏఎస్‌యూ నేత సముజ్జల్ భట్టాచార్య ప్రశ్నించారు. అసోం ప్రజల ఉనికిని ప్రమాదంలోకి నెట్టే పౌరసత్వ సవరణ బిల్లును రద్దు చేయాని డిమాండ్ చేశారు. భారతరత్న ప్రకటించిన సమయం పట్ల నిరసన గళాన్ని వినిపించిన ప్రముఖ అస్సామీ గాయకుడు జుబిన్ గార్గ్‌పై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఆలస్యమైనప్పటికీ హజారికాకు భారతరత్న ప్రకటించడం పట్ల సంతోషిస్తున్నామని ఆయన సోదరుడు సమర్ హజారికా అన్నారు. 2011లోనే బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారంతో ఆయనను గౌరవించిందని తెలిపారు. అసోంలోని సాదియా జిల్లాలో 1926లో జన్మించిన భూపేన్ హజారికా ప్రముఖ సంగీత విద్వాంసుడు. అసోం అందాలను తన పాటలతో ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి. సంగీతంతో పాటు, నటన, పాత్రికేయం, రచన, చిత్ర నిర్మాణ రంగాల్లో ఆయనకు ప్రావీణ్యం ఉంది. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, పద్మ భూషణ్ అవార్డు ఆయనను వరించాయి.

బులంద్‌షహర్ పోలీసు మొబైల్ లభ్యం
మూకదాడి ఘటనపై దర్యాప్తు ముమ్మరం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో జరిగిన మూకదాడిలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అధికారి మొబైల్ ఫోన్‌ను ఓ నిందితుడి ఇంట్లో శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డిసెంబరు 28న బులంద్‌షహర్-నోయిడా సరిహద్దులో ఈ కేసుకు సంబంధించి ప్రశాంత్ నట్ అనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం రాత్రి అతడి ఇంట్లో జరిపిన సోదాల్లో మూకదాడిలో చనిపోయిన పోలీస్ అధికారి సుబోధ్ కుమార్ సింగ్ మొబైల్ ఫోన్ లభ్యమైంది. మరో అయిదు ఫోన్లు కూడా ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు. ఆ ఫోన్లలో బులంద్‌షహర్‌లో జరిగిన హింసకు సంబంధించిన సమాచారమేదైనా లభిస్తుందేమోనన్న కోణంలో పోలీసులు ప్రయత్నిస్తున్నారు. దీనిపై పోలీస్ అధికారి అతుల్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. అనధికార వర్గాల సమాచారంతో మొబైల్ ఫోన్ ఉన్న ప్రాంతాన్ని కనుగొని స్వాధీన పరచుకున్నామని, కాల్పులు జరిపిన తుపాకి గురించి కూడా శోధన కొనసాగుతోందని చెప్పారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత విచారణలో సుబోధ్ కుమార్ సింగ్‌ను తానే చంపినట్లు ప్రశాంత్ నట్ అంగీకరించాడు. నిందితుడు మరో ఇద్దరితో కలిసి సుబోధ్‌కుమార్ తుపాకీ తస్కరించిన విషయం ఓ సెల్‌ఫోన్ వీడియో ద్వారా వెలుగులోకి వచ్చింది.జనవరి1న ఈ కేసులో మరో నిందితుడు కల్వాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్‌పై కల్వా గొడ్డలితో దాడి చేసి, వేళ్లను నరికేశాడు. తలపై కూడా బలంగా గాయపరిచాడు. దాదాపుగా రెండు నెలల క్రితం బులంద్‌షహర్‌లో జరిగిన మూకదాడి గురించి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు వెల్లువెత్తడంతో ఇప్పటి వరకూ 30మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇదే కేసులో ప్రధాన నిందితుడు భజరంగ్‌దళ్‌కు చెందిన యోగేశ్ రాజ్‌ను జనవరి 2న పోలీసులు అరెస్ట్ చేశారు.



మరో 15 హరోప్ డ్రోన్లు

● ఇజ్రాయెల్‌తో రక్షణ శాఖ సంప్రదింపులు ● ఇప్పటికే వంద మానవ రహిత యుద్ధ విమానాలు ● త్వరలో దేశీయంగా తయారీకి సన్నాహాలు
● లాడెన్‌పై నిఘాకు వినియోగించింది వీటినే



న్యూఢిల్లీ: భారత రక్షణ బలగాలను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా మరో 15 మానవరహిత యుద్ధ విమానాల(డ్రోన్) కొనుగోలుకు భారత్ సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ తరహా డ్రోన్‌ల తయారీలో పేరుగాంచిన ఇజ్రాయెల్ నుంచి వీటిని కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. హరోప్ రకానికి చెందిన డ్రోన్‌లను పరిశీలిస్తున్నారు. ఎలక్ట్రో ఆప్టికల్ సెన్సార్‌లతో పనిచేసే ఈ తరహా విమానాలు శత్రు స్థావరాలపై దాడికి ఉపయోగకరంగా ఉంటాయి. దాడి చేయడానికి ముందు లక్ష్యం చేసిన పరిసరాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి ఇవి ఎంతో తోడ్పాటును అందిస్తాయని రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. హరోప్ డ్రోన్‌ల కొనుగోలు ప్రతిపాద నలపై వచ్చే వారం జరిగే రక్షణశాఖ ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. వీటి చేరికతో మానవరహిత యుద్ధ విమానాల విషయంలో భారత్ మరింత బలోపేత మవుతుంది అని రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే హెరాన్, సెర్చర్ తరహా డ్రోన్‌లను అందిస్తున్న ఇజ్రాయెల్ ఇప్పుడు హరోప్ డ్రోన్‌లను కూడా భారత్‌కు అందించనుందన్నారు. దీంతో పాటు చీతా ప్రాజెక్టు అమలుపై సైతం చర్చించను న్నామన్నారు. ఇప్పటికే ఉన్న డ్రోన్‌లకు మరింత సాంకేతికతను జోడించి భారత ఆయుధ సంపత్తిని బలోపేతం చేయడమే ప్రాజెక్టు చీతా అని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా వాటి నిఘా, దాడి సామర్థ్యాలను పెంచనున్నామన్నారు. ఇప్పటికే 100 మానవరహిత యుద్ధ విమానాలు భారత అమ్ములపొదిలో ఉన్నాయి. ప్రాజెక్టు అనంతరం దేశీయంగా డ్రోన్ల తయారీపై సైతం దృష్టి సారిస్తామని వివరించారు.అఫ్గానిస్థాన్, ఇరాక్, పాకిస్థాన్‌లోని పలు లక్ష్యాలను ఛేదించడానికి అమెరికా మానవ రహిత యుద్ధ విమానాలను విరివిగా వాడుతోంది. లాడెన్ అంతమొందించడానికి ముందు అతని కదలికలపై నిఘా కోసం అమెరికా డ్రోన్‌లను ఉపయోగించిందని అప్పట్లో వార్తలు వెలువడ్డ విషయం తెలిసిందే.

డల్లాస్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు



డల్లాస్(అమెరికా): అమెరికాలోని డల్లాస్‌లో 70వ గణతంత్ర వేడుకలు ప్రవాస భారతీయులు ఘనంగా జరుపుకొన్నారు. నార్త్ టెక్సాస్ మహాత్మా గాంధీ స్మారక సంస్థ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. అమెరికాలోనే అతి పెద్ద గాంధీ స్మారకంగా గుర్తింపు పొందిన మహాత్మా గాంధీ మెమోరియల్ ప్లాజాలో ఈ వేడుకలు జరిగాయి. సంస్థ ఛైర్మన్ డాక్టర్ తోటకూర ప్రసాద్ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడిన ఆయన భారత రాజ్యాంగ విశిష్టతను వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుల సేవలను గుర్తుచేశారు. భారతదేశంలో ఇటీవల చోటుచేసుకున్న మార్పులను ఉటంకిస్తూ.. సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ఎంతో అభివృద్ధి సాధించామని.. చేయాల్సింది ఇంకా ఉందని గుర్తుచేశారు. భారతీయ అమెరికన్లుగా రెండు దేశాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ఇర్వింగ్ పట్టణ మేయర్ ఆస్కార్ వార్డ్ హాజరయ్యారు. ఉన్నత సమాజ నిర్మాణంలో భారతీయులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. అలాగే విశిష్ట అతిథిగా విచ్చేసిన ఇర్వింగ్ కౌన్సిల్ సభ్యుడు ఆలన్ మేగర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ అయిన భారత్, అతి పురాతన ప్రజాస్వామ్య దేశమైన అమెరికా కలిసి పనిచేయాల్సిన అవసరముందన్నారు. ఈ వేడుకల్లో సంస్థ కోఛైర్మన్ బీఎన్.రావు, కార్యదర్శి కల్వల రావు, కోశాధికారి అభిజిత్ రాయ్‌కర్‌తో పాటు దాదాపు 150 మంది ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.

ఆనకట్ట కూలిన ఘటనలో 40కి చేరిన మృతులు

బ్రమాడినో: బ్రెజిల్‌లో ఆనకట్ట కూలిన ఘటనలో మృతుల సంఖ్య 40కి చేరింది. మినాస్ గెరియాస్ రాష్ట్రంలోని బెలో హారిజాంటే నగరం సమీపంలో పరావోపెబా నదిపై ఉన్న ఈ ఆనకట్ట శుక్రవారం కొట్టుకుపోయిన విషయం విదితమే. అక్కడికి సమీపంలో ఇనుప ఖనిజం గనిని తవ్వుతున్న వలే అనే కంపెనీ ఆధ్వర్యంలో ఈ ఆనకట్ట ఉంది. దుర్ఘటన జరిగిన వెంటనే సమీప ప్రాంతాలను బురద ముంచెత్తింది. దాని ఉధృతికి దగ్గర్లోని ఓ వంతెన కుప్పకూలింది. ఇళ్లన్నీ బురదతో నిండిపోవడంతో బాధితులను హెలికాప్టర్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ దుర్ఘటనలో సుమారు 300 మంది గల్లంతయ్యారు. గల్లంతయినవారిలో ఆ కంపెనీ ఉద్యోగులు సైతం ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్ని నెలల క్రితమే జర్మనీకి చెందిన టుయెవ్ స్యూడ్ కంపెనీ ఈ ఆనకట్టను తనిఖీ చేసి ఎలాంటి లోపాలు లేవని ధ్రువీకరించింది. ఆనకట్ట కూలిపోవడంతో వలే కంపెనీపై బ్రెజిల్ పర్యావరణశాఖ శనివారం సుమారు రూ.462 కోట్ల భారీ జరిమానా విధించింది.



సూర్య స్పోర్ట్స్

పద్మశ్రీతో ఉత్సాహం వచ్చింది : హారిక



హైదరాబాద్: ఊహించని సమయంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా పద్మశ్రీ పురస్కారం రావడంపై ఆంధ్రప్రదేశ్ చెస్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక సంతోషాన్ని వ్యక్తం చేసింది. అంతర్జాతీయస్థాయిలో మరిన్ని గొప్ప విజయాలు సాధించేందుకు ఈ అవార్డు నూతనోత్సాహాన్ని ఇస్తుందని ఆమె వ్యాఖ్యానించింది. ప్రస్తుతం స్పెయిన్‌లోని జిబ్రాల్టర్ ఓపెన్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న ఆమె ఆలస్యంగానైనా పద్మశ్రీ పురస్కారం వచ్చినందుకు ఆనందంతో ఉన్నానని తెలిపింది. గత రెండేళ్లుగా ఈ అవార్డు కోసం దరఖాస్తు చేశాను. చివరి నిమిషంలో నా పేరు లేదని తెలుసుకొని నాతోపాటు తల్లిదండ్రులు నిరాశకు లోనయ్యారు. అయితే ఏనాటికైనా ఈ పురస్కారం వస్తుందని వారికి చెప్పి దీని కోసం వేచి చూడొద్దని కోరాను. ఈసారి అవార్డు వస్తుందని ఊహించని సమయంలో నా పేరు కూడా జాబితాలో ఉండటంతో అమితానందం కలిగింది. ఈ పురస్కారం నాలో మరింత బాధ్యతను పెంచింది. నా జీవిత లక్ష్యమైన ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణాన్ని అందుకునే దిశగా మరింత పట్టుదలతో కృషి చేసేందుకు కావాల్సిన విశ్వాసాన్ని ఇచ్చింది. నేనీస్థాయికి చేరుకోవడానికి సహాయపడిన వారందరికీ కృతజ్ఞతలు చెబుతున్నాను అని 28 ఏళ్ల హారిక పేర్కొంది.

పేపర్ బాయ్ నుంచి పేస్ బౌలర్



- రికార్డులు నెలకొల్పుతున్న తన్వీర్ ఉల్ హక్
- 51 వికెట్లు పడగొట్టి అందరి దృష్టినీ ఆకర్షించాడు
- మెకానిక్, పేపర్‌బాయ్‌గా పనిచేశాడు
- కోచ్ తివారీ పర్యవేక్షణలో జైపూర్‌లో కఠోర సాధన

న్యూఢిల్లీ: తన్వీర్ ఉల్ హక్‌ది ధోల్‌పూర్ జిల్లా కేంద్రం. తండ్రి టైలర్ షాపులో పని చేసేవాడు. ఆయన సంపాదనతో కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. తన్వీర్‌కు క్రికెట్ అంటే ఎక్కడలేని పిచ్చి. కుటుంబానికి ఆర్థికంగా దన్నుగా ఉండాలనే లక్ష్యంతో చిన్నపాటి ఉద్యోగాలు చేస్తూనే క్రికెట్ సాధన కొనసాగించాడు. ఉదయం ఆరింటికల్లా స్థానిక క్రికెట్ అకామీలో ప్రాక్టీస్‌కు వెళ్లి అనంతరం కారు షెడ్డులో పని చేసేవాడు. ఓ రోజు ఈ విషయం తెలిసి తండ్రి కోప్పడడంతో పని మానేయాల్సి వచ్చింది. దాంతో అద్దె సైకిల్‌పై పేపర్లు వేయడం ప్రారంభించాడు. అలా నెలకు రూ. 300 సంపాదించేవాడు. కానీ దురదృష్టవశాత్తు ఓ రోజు సైకిల్‌ను స్కూటర్ ఢీకొట్టడంతో కంటికి గాయమైంది. ఫలితంగా ఆ ఉద్యోగానికీ ఫుల్‌స్టాప్ పడింది. 2008-09లో ఆ సంఘటన జరగ్గా.. ఇక లాభంలేదని ధోల్‌పూర్ వీధుల్లో పిల్లల దుస్తులు అమ్మడం ప్రారంభించాడు. గంటలకొద్దీ తిరిగినా కనీస మొత్తం కూడా రాకపోవడంతో దానికి గుడ్‌బై చెప్పి ఫ్రెండ్‌తో కలిసి ఉద్యోగంకోసం జైపూర్ బయలుదేరాడు. అక్కడ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ ఉదయం ప్రాక్టీస్, పగలంతా రెస్ట్ తీసుకోవచ్చని భావించాడు. కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలిచిందన్న చందాన 2011లో జైపూర్ వస్తుండగా అతడి సర్టిఫికెట్లు పోయాయి. వెంటతెచ్చుకొన్న డబ్బుతో 10-15 రోజులు జైపూర్‌లో గడిపాడు. అవి కూడా అయిపోవడంతో స్వస్థలానికి పయనమవుదామనుకున్న సమయంలో సుమేంద్ర తివారీ అనే వ్యక్తి ఆపద్బాంధవుడిగా ఎదురయ్యాడు. తరువాతి కాలంలో రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అయిన తివారీ.. ధోల్‌పూర్‌లో క్రికెట్ అకాడమీ నడిపాడు. అప్పట్లో హక్ ఆ అకాడమీలో సాధన చేసి ఉండడంతో అతడిని క్రికెటర్‌గా తీర్చిదిద్దే బాధ్యతలు భుజాన వేసుకున్నాడు. తివారీ పర్యవేక్షణలో జైపూర్‌లో కఠోర సాధన చేస్తున్న రోజుల్లో..రాజస్థాన్ అండర్-22 జట్టు సెలెక్షన్స్‌కు వెళ్లాలని ఓ రోజు ఆయన నుంచి పిలుపు వచ్చింది. దాంతో తన్వీర్ ఎగిరి గంతేసినా వెళ్లేందుకు డబ్బులేకపోవడంతో ఆ ఆనందం ఆవిరైంది. అప్పుడు తివారీ రూ. రెండువేలు ఇచ్చి ఆదుకున్నా డు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీశాడు. అయినా అండర్-22 జట్టులో చోటు లభించకపోవడంతో తన్వీర్ తీవ్ర నిరాశలో మునిగాడు. ఈ తరుణంలో.. పేసర్ అనికేత్ చౌధురికి సీనియర్ జట్టులో చోటు లభించడంతో ఖాళీ అయిన అండర్-22 జట్టు స్థానాన్ని హక్‌తో భర్తీ చేశారు. అలా రాజస్థాన్ జట్టులో చోటు దక్కించుకున్న హక్.. అన్ని వయో పరిమితి జట్లలో ఆడి చివరకు 2014-15లో రాజస్థాన్ రంజీ టీమ్‌కు ఎంపికయ్యాడు. ఆ జట్టు సీనియర్లలో పంకజ్ సింగ్, దీపక్ చాహర్, అనికేత్ చౌధురి, జూనియర్లలో ఖలీల్ అహ్మద్, కమలేష్ నాగర్‌కోటి వంటి మేటి పేసర్లు ఉండేవారు. అయితే వారిలో కొందరికి వేరే అవకాశాలు లభించడం, గాయాలతో అందుబాటులో లేకపోవడంతో 2018-19 రంజీ సీజన్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం హక్‌కు లభించింది. దీన్ని అతడు చక్కగా సద్వినియోగం చేసుకుని జట్టులో మేటి పేసర్‌గా ఎదిగాడు. 51 వికెట్లతో ఈ సీజన్ అత్యధిక వికెట్లు పడగొట్టిన రాజస్థాన్ ఫాస్ట్ బౌలర్‌గా నిలిచాడు.

ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత జకోవిచ్



మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా ప్రపంచ నంబర్ వన్ నొవాక్ జకోవిచ్ నిలిచాడు. ఫైనల్‌లో ప్రపంచ నంబర్ 2 నాదల్‌పై 6-3, 6-2, 6-3 తేడాతో మూడు వరుస సెట్లలో గెలుపొంది జకోవిచ్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. జకోవిచ్ ఆస్ట్రేలియన్ టైటిల్ గెలవడం ఇది ఏడోసారి. ఈ విజయంతో జకోవిచ్ ఖాతాలో 15వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేరింది. దీంతో గ్రాండ్‌స్లామ్ టైటిళ్లలో పీట్ సంప్రాస్(14)ను నొవాక్ అధిగమించాడు. 15 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో జకోవిచ్ మూడో స్థానంలో ఉన్నాడు. 17 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో నాదల్ రెండో స్థానంలో.. 20 టైటిళ్లతో మొదటి స్థానంలో ఫెదరర్ కొనసాగుతున్నాడు.

ఇండోనేషియా మాస్టర్స్ సైనాదే



న్యూఢిల్లీ: ఇండోనేషియా మాస్టర్స్ ఛాంపియన్ టోర్నీ విజేతగా భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, తెలుగు తేజం సైనా నెహ్వాల్ నిలిచింది. ఈ టోర్నీ ప్రారంభం నుంచి అదరగొట్టిన సైనా ఫైనల్స్‌లో కరోలినా మారిన్‌తో తలప డింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో మారిన్ 10-4తో ముందంజలో ఉన్నప్పటికీ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. దీంతో ఇండోనేషియా మాస్టర్స్ ఛాంపియన్‌ను సైనా గెలుచుకుంది. కొన్ని రోజుల క్రితం జరిగిన మలేసియా మాస్టర్స్ సెమీస్‌లో మారిన్ చేతిలో సైనా పరాజయం పాలైంది. ఇండోనేషియా మాస్టర్స్ చేజిక్కించుకోవడం సైనాకిదే తొలిసారి. దీంతో పాటు ఈ ఏడాది తొలి టైటిల్‌ను సైనా తన ఖాతాలో వేసుకుంది.

ప్రతిభ చూపిన మరో నల్ల కలువ

- బేస్‌లైన్ నుంచి దూకుడుగా ఒసాకా
- బలమైన సర్వీసులు చేయడంలో దిట్ట
- గంటకు 160 కి.మీ.వేగంతో ఫోర్‌హ్యాండ్ షాట్లు
- గంటకు 200 కి.మీ. వేగంతో సర్వీస్‌లు
- యూఎస్ ఓపెన్ టైటిల్ గెలిచి సంచలనం



టోక్యో: బేస్‌లైన్ నుంచి దూకుడుగా ఆడే ఒసాకా.. ఫోర్‌హ్యాండ్ షాట్లతోపాటు బలమైన సర్వీసులు చేయడంలో దిట్ట. 16 ఏళ్ల ప్రాయంలోనే గంటకు 160 కి.మీ.వేగంతో ఫోర్‌హ్యాండ్ షాట్లు, 200 కి.మీ. వేగంతో సర్వీస్‌లు చేసేదంటే ఆమె పవర్ అర్థమవుతుంది. డబ్ల్యూటీఏ చరిత్రలో అత్యంత వేగవంతమైన సర్వీస్ చేయగల ప్లేయర్లలో ఆమె ఒకరు కావడం విశేషం. తన బలంతో విన్నర్లను అలవోకగా సంధించే నవోమి..లాంగ్ ర్యాలీలను ఆడడంలో సిద్ధహస్తురాలు. నవోమి ఒసాకా..ఈ జపాన్ ప్లేయర్ పేరు ఇప్పుడు అంతర్జాతీయ టెన్నిస్‌లో మార్మోగుతోంది. గత సంవత్సరం యూఎస్ ఓపెన్ టైటిల్ గెలిచి సంచలనం సృష్టించిన ఈ 21 ఏళ్ల చిన్నది..నాటి టైటిల్ గాలివాటం కాదని ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను సాధించడం ద్వారా నిరూపించింది. ప్రస్తుత యువ టెన్నిస్ ప్లేయర్లు ఓ మేజర్ చాంపియన్‌షిప్ గెలిస్తే.. తర్వాతి టోర్నీలో చతికిల పడుతుండడం చూస్తున్నదే. అయితే తాను ఆ కోవకు చెందిన క్రీడాకారిణిని కాదని నవోమి నిరూపించింది. ఈ నేపథ్యంలో ఆమె భవిష్యత్‌లో సెరెనా విలియమ్స్ మాదిరిగా మరో నల్ల కలువ కాగలదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. హైతీ-అమెరికా మూలాలు ఉన్న తండ్రి లియోనార్డ్ ఫ్రాంకోయ్‌సకి, జపాన్‌కు చెందిన తమాకి ఒసాకాకి 1997లో నవోమి జన్మించింది. ఆమె అక్క.. మారి ఒసాకా కూడా టెన్నిస్ ప్లేయరే. 1999లో విలియమ్స్ సిస్టర్స్ ఫ్రెంచ్ ఓపెన్‌లో అడుతుండడం చూసిన నవోమి తండ్రి..తన పిల్లలనూ టెన్నిస్ ప్లేయర్లుగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నాడు. అలా నవోమి, మారి ఈ ఆటలోకి అడుగుపెట్టారు. విలియమ్స్ సోదరీమణుల తండ్రి రిచర్డ్ విలియమ్స్ మాదిరే లియోనార్డ్ తన ఇద్దరు పిల్లలకు తొలి కోచ్‌గా తానే వ్యవహరించాడు. తన పిల్లలకోసం రిచర్డ్ రూపొందించిన బ్లూప్రింట్‌నే లియోనార్డ్ అనుసరించాడు. మూడేళ్ల ప్రాయంలోనే ఒసాకా కుటుంబం జపాన్ నుంచి అమెరికా తరలి వెళ్లగా.. సిస్టర్స్ ఇద్దరూ అక్కడ వివిధ టెన్నిస్ అకాడమీలలో శిక్షణ పొందారు. ఇక 2011లో ప్రొఫెషనల్‌గా కెరీర్ ప్రారంభించిన నవో మి.. 2014లో డబ్ల్యూటీఏ టూర్ అరంగేట్రంలోనే సంచలనం సృష్టించింది. స్టాన్‌ఫోర్డ్ క్లాసిక్ టోర్నీలో యూఎస్ ఓపెన్ మాజీ చాంపియన్ సమంతా స్టోసుర్‌ను కంగుతినిపించి టెన్నిస్ ప్రపంచం దృష్టిలో పడింది. 2018లో ఇండియానా వెల్స్ చాంపియన్‌గా నిలవడం ద్వారా మొదటిడబ్ల్యూటీఏ టైటిల్ తన ఖాతాలో వేసుకుంది. కానీ నవోమి అసలు సిసలు ప్రకంపనలు రేపింది మాత్రం యూఎస్ ఓపెన్‌లోనే. 23 గ్రాండ్‌స్లామ్‌ల విజేత, దిగ్గజ క్రీడాకారిణి సెరెనా విలియమ్స్‌ను షాక్ తినిపించి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ గెలుచుకుంది. అంతేకాదు.. గ్రాండ్‌స్లామ్ నెగ్గిన తొలి జపాన్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించింది. చెల్లితోపాటు ప్రొఫెషనల్‌గా ఎదిగిన మారి.. సోదరితో కలిసి పలు అంతర్జాతీయ టోర్నీల్లో డబుల్స్‌లో జపాన్‌కు ప్రాతినిధ్యం వహించారు.

టీమిండియాతో జాగ్రత్త

న్యూజిలాండ్ పోలీసుల ఫన్నీ పోస్టు



మౌంట్ మాంగనుయ్: న్యూజిలాండ్ పర్యటనలో భారత జట్టు వరుస విజయాలతో దూసుకుపోతోంది. నేపియర్ వన్డేలోనూ, శనివారం జరిగిన రెండో వన్డేలోనూ కోహ్లిసేన విజయం సాధించింది. అయితే వీటిని దృష్టిలో ఉంచుకుని టీమిండియాపై న్యూజిలాండ్ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో ఫన్నీ పోస్టు పెట్టారు. దీంతో ఇది వైరల్ అవుతోంది. టీమిండియా సారథి కోహ్లి ప్రవర్తన సరిగా లేదంటూ ఆసీస్ మాజీ ఆటగాళ్లు, మీడియా సైతం ఆసీస్ పర్యటనలో టీమిండియాను నిందించిన విషయం తెలిసిందే. అయితే న్యూజిలాండ్ ఆటగాళ్లు మాత్రం క్రీడా స్ఫూర్తిని నిలబెట్టుకుంటున్నారు. ఆస్ట్రేలియాకు, న్యూజిలాండ్ కు ఉన్న తేడా అదేనని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. న్యూజిలాండ్ ప్రజలకు పోలీసులు ఒక హెచ్చరిక ఇవ్వాలనుకుంటున్నారు. మన దేశానికి పర్యటన నిమిత్తం ఒక ప్రమాదకరమైన జట్టు వచ్చింది. అమాయకులైన న్యూజిలాండ్ జట్టు మీద ఆ జట్టు నేపియర్‌లోనూ, మౌంట్ మాంగనుయ్‌లనూ దాడి చేసింది. మీరు క్రికెట్ బంతిగానీ, బ్యాట్‌గానూ బయటకు తీసుకెళ్లాలనుకుంటుంటే అదనపు జాగ్రత్తలు తీసుకోండి. లేకపోతే వారు మీ మీద కూడా దాడి చేస్తారు అని టీమిండియా ఆటగాళ్ల ఫొటోను షేర్ చేశారు. పోలీసులు పెట్టిన ఫన్నీ పోస్ట్ వైరల్ అవుతోంది. నేపియర్ వేదికగా జరిగిన తొలి వన్డేలో, మౌంట్ మాంగనుయ్‌లో జరిగిన రెండో వన్డేలో టీమిండియా కివీస్ జట్టును చిత్తుగా ఓడించింది. ఐదు వన్డేల సిరీస్‌లో 2-0తేడాతో కోహ్లిసేన ఆధిక్యంలో ఉంది. మూడో వన్డే మౌంట్ మాంగనుయ్‌లో సోమవారం జరగనుంది.

అతను గూగ్లీనీ బాగా ఉపయోగిస్తాడు



మౌంట్ మాంగనీ : భారత చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌పై న్యూజిలాండ్ జట్టు కోచ్ గ్యారీ స్టెడ్ ప్రశంసల జల్లు కురిపించాడు. శనివారం న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో ఈ ఎడమ చేతి మణికట్టు స్పిన్నర్ ఆ జట్టు బ్యాటింగ్ ఆర్డర్ నడ్డి విరిచి భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. తొలి వన్డేలో నాలుగు వికెట్లు పడగొట్టిన కుల్దీప్ రెండో వన్డేలో అదే తరహా ప్రదర్శనను పునరావృతం చేసి కివీస్ బ్యాట్స్‌మెన్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. ఈ నేపథ్యంలో కివీస్ కోచ్ గ్యారీ మాట్లాడుతూ.. కుల్దీప్ ఓ తెలివైన బౌలరని కొనియాడాడు. కుల్దీప్ చాలా తెలివైన బౌలర్. ఎడమ చేతి మణికట్టు స్పిన్నర్లు చాలా అరుదు. అతను గూగ్లీలను అద్భుతంగా సంధిస్తాడు. అతన్ని ఎదుర్కొనే మార్గాన్ని కనిపెడ్తాం. తొలి వన్డేలో 7 ఓవర్ల వరకు ఒక్క వికెట్ తీయకపోవడంతో కుల్దీప్ బౌలింగ్‌ను మా బ్యాట్స్‌మెన్ సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారని భావించాను. కానీ అతని తన కోటా పూర్తయ్యే లోపే మమ్మల్ని దెబ్బతీశాడు. అతనికి చిక్కకుండా మేం ఆడితే మా జట్టుకు విజయం దక్కే అవకాశం ఉంది. అని చెప్పుకొచ్చాడు. ఇక తొలి వన్డేలో (4/39) అదరగొట్టిన కుల్దీప్.. రెండో వన్డేలోను (4/45)తో రాణించి భారత్ 90 పరుగుల విజయన్నందుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ గెలుపుతో భారత్ ఐదు వన్డేల సిరీస్‌లో 2-0తో ఆధిక్యం సాధించగా మూడో వన్డే సోమవారం జరగనుంది.

టీమ్‌లో జాదవ్.. 16 వన్డేల్లోనూ భారత్ గెలుపు



న్యూఢిల్లీ: క్రికెటర్ కేదార్ జాదవ్ అక్టోబరు 25, 2017 నుంచి 16 వన్డేల్లో ఆడితే భారత్ ఒక్క మ్యాచ్‌లో కూడా భారత్ ఓడిపోలేదు. గత ఏడాది ఆసియా కప్‌లో అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఒక మ్యాచ్‌ని మాత్రం డ్రాగా ముగించింది. ఆల్‌రౌండర్ కేదార్ జాదవ్ వన్డే టీమ్‌లో ఉంటే భారత్ గెలువు తథ్యం..! ఇది అభిమానులు అంటున్న మాట కాదు.. గత రెండేళ్లుగా రికార్డులు వెల్లడించిన వాస్తవం. మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేస్తున్న కేదార్ జాదవ్ బ్యాట్‌తో వరుస శతకాలు సాధించట్లేదు. అలా అని.. బంతితోనూ ఐదేసి వికెట్లూ పడగొట్టడం లేదు. కానీ.. అతను తుది జట్టులో ఉంటే మాత్రం టీమిండియా తిరుగులేని విజయాల్ని సాధిస్తోంది. ఎంతలా అంటే..? అక్టోబరు 25, 2017 నుంచి అతను 16 వన్డేల్లో ఆడితే భారత్ ఒక్క మ్యాచ్‌లో కూడా భారత్ ఓడిపోలేదు. గత ఏడాది ఆసియా కప్‌లో అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఒక మ్యాచ్‌ని మాత్రం డ్రాగా ముగించింది. న్యూజిలాండ్‌తో ఇటీవల నేపియర్ వేదికగా జరిగిన తొలి వన్డేలో 3 ఓవర్లు బౌలింగ్ చేసిన కేదార్ జాదవ్ 17 పరుగులిచ్చి ఒక వికెట్ మాత్రమే పడగొట్టాడు. ఆ మ్యాచ్‌లో ఓపెనర్ శిఖర్ ధావన్ (75 నాటౌట్), కెప్టెన్ విరాట్ కోహ్లి (45) నిలకడగా ఆడటంతో156 పరుగుల లక్ష్యాన్ని భారత్ 34.5 ఓవర్లలోనే ఛేదించేసింది. దీంతో.. కేదార్ జాదవ్‌కి బ్యాటింగ్ అవకాశం దక్కలేదు. ఆ తర్వాత రెండో వన్డేలో ఆఖర్లో బ్యాటింగ్‌కి వచ్చిన జాదవ్ 10 బంతుల్లో 34, 16 సాయంతో 22 పరుగులతో అజేయంగా నిలిచాడు. బంతితోనూ 6 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ పడగొట్టాడు. ఇలా ఈ రెండు వన్డేల్లోనూ అతను చేసిన ప్రదర్శన నామమాత్రమే. కానీ.. భారత్ జట్టు మాత్రం ఘన విజయాల్ని అందుకుంది. దీంతో కేదార్ జాదవ్ టీమ్‌లో ఉంటే భారత్ గెలువు ఖాయమనే మాట బలంగా వినిపిస్తోంది.

పాక్ సారథి సర్ఫరాజ్‌పై ఐసీసీ వేటు



- దక్షిణాఫ్రికా క్రికెటర్‌పై జాతి వివక్ష వ్యాఖ్యల ఫలితం
- నాలుగు మ్యాచ్‌ల నిషేధం
- సర్ఫరాజ్‌కు తక్కువ శిక్ష పడేలా దిద్దుబాటు చర్యలు
- ఇంజీ కృషితో సర్ఫరాజ్‌కు ఉపశమనం

దుబాయ్: పాకిస్తాన్ క్రికెట్ జట్టు సారథి సర్ఫరాజ్ అహ్మద్‌పై ఐసీసీ వేటు వేసింది. దక్షిణాఫ్రికా క్రికెటర్ అండిలె ఫెలుక్వాయోపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేయడంతో అతడిని నాలుగు మ్యాచ్‌లు నిషేధించింది. దీంతో ప్రస్తుతం జరుగుతున్న వన్డే సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో సర్ఫరాజ్ ఆడడు. ఫిబ్రవరి 1 నుంచి ఆరంభమయ్యే టీ20 సిరీస్‌లోనూ రెండు మ్యాచ్‌లు ఆడలేడు. ఈ నాలుగు మ్యాచుల్లో సీనియర్ క్రికెటర్ షోయబ్ మాలిక్ ఆ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. ప్రస్తుతం పాకిస్థాన్ జట్టు దక్షిణాఫ్రికాలో పర్యటిస్తోంది. సర్ఫరాజ్ ఉద్దేశపూర్వకంగా దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ అండిలె ఫెలుక్వాయోపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేశాడు. దాంతో అతడు ఐసీసీ నిబంధనలను ఉల్లంఘించినట్లయ్యింది. ఆటగాడు, సహాయక సిబ్బంది, అంపైర్, మ్యాచ్ రిఫరీ, అంపైర్ల సహాయకులు, ప్రేక్షకులపై జాతి, మతం, సంస్కృతి, రంగు, భాష ఆధారంగా వ్యాఖ్యలు చేస్తే వారిపై నిబంధనల ఉల్లంఘన అభియోగాలు నమోదు చేస్తారు అని ఐసీసీ తెలిపింది. అతడు మాకు అవసరం. ఏం జరిగిందో మనందరికీ తెలుసు. దానిపై వ్యాఖ్యానించదలుచుకోలేదు. నాకీ అవకాశం ఇచ్చారు. నేనిప్పుడు అత్యుత్తమంగా ఆడాల్సి ఉంది అని తాత్కాలిక సారథి షోయబ్ మాలిక్ అన్నాడు. టీ20 జట్టును ప్రకటించినప్పుడు సారథి సర్ఫరాజ్ అహ్మద్‌పై ఐసీసీ నాలుగు మ్యాచ్‌ల నిషేధం విధించిన సంగతి తెలియదని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధికారి ఒకరు తెలిపారు. దక్షిణాఫ్రికా క్రికెటర్ అండిలె ఫెలుక్‌వాయోపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేయడంతో సర్ఫరాజ్‌పై వేటు వేశారు. ఐసీసీ ఎప్పుడు, ఎలాంటి శిక్ష విధిస్తుందో మాకు తెలియలేదు. ఫెలుక్‌వాయోకు, దక్షిణాఫ్రికా ఆటగాళ్లకు బహిరంగంగా క్షమాపణ చెప్పిన తర్వాత నిషేధం విధిస్తారా లేదా అని సందేహం కలిగింది. సర్ఫరాజ్ తానేం చేశాడో తెలుసుకొనేందుకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తాం. వ్యాఖ్యలు చేసిన వెంటనే క్షమాపణలు చెప్పడం మంచిదైంది. ప్రస్తుత నిషేధం అతడికి జీవిత కాల పాఠంగా ఉంటుంది అని పీసీబీ వెల్లడించింది. సర్ఫరాజ్‌కు దాదావు ఎనిమిది మ్యాచ్‌ల వరకు ఐసీసీ నిషేధం విధిస్తారని పీసీబీ అధికారులు భావించారట. కాగా నాలుగు మ్యాచులే నిషేధం విధించడంతో కాస్త సంతోషపడ్డారని తెలిసింది. ప్రస్తుతం దక్షిణాఫ్రికాలోనే ఉన్న పాక్ ప్రధాన సెలక్టర్ ఇంజమామ్.. సర్ఫరాజ్‌కు తక్కువ శిక్ష పడేలా దిద్దుబాటు చర్యలు తీసుకున్నారని తెలిసింది. సఫారీ జట్టులోని హాషీమ్ ఆమ్లా, ఇమ్రాన్ తాహిర్‌తో మాట్లాడి తీవ్రతను తగ్గించాడట. ఉద్రిక్తతను పెంచొద్దని విజ్ఞప్తి చేశాడు. సర్ఫరాజ్ వ్యాఖ్యలపై జట్టు సభ్యులంతా మూకుమ్మడిగా ఫిర్యాదు చేయకుండా ఈ ముగ్గురూ ఒప్పించారని తెలిసింది. నేరుగా ఫిర్యాదు చేసుంటే శిక్ష మరింత పెరిగేది.

కాంగ్రెస్, బీజేపీ మా నాన్నను గుర్తించలేదు

న్యూఢిల్లీ: హాకీ దిగ్గజం, మేజర్ ధ్యాన్‌చంద్ సేవలను అర్థంచేసుకోవడంలో యూపీఏ, ఎన్‌డీఏ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన కుమారుడు అశోక్ కుమార్ ఆరోపించారు. ధ్యాన్‌చంద్‌కు భారతరత్న ఇవ్వాలని పంపించిన నామినేషన్లు తిరస్కరించడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో క్రీడాకారులకు భారతరత్న ఇవ్వాలని నిబంధనలు సవరించిన తర్వాత తొలి సారి సచిన్ టెండుల్కర్‌కు ఈ పురస్కారం అందజేశారు. ఏళ్లుగా ధ్యాన్‌చంద్‌కు దేశ అత్యున్నత పురస్కారం అందించాలని కోరినా ఇంకా ఇవ్వకపోవడం గమనార్హం. ప్రపంచమంతా హాకీకి ధ్యాన్‌చంద్ చేసిన సేవలు గుర్తించింది. ఆయన విగ్రహాలను భారత్‌లోనే కాదు బ్రిటన్, ఇంగ్లాండ్‌లోనూ ప్రతిష్ఠించారు. కాంగ్రెస్, భాజపా ప్రభుత్వాలు క్రీడా ప్రపంచానికి ఆయన చేసిన సేవలు, తెచ్చిన ప్రతిష్ఠలను అర్థం చేసుకోలేకపోతున్నాయి. మేం బాధపడుతున్నాం. మేమే కాదు క్రీడా ప్రేమికులంతా ధ్యాన్‌చంద్‌కు భారత్‌రత్న ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం భారత రత్నం విలువను గుర్తించాలి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు అని అశోక్ కుమార్ అన్నారు. భారత హాకీకి ప్రపంచంలో ఒక అస్థిత్వం, గుర్తింపు తీసుకొచ్చిన మహానుభావుడు మేజర్ ధ్యాన్‌చంద్. 1928 (ఆమ్‌స్టర్ డ్యామ్), 1932 (లాస్ ఏంజిలెస్), 1936 (బెర్లిన్) ఒలింపిక్స్‌లో దేశానికి వరుసగా మూడు సార్లు స్వర్ణపతకాలు అందించారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.